ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుని గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 303 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | గురువారం 29 జనవరి 2026 | పేజీలు : 8 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

## మధ్యప్రాచ్యానికి మారిన భారత చమురు కొనుగోళ్లు

భారత్ ముడి చమురు కొనుగోలు విధానాల్లో మార్పులు చేస్తోంది. అమెరికా ఆంక్షల కారణంగా రష్యా చమురు కొనుగోలు క్లిష్టంగా మారిన నేపథ్యంలో భారత్ ఇప్పుడు సురక్షితమైన వనరులను ఎంచుకుంటోంది. రియల్ టైమ్ అనలిటిక్స్ కంపెనీ కెప్లర్ డేటా ప్రకారం, రష్యన్ ముడి చమురు దిగుమతి జనవరి మొదటి మూడు వారాల్లో రోజుకు 1.1 మిలియన్ బ్యారెళ్లకు పడిపోయింది, ఇది గత నెలలో సగటున 1.21 మిలియన్ బ్యారెళ్లుగా ఉంది.

## త్వరలో యాపిల్ డిజిటల్ చెల్లింపుల సేవలు ప్రారంభం

డిజిటల్ చెల్లింపులకు సంబంధించి భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. ప్రధానంగా యూపీఐ లాంటి డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ కారణంగా లావాదేవీలు అత్యంత సులభంగా, త్వరగా జరుగుతున్నాయి. అయితే, ఈ విభాగంలో దేశీయంగా ఇప్పటికీ గూగుల్, మెటా, అమెజాన్ లాంటి గ్లోబల్ కంపెనీలు, ఫోన్‌పే, పేటీఎమ్, భారత్‌పే లాంటి దేశీయ చెల్లింపుల యాప్‌ల హవా జోరుగా సాగుతోంది.



# డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతి



అజిత్ పవార్ సహా ఐదుగురు మృతి... పలువురు సంతాపం

సీఎం ఫడ్నవీస్‌కు ప్రధాని మోదీ, అమిత్ షా ఫోన్

ప్రమాదంలో అజిత్ పవార్ సహా ఐదుగురు మృతి చెందినట్లు డీజీసీఏ ధ్రువీకరణ

ల్యాండింగ్ సమయంలో అదుపుతప్పి కూలిపోయిన విమానం

సీఎం ఫడ్నవీస్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా

స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా జరిగిన దుర్ఘటన

## భారత్-యూరోపియన్ యూనియన్ వాణిజ్య ఒప్పందం



- అమెరికా వాణిజ్య ప్రతినిధి కీలక వ్యాఖ్యలు
- ఈ ఒప్పందానికి సంబంధించిన వివరాలను పరిశీలించానన్న అమెరికా వాణిజ్య ప్రతినిధి
- దీని వల్ల భారత్‌కే ఎక్కువ ప్రయోజనం ఉంటుందన్న జెమిసన్ గ్రీర్
- ఈ ఒప్పందం ద్వారా భారత్‌దే పైచేయి అవుతుందని వ్యాఖ్య



## అభివృద్ధి చెందిన భారతే లక్ష్యం

- బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- వికసిత్ భారత్‌కు 2026 పునాది సంవత్సరం: రాష్ట్రపతి ముర్ము
- పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్.. ఈ నెల 29న ఆర్థిక సర్వే ప్రవేశపెట్టనున్న నిర్మల

# ఆశావహుల్లో ఉత్కంఠ

- పురపాలికల్లో రాజకీయ వేడి
- ఇప్పటికీ కొలిక్కిరాని అభ్యర్థుల ఎంపిక
- రాష్ట్రంలో పురపాలక ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఒక్కసారిగా వేడెక్కిన రాష్ట్ర రాజకీయాలు
- ఇంకా ఓ కొలిక్కిరాని అభ్యర్థుల ఎంపిక
- ముందుగానే ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఆయా పార్టీలు



హైదరాబాద్

పురపాలక సంఘాల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో రాజకీయ వేడి రాజుకుంది. బుధవారం నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. దీంతో మరో 15 రోజుల్లోనే ఎన్నికల ప్రక్రియ మొత్తం ముగియనుంది. ఇంత సమయం తక్కువ ఉండటంతో అన్ని పార్టీ వర్గాల్లో ఒక్కసారిగా ఎన్నికల హడావుడి మొదలైంది. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 12 మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగనున్నాయి. దీనికి సంబంధించి ఇప్పటికే అన్ని పార్టీలు కసరత్తు చేశాయి. అయినప్పటికీ అభ్యర్థుల ఖరారు అంశం ఇంకా - మిగతా3లో



## బస్సులన్నీ మేడారం వైపే!

- నగర ప్రయాణికులకు తప్పనితిప్పలు
- నగర ప్రయాణికులపై మేడారం జాతర ఎఫెక్ట్
- అధికశాతం బస్సులు మేడారంలో సేవలు
- ఉన్న పరిమిత బస్సులు సమయానికి రాకపోవడంతో ప్రయాణికులకు తప్పని తిప్పలు

## మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ ఇది యువత ఆశలకు గేమ్ ఛేంజర్

- ఎన్‌సీసీ ర్యాలీలో ప్రధాని మోదీ
- ఢిల్లీ వేదికగా ప్రధాని కీలక ప్రసంగం
- ఐరోపా దేశాలతో ఒప్పందం నవశకానికి నాంది
- స్టార్టప్‌లకు, సినిమాలకు, ఐటీకి మహర్దశ
- 99 శాతం ఎగుమతులపై పన్నులు జీరో



# అప్పుల సంఖ్య పెంచి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు

- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్ కు ప్రజలు బుద్ధి చెప్పి మున్సిపల్ ఏన్నికల్లో ప్రజకు బీఆర్ఎస్ వెంట నిలబడతారు
- మున్సిపల్ ఎన్నికల్లో గొప్ప విజయం సాధించాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు
- రెండు సంవత్సరాల్లో అన్ని రంగాల్లో విఫలం అయిన కాంగ్రెస్ పార్టీ పరిపాలనకు వ్యతిరేకంగా అందరూ కలిసికట్టుగా పోరాడి అద్భుతమైన విజయం సాధించాలి



హైదరాబాద్

ప్రజల గురించి పట్టించుకునే తీరిక, ఉద్దేశ్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని.. అందుకే ఇచ్చిన అన్నీ హామీలను తుంగలో తొక్కిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్ కు ప్రజలు బుద్ధి చెప్పి మున్సిపల్ ఏన్నికల్లో ప్రజకు బీఆర్ఎస్ వెంట నిలబడతారని కేటీఆర్ - మిగతా3లో




## రూ.87 కోట్ల విలువైన సాఫ్ట్‌వేర్ డేటా చోరీ

- మాజీ టెకీపై కేసు
- సాఫ్ట్‌వేర్‌తో పాటు సోర్స్ కోడ్‌ను వ్యక్తిగత ఇమెయిల్ ఖాతా నుంచి బయటకు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ఆ సంస్థ ఆరోపించింది
- అంతర్గత దర్యాప్తు, ఫుటేజ్, నివేదికలతో అతడ్ని నిలదీయగా సోర్స్ కోడ్‌ను దొంగిలించినట్లు అంగీకరించాడని తెలిసింది.

# అత్యంత వైభవంగా మేడారం మహాజాతర

- జాతరలో 450 సీసీ కెమెరాలు, 20 డిస్ ప్లే ప్యానెల్స్, క్లౌడ్ కౌంటింగ్ కెమెరాలు ఏర్పాటు
- జాతరకు వెళ్ళే దారిలో ప్రతి నాలుగు కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఔట్ పోస్ట్ ఏర్పాటు
- వైద్య సేవల కోసం 50 పడకల ఆసుపత్రి..30 హెల్త్ క్యాంపులు ఏర్పాటు



హైదరాబాద్ (వరంగల్)

ప్రతి రెండేళ్లకోసారి నాలుగు రోజులపాటు అత్యంత వైభవంగా జరిగే మేడారం మహాజాతర సంబురానికి సర్వం సిద్ధమైంది. మహాజాతర కోసం మేడారం ప్రాంగణమంతా సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. నేటినుంచి నాలుగు రోజులపాటు మేడారంలో మహాజాతర జరగనున్నది. జాతర తొలిఘట్టంలో భాగంగా బుధవారం సాయంత్రం కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెపైకి తీసుకువచ్చారు. ఇప్పటికే కొత్త గూడ మండలం పూనుగుండ్ల నుంచి బయలుదేరిన పగిడిద్దరాజు, ఏటూరునాగరం మండలం కొం డాయి నుంచి బయలుదేరిన గోవిందరాజులు కూడా బుధవారమే చేరుకుంటారు. ఇక్కడినుంచి మొదలయ్యే మహాజాతరలో ఈనెల 29న రెండవరోజైన గురువారం సాయంత్రం మహాఘట్టానికి తెర లేవనున్నది. - మిగతా3లో

## సంపాదకీయం

# కార్పొరేట్ల లాభాల కోసం.. అమెరికా సామ్రాజ్యవాదం

ప్రపంచంలో ప్రజాస్వామ్యం, మానవహక్కులు అనే పేర్లతో నడుస్తున్నది వాస్తవానికి కార్పొరేట్ సామ్రాజ్యవాదమే. చమురు, సహజ వనరులు, డాలర్ ఆధిపత్యం కోసం అమెరికా అనేక దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తూ దాడులు, ఆంక్షలు, రాజకీయ జోక్యాలను సాధనాలుగా మార్చుకుంది. వెనిజులా వంటి దేశాలపై జరుగుతున్న పరిణామాలు ఈ సామ్రాజ్యవాద విధానానికి స్పష్టమైన ఉదాహరణలు.. అణ్వాయుధాల యుగంలో ప్రపంచం మౌనం వహిస్తే, రేపటి మానవ భవిష్యత్తే ప్రశ్నార్థకమవుతుంది. చమురు కోసం, సహజ వనరుల కోసం, ప్రపంచ రిజర్వ్ కరెన్సీగా డాలర్ హోదా కోసం అమెరికా అగ్రరాజ్యం అనేక దేశాలపై దాడులు దండయాత్రలు చేస్తూ తన సామ్రాజ్యవాదాన్ని కార్పొరేట్ల లాభాల కోసం విచ్చలవిడిగా బరితెగించి ప్రపంచ దేశాలను అతలాకుతలం చేస్తున్నాయి. వలస పాలన కన్నా సామ్రాజ్యవాదం నేడు ప్రపంచ దేశాలను వణికిస్తూ అణ్వాయుధాలతో బెదిరిస్తూ ఉన్నందున ప్రపంచ దేశాలు కొన్ని ఈ సామ్రాజ్యవాదులపై తిరగబడితే ప్రపంచ భవిష్యత్తు ఎటుపోతుందో చెప్పడం కూడా భయమేస్తుంది. ఇతర దేశాలపై ఆధారపడి అభివృద్ధి చెందిన అమెరికా, ఇప్పుడు ప్రపంచ దేశాలను తన కనుసనల్లో పెట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. మానవ వనరులు, సాంకేతిక నైపుణ్యం, వాణిజ్యం, పెట్టుబడులు అన్నీ విదేశాలతో ముడిపడి ఉన్నప్పటికీ, ఆ ఆధారాన్నే సామ్రాజ్యవాదంగా మార్చుకుంటోంది. అమెరికా అభివృద్ధిలో భారతీయుల మేధస్సు, చైనా తయారీ, మెక్సికో వ్యవసాయం, కెనడా ఇంధనం, జర్మనీ యంత్రాలు, జపాన్-దక్షిణ కొరియా సాంకేతికత కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయినా ఈ ఆర్థిక ఆధిపత్యం ద్వారా ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తోంది. ట్రంప్ ప్రకటనలను పరిశీలిస్తే వెనిజులా చమురు సంపదపై నియంత్రణే అసలు లక్ష్యమని స్పష్టమవుతుంది. ఇరాన్, సిరియా, నైజీరియా, తాజాగా వెనుజులా అధ్యక్షుడు నికలాస్ మధురో అతని భార్యను కూడా అమెరికా బంధించి నార్కో టెర్రరిజం అని ఆరోపించి న్యూయార్క్ తరలించడం ప్రపంచ దేశాలను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఇలా ఇతర దేశాల్లో జోక్యంతో ట్రంప్ అమెరికా చరిత్రలోనే అత్యంత జోక్యందారి అధ్యక్షుడిగా మారి, సామ్రాజ్యవాద విజృంభనకు దారితీస్తున్నాడు. సోషలిజం కంటే పెట్టుబడిదారీ వ్యవస్థ మేలని, స్వేచ్ఛ, ఆర్థిక అభివృద్ధి, ప్రపంచ శాంతి వస్తాయని ప్రచారం చేశారు. కానీ వాస్తవంలో పెట్టుబడిదారులు పాలకులతో చేతులు కలిపి దేశాలను దోచుకుంటున్నారు. ప్రభుత్వాలను కూల్చడం, తమకు అనుకూలమైన వారిని అధికారంలో కూర్చోబెట్టడం ద్వారా వనరులను కైవసం చేసుకుని దేశాల భవిష్యత్తును నియంత్రిస్తున్నారు. పాలకులేమో అన్ని రంగాలను కార్పొరేట్లకు అప్పగించి రాజుల్లా వ్యవహరిస్తున్నారు. ఇలా నిస్సహాయ స్థితిలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఉన్నది. నిజానికి పెట్టుబడిదారుడే పాలకుడైనప్పుడు దోపిడీ తప్ప మరో లక్ష్యం ఉండదు. ప్రజలకు అవసరం లేని ఉత్పత్తులు కొనసాగిస్తూ దేశ సంపదను తమ గుప్పెట్లో పెట్టుకుంటున్నారు. ఈ విధంగా ప్రజాస్వామ్యం నిస్సహాయంగా మారి, దాని పేరుతోనే ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ దోపిడీ జరుగుతోంది. ఈ పెట్టుబడిదారులకు పెద్ద దిక్కు అమెరికా. అమెరికా తన సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం తన చట్టాలకు గానీ అంతర్జాతీయ చట్టాలకు గానీ కట్టుబడి ఉండదు. మార్కెట్ విస్తరణ కోసం దిగజారుతున్న తన ఆర్థిక వ్యవస్థను నిలబెట్టుకోవడం కోసం బలహీన దేశాలపై సైనిక దాడి, రాజ్యాంగం మార్పు పేరుతో ప్రజల రక్షణ కోసం అంటూ రాజకీయ బ్లాక్ మెయిలింగ్ విధానాన్ని అమెరికా అనుసరిస్తున్నది. తన ఆర్థిక ప్రయోజనాలకు భిన్నంగా వ్యవహరించే దేశాలను అమెరికా సహించదు వాటి మీద ఆర్థిక ఆంక్షలు విధిస్తుంది. ఇది ప్రత్యక్ష యుద్ధానికి మరో రూపం. వెనిజులాపై సైనిక దాడి చేసి అధ్యక్షుడు నికోలస్ మధురో అపహరించడానికి కారణం సామ్రాజ్యవాద ప్రయోజనాలే అని అమెరికా అధ్యక్షుడు తానే వివరించి చెప్పారు. నేటి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో నిజమైన పోటీ మార్కెట్లు లేవు. ఫైనాన్స్ క్యాపిటల్, స్టాక్ మార్కెట్ల ఆధిపత్యంలో దేశాల ప్రజాస్వామ్య స్వాతంత్ర్యం క్రమంగా నశిస్తోంది. సాంకేతికంగా, సైనికంగా, ఆర్థికంగా అమెరికా అగ్రరాజ్యంగా మారి కార్పొరేట్ రంగానికి పెద్దదిక్కుగా ఉంది. ఎఓఈ, వరల్డ్ బ్యాంక్, చీూ, జఔ వంటి సంస్థలను తన ప్రయోజనాలకు అనుగుణంగా ఉపయోగి స్తోంది. అణ్వాయుధాల యుగంలో యుద్ధం అంటే మానవజాతి అం తమే. ఈ పరిస్థితిలో ప్రపంచం మౌనం వహిస్తే భవిష్యత్తే ప్రమా దం లో పడుతుంది. కాబట్టి నేడు ప్రపంచం అగ్రదేశాల ఆయుధ సంపత్తి కింద నడవకూడదు. వీటి నుంచి బయటపడాలంటే డీ గ్లోబలైజేషన్,

# పజిల్లతో వినోదమూ, విజ్ఞానమూ



ప్రతి సంవత్సరం జనవరి 29న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే జాతీయ పజిల్ దినోత్సవం, మొదట చూస్తే ఒక సాధారణ వినోద దినంలా అనిపించవచ్చు. కానీ లోతుగా పరిశీలిస్తే, ఈ దినోత్సవం మానవ మేధస్సు వికాస చరిత్రను, ఆలోచనా క్రమాల పరిణామాన్ని, సమస్య పరిష్కార సంస్కృతిని గుర్తు చేసే ఒక మేధో ప్రతీకగా నిలుస్తుంది. పజిల్ అనేది కేవలం విడి ముక్కలను కలిపే ఆట కాదు; అది మానవ ఆలోచనల నిర్మాణాన్ని పరీక్షించే ఒక మానసిక వ్యాయామం. అందుకే జాతీయ పజిల్ దినోత్సవం అనేది ఆటకు అంకితం చేసిన రోజు కాకుండా, ఆలోచనకు అంకితం చేసిన రోజు అని చెప్పుకోవచ్చు. పజిల్ భావన మానవ నాగరికతతో సమకాలీనంగా పుట్టిందని చరిత్ర చెబుతోంది. ప్రాచీన ఈజిప్ట నాగరికతలో గణిత సమస్యలు, కొలతల ఆధారంగా రూపొందించిన మేధో పరీక్షలు పజిల్ స్వరూపాలుగా కనిపిస్తాయి. క్రీ.పూ. 1650 నాటికి చెందిన రైండ్ మ్యాథమెటికల్ పాపిరస్‌లో ఇప్పటికీ పరిష్కరించగలిగే గణిత పజిళ్లు లభించడం, ఆ కాలంలోనే సమస్యల పరిష్కారానికి తార్కిక ఆలోచనకు ఎంత ప్రాధాన్యం ఇచ్చారో సూచిస్తుంది. గ్రీకు తత్వవేత్తలు ప్లేటో, అరిస్టాటిల్ తమ శిష్యులకు తర్కాన్ని అలవర్చేందుకు ప్రశ్నోత్తర పద్ధతిని ఉపయోగించేవారు. ఇవన్నీ ఆధునిక పజిల్ సంస్కృతికి పునాదులుగా నిలిచాయి.

భారతీయ సంస్కృతిలో పజిల్ భావన మరింత జీవంతో కనిపిస్తుంది. వేదకాలం నుంచే సూక్తుల రూపంలో, సూత్రాల రూపంలో ప్రశ్నలు, సంకేతాలు ఉపయోగించారు. ఉపనిషత్తులలో కనిపించే 'కో అహం?', 'తత్త్వమసి' వంటి ప్రశ్నలు మానవ ఆలోచనను లోతుగా కదిలించే మేధో పజిళ్లే. పురాణాల్లో బేతాళ ప్రశ్నలు, పంచతంత్ర కథల్లో నైతిక పజిళు ,, తెనాలి రామకృష్ణుడి కథల్లో తక్షణ బుద్ధిని పరీక్షించే సంఘటనలు ? ఇవన్నీ భారతీయ పజిల్ సంప్రదాయానికి సజీవ సాక్ష్యాలు. ఈ కథలన్నింటిలో ఒకే లక్షణం స్పష్టంగా కనిపిస్తుంది ? సమస్యకు బలం కంటే బుద్ధే పరిష్కారం. ఆధునిక అర్థంలో పజిల్ చరిత్రను పరిశీలిస్తే, క్రీ.శ. 1760లో లండన్‌కు చెందిన జాన్ స్పిల్స్‌బరీ రూపొందించిన చెక్క మ్యాప్ పజిల్ ఒక కీలక మలుపుగా నిలుస్తుంది. విద్యార్థులకు భూగోళ విజ్ఞానం నేర్పాలనే ఉద్దేశంతో ఆయన తయారు చేసిన ఈ పజిల్, కాలక్రమేణా జిగ్‌సా పజిల్‌గా రూపాంతరం చెందింది. 19వ శతాబ్దం చివరికి యూరప్, అమెరికాలో పజిళ్లు కుటుంబ వినోదంగా మారాయి. 1900ల ప్రారంభంలో పత్రికల్లో క్రాస్‌వర్డ్ పజిళ్లు ప్రవేశించడం ద్వారా పజిల్ సంస్కృతి సామాన్య ప్రజల జీవితంలోకి అడుగు పెట్టింది. 1913లో 'న్యూయార్క్ వరల్డ్' పత్రికలో ప్రచురితమైన తొలి క్రాస్‌వర్డ్ పజిల్, అమెరికాలో పజిల్ విప్లవానికి నాంది పలికింది. జాతీయ పజిల్ దినోత్సవం ఆవిర్భావం కూడా ఈ పజిల్ విస్తరణకు అనుసంధానమే. అమెరికాలో మేధో వికాసాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో, పజిళ్ల సామాజిక ప్రాధాన్యాన్ని గుర్తుచేసేందుకు జనవరి 29ను ప్రత్యేక దినంగా ఎంపిక చేశారు. ఈ తేదీ ఎంపిక వెనుక స్పష్టమైన భావన ఉంది. శీతాకాలంలో శారీరక చురుకుదనం తగ్గే సమయంలో, మానసిక చురుకుదనాన్ని పెంచే చర్యలపై దృష్టి పెట్టాలనే ఉద్దేశమే దీనికి మూలం. నేడు ఈ దినోత్సవం అమెరికాకే పరిమితం కాకుండా, యూరప్, ఆసియా, ఆస్ట్రేలియా వంటి ప్రాంతాల్లోనూ గుర్తింపు పొందింది. పజిళ్ల రూపాలు కాలానుగుణంగా మారినా, వాటి లక్ష్యం మాత్రం ఒకటే ? ఆలోచనను ప్రేరేపించడం. జిగ్‌సా పజిళ్లు దృశ్య స్మృతి, సహనం, స్థలిక అవగాహనను పెంపొందిస్తాయి. క్రాస్‌వర్డ్ పజిళ్లు భాషా పరిజ్ఞానాన్ని, పదసంపదను విస్తరిస్తాయి. సూడోకు, మ్యాజిక్ స్క్వేర్ వంటి గణిత పజిళ్లు తార్కిక ఆలోచనకు పదును పెడతాయి. రిడిల్స్, బ్రెయిన్ టీజర్లు సృజనాత్మక ఆలోచనను ప్రోత్సహిస్తాయి. డిజిటల్ యుగంలో మొబైల్ యాప్‌లు, ఆన్లైన్ గేమ్స్ రూపంలో పజిళ్లు మరింత విస్తరించాయి. ప్రపంచ వ్యాప్తంగా గణాంకాలను పరిశీలిస్తే, పజిల్ గేమ్స్ మార్కెట్ విలువ 2024 నాటికి సుమారు 11 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరిందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది పజిళ్లపై పెరుగుతున్న ఆసక్తికి స్పష్టమైన సూచిక.పజిళ్లు మానవ మెదడుపై చూపే ప్రభావాన్ని శాస్త్రీయంగా పరిశీలించిన పరిశోధనలు కూడా అనేకం ఉన్నాయి. అమెరికాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ నిర్వహించిన అధ్యయనాల ప్రకారం, నిరంతరం పజిళ్లు పరిష్కరించే వారిలో జ్ఞాపకశక్తి మెరుగ్గా ఉండటమే కాకుండా, మానసిక ఒత్తిడి స్థాయి సగటున 20 నుంచి 30 శాతం వరకు తగ్గినట్లు గుర్తించారు. బ్రిటన్‌లో నిర్వహించిన మరో పరిశోధనలో, వృద్ధుల్లో సూడోకు, క్రాస్‌వర్డ్ వంటి పజిళ్లను అలవాటు చేయడం వల్ల అల్జీమర్స్ లక్షణాలు సగటున ఐదు నుంచి ఏడు సంవత్సరాల వరకు ఆలస్యంగా కనిపించినట్లు తేలింది. ఈ గణాంకాలు పజిళ్లు కేవలం వినోద సాధనాలు కాకుండా, మానసిక ఆరోగ్యానికి ఔషధాల్లాంటివని నిరూపిస్తున్నాయి. విద్యా రంగంలో పజిళ్ల పాత్ర మరింత కీలకంగా మారుతోంది. సంప్రదాయ బోధన పద్ధతుల్లో విద్యార్థి వినే స్థితిలో ఉంటే, పజిల్ ఆధారిత బోధనలో విద్యార్థి ఆలోచించే స్థితిలో ఉంటాడు. యునెస్కో నివేదికల ప్రకారం, పజిల్ ఆధారిత బోధనను అమలు చేసిన పాఠశాలల్లో విద్యార్థుల సమస్య పరిష్కార సామర్థ్యం సుమారు 40 శాతం వరకు మెరుగైనట్లు తేలింది. భారతదేశంలో కూడా నూతన విద్యా విధానం ఆలోచనా నైపుణ్యాలపై దృష్టి పెట్టడం, పజిల్ సంస్కృతికి అనుకూలమైన మార్పుగా భావించవచ్చు. సామాజికంగా చూస్తే, పజిళ్లు వ్యక్తిగత వినోదాన్ని దాటి సామూహిక అనుభూతిగా మారాయి. కుటుంబ సభ్యులు కలిసి పజిల్ పరిష్కరించడం ద్వారా పరస్పర సంభాషణ పెరుగుతుంది. కార్యాలయాల్లో టీమ్ బిల్డింగ్ కార్యక్రమాల్లో పజిళ్లను ఉపయోగించడం ద్వారా సమన్వయం, సహకారం పెరుగుతుందని కార్పొరేట్ అధ్యయనాలు సూచిస్తున్నాయి. పజిల్ అనేది ఒక సమస్య మాత్రమే కాదు; అది ఒక సంభాషణకు, ఒక ఆలోచనా ప్రయాణానికి ప్రారంభ బిందువు. జాతీయ పజిల్ దినోత్సవం ఇచ్చే ప్రధాన సందేశం చాలా సరళమైనదే అయినా లోతైనది. వేగంగా మారుతున్న ప్రపంచంలో తక్షణ పరిష్కారాల కోసం పరుగులు తీస్తున్న మనిషికి, పజిళ్లు ఓర్పు, క్రమబద్ధత, లోతైన ఆలోచన అవసరమని గుర్తు చేస్తాయి. ప్రతి సమస్యకు బలం, శక్తి అవసరం లేదని; సరైన ఆలోచన ఉంటే పరిష్కారం దొరుకుతుందనే నమ్మకాన్ని పజిళ్లు నాటుతాయి.

జనవరి 29న జరుపుకునే జాతీయ పజిల్ దినోత్సవం, మేధస్సు ఆరోగ్యాన్ని పండుగలా జరుపుకునే అరుదైన సందర్భం. వినోదం పేరుతో ఆలోచనను పక్కన పెట్టే కాలంలో, ఆలోచననే వినోదంగా మార్చిన సంస్కృతికి ఇది ప్రతీక. పజిళ్లు మనిషిని ఆటలో ముంచుతూనే, ఆలోచనలో నిలిపేస్తాయి. అందుకే ఈ దినోత్సవం ఒక తేదీ మాత్రమే కాదు; మానవ మేధస్సు విలువను గుర్తు చేసే ఒక నిరంతర సందేశం.

# భారత పత్రిక రంగ పితామహుడు

ఉదయం తలుపులు తెరవగానే వార్తాపత్రిక శుభోదయం అంటూ ముడిచుకుపోయి పలకరిస్తుంది. ప్రతి రోజు ఉదయం వార్తల విందును వడ్డిస్తుంది. దినపత్రిక చూడని రోజు ఏదో తెలియని వెలితి వెంటాడుతుంది. వార్తాపత్రిక రాని వేళ మనసు నిలవదు, దినచర్య సజావుగా సాగదు. కాఫీ చప్పరిస్తూ పేపర్ చదివితే ఆ మజానే వేరు. దినపత్రిక ఉషోదయాన చదవడమనే అలవాటు ఉన్న వారు ఎందరో. ప్రజాస్వామ్య సౌధానికి, పార్లమెంటరీ వ్యవస్థకు 4వ పిల్లర్‌గా పిలువబడే మీడియా నేడు పలు సవాళ్లను ఎదుర్కొంటున్నది. ఇలాంటి పలు రకాల మీడియాల్లో వార్తాపత్రికలు ప్రముఖంగా నిలబడుతూ ప్రతి దినం ప్రపంచ వార్తలను మన కళ్ల ముందు ఉంచుతాయి. దేశ గళాలుగా పత్రికలు నిలుస్తున్నాయి. ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య పటిష్టమైన వారధిగా పత్రికలు సేవలు చేస్తున్నాయి. అవినీతిని బయట పెట్టడం, అక్రమార్కుల భరతం పట్టడం, సమ్మిళిత అభివృద్ధికి ఉత్ప్రేరకంగా నిలవడం, పేదల పక్షాన నిలబడి పోరాడడం లాంటి ప్రధాన కర్తవ్యాలను నిర్వహిస్తున్న వార్తాపత్రికల మనుగడను నేటి డిజిటల్ సాంకేతిక వేదికలు మసకబారుస్తున్నాయి. భావ ప్రకటన స్వేచ్ఛకు ప్రతిరూపంగా వార్తాపత్రికలు నిలవాలి. నేటి ఆధునిక భారతంలో వార్తాపత్రికలు ప్రభుత్వాలకు వంత పలకడం, ఏదో ఒక పక్షాల నిలిచి వార్తలను తమకు అనుకూలంగా రాయడం లాంటి పోకడలతో ప్రజల్లో వార్తాపత్రికల మీద ఉన్న సదాభిప్రాయాన్ని సన్నగిల్లేలా చేస్తున్నానే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. విలువలతో కూడిన నిష్పక్షపాత వార్తలను అందించే పత్రికలు రోజు రోజుకు తగ్గుతున్నాయనే అభిప్రాయం కూడా క్రమంగా బలపడుతున్నదని నిపుణులు, విశ్లేషకులు వాపోతున్నారు.మానవాళి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, సామాజిక న్యాయాలు, ప్రభుత్వ పాలనలో మంచి చెడ్డలు, పౌరసమాజాన్ని జాగృత పరచడం, పౌరులకు అవసర సమాచార వితరణ లాంటి ప్రధాన భూమికలు నిర్వహిస్తున్న నేటి వార్తాపత్రిక ప్రాధాన్యాన్ని ప్రచారం చేయడంతో పాటు జర్నలిస్టులు, ఎడిటర్లు, పబ్లిషర్ల అమూల్య సేవలను ప్రస్తుతించడానికి ప్రతి ఏట 29 జనవరి రోజున మన దేశంలో "భారతీయ వార్తాపత్రికల దినోత్సవం(ఇండియన్ న్యూస్ పేపర్స్ డే)" నిర్వహించుట ఆనవాయితీగా మారింది. భారతదేశంలో తొలిసారి జేమ్స్ ఆగస్టస్ హెక్కీ నాయకత్వంలో "హిక్కీస్ బెంగాల్ గెజిట్" అనే వారపత్రిక కలకత్తా నుంచి 29



జనవరి 1780న వెలువడింది. ఈ వార్తా పత్రిక నిష్పక్షపాతంగా, నిక్కచ్చిగా వార్తలను ప్రజలకు చేర్చడంతో భయపడిన నాటి బ్రిటీష్ ప్రభుత్వం 1782లో దానిని రద్దు చేయడం కూడా జరిగింది. భారతీయ వార్తాపత్రికల దినోత్సవం-2026 ఇతివృత్తంగా "సాధికారత, విషయ చైతన్యం కలిగిన సమాజం కోసం విశ్వసనీయమైన జర్నలిజం" అనబడే అంశాన్ని తీసుకోవడం ద్వారా దాని ప్రాముఖ్యతను తెలియజేసినట్లు అవుతున్నది. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడం, ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య అనుసంధాన కర్తలుగా నిలవడం, భావప్రకటనా స్వేచ్ఛను కాపాడడం, అవినీతి అక్రమాలు జరుగకుండా 'వాచ్‌డాగ్' వలె పని చేయడం, పేదల పక్షపాతిగా నిలవడం, సమయానుకూలంగా ప్రపంచ వార్తలను మన ఇంటికి/కంటికి/మనసు లోతుల్లోకి చేర్చడం, ప్రజలను బలోపేతం చేయడం, ప్రభుత్వాలు నిర్ణయాలను తీసుకోవడంలో సహకరించడం, ప్రజల బతుకు వెతలను వేలెత్తి చూపడం, ప్రజలను చైతన్యవంతం చేయడం లాంటి అనేక ప్రధాన ప్రయోజనాలను కలిగిస్తున్న వార్తాపత్రికలు మానవాళి నిత్యజీవితంగా ఓ ప్రధానమైన భాగమై మన జీవితాలతో అవిభాజ్యమైన అనుబంధాలను కలిగి ఉన్నాయి. ఇలాంటి ప్రయోజనాలకు తోడుగా ప్రజలను విద్యావంతులుగా మార్చడం, చదివే కళను పెంచి పోషించడం, సమాచార జ్ఞాన నైపుణ్యాలను పెంచడం, పారిభాషిక పదకోశాలను పెంచడం, భాషపై పట్టు సాధించే సాధనాలుగా ఉపయోగం, సమకాలీన సమస్యలను లోతుగా విశ్లేషించడం, పౌరసమాజ మంచి చెడ్డలను బయట పెట్టడం, రహస్య చీకటి ఒప్పందాలను బయట పెట్టడం లాంటి పలు అదనపు ప్రయోజనాలను వార్తాపత్రికలు కలిగి ఉన్నాయి. పత్రికా స్వేచ్ఛయే ప్రజాస్వామ్యం అని, జర్నలిజం లేకుండా నిజమైన స్వేచ్ఛరాదని తెలుసుకుందాం. సమ్మిళిత సామాజిక అభివృద్ధికి పత్రికలు ఉత్ప్రేరకాలు అని, వార్తాపత్రికలు ప్రజలకు అమూల్య సేవకులని భావించాలి. డిజిటల్ టెక్నాల జీ వరదలో సంప్రదాయ వార్తాపత్రికల ఆదరణ క్రమంగా కొట్టుకుపోతున్నది. ఆన్‌లైన్ పత్రికలు, సోషల్ మీడియా పోస్టింగ్స్‌తో పాఠకుల్లో వార్తాపత్రికల పట్ల దృష్టికోణం మారుతున్నది. క్షణాల్లో డిజిటల్ వేదికల్లో ప్రపంచ వార్తలు ప్రజలకు చేరుతున్నాయి. టీవీ చానెల్స్ 24 గంటల వార్తలతో పేపర్ చదవాలనే వాంఛ కూడా క్రమంగా తగ్గుతున్నది. వార్తాపత్రికల్లో ప్రకటనల రెవిన్యూ తగ్గడం, వినియోగదారుల అభిరుచులు మారడం, వార్తాపత్రికల మధ్య పోటీతత్వం పెరగడం, వార్తాపత్రికల ముద్రణ/నిర్వహణ ఖర్చులు పెరగడం, ప్రాంతీయ భాషలు పుట్టుకురావడం, డిజిటల్ వేదికలు ఏకీకరణ కాకపోవడం, వార్తాపత్రికపై నమ్మకాలు సన్నగిల్లడం, పర్యావరణ అంశాలు, ఎల్లో జర్నలిజం, కరోనా విపత్తు లాంటి సవాళ్ల నడుమ వార్తాపత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది, మారుతూనే ఉన్నది. రానున్న రోజుల్లో వార్తాపత్రిక మనుగడ సుసాధ్యం కావడానికి నిక్కచ్చి వార్తలను అందించడం, నాణ్యమైన సమాచారం చేరవేయడం, డిజిటల్ ఇంటిగ్రేషన్ సాధించడం, ప్రతిభావంతులైన నిజాయి తీపరులు మాత్రమే విలేకరులుగా సేవలు అందించడం, తటస్థ పాత్రలో పత్రికలను నడపడం, పాఠకుల అభిరుచుల ఆధారంగా పత్రికల్లో సమయానుకూలంగా మార్పులు చేయడం, ప్రభుత్వాలు తమ ప్రకటనలతో ప్రోత్సహించడం, మెరుగైన ఖచ్చితమైన సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం లాంటి చర్యలు తీసుకోవడం పత్రికా యాజమా న్యాలకు తప్పనిసరి అని గమనించాలి. వేగవంతమైన డిజిటల్ నరుడికి పేపరు చదివే ఓపిక సన్నగిల్లడంతో సంప్రదాయ వార్తాపత్రికల మనుగడ ప్రమాదకరంగా మారుతున్నది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని "భారతీయ వార్తాపత్రికల దినోత్సవ" వేదికగా పౌర సమాజం పత్రికను ఆదరిస్తూ, అన్ని విషయాలను అంశాలను అవగాహన చేసుకుంటూ బాధ్యతగల పౌరులుగా నిలుద్దాం, మన వార్తాపత్రికలను మనమే కాపాడుకుందాం.

# డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతి

మహారాష్ట్రలో ఘోర విషాదం చోటుచేసుకుంది. రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం బారామతి సమీపంలో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. విమానంలో ప్రయాణిస్తున్న ఇదుగురూ మరణించినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అధికారికంగా ధ్రువీకరించింది. బుధవారం ఉదయం ముంబై నుంచి బయలుదేరిన విమానం, సుమారు 9 గంటల సమయంలో బారామతి వద్ద ల్యాండింగ్ అవుతుండగా అదుపుతప్పి కూలిపోయింది. ప్రమాద తీవ్రతకు విమానంలో మంటలు చెలరేగి, దట్టమైన పొగలు అలముకున్నాయి. విమాన శకలాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. జిల్లా పరిషత్, పంచాయతీ సమితి ఎన్నికల నేపథ్యంలో బారామతిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొనేందుకు ఆయన వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది.

మహారాష్ట్రలో జరిగిన విమాన ప్రమాదంలో ఉపముఖ్యమంత్రి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ చీఫ్ అజిత్ పవార్ మరణించారు. విమానం ల్యాండ్ అవుతుండగా ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో అజిత్ పవార్‌తో సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. బుధవారం పుణెలోని బారామతిలో జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారంలో అజిత్ పవార్ పాల్గొనాల్సి ఉంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా నాలుగు కీలక ప్రజాసభలకు అజిత్ పవార్ హాజరుకావాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే ఆయన ముంబై నుంచి బారామతికి విమాన ప్రయాణం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఉదయం ముంబయి నుంచి బారామతికి వీఎస్ఆర్ సంస్థకు చెందిన లీర్‌జెట్-45 విమానంలో బయలుదేరారు. బారామతిలో ల్యాండ్ అవుతుండగా 8:45 గంటల సమయంలో ఆయన విమానం అకస్మాత్తుగా కుప్పకూలింది. దీంతో భారీగా మంటలు చెలరేగాయి. విమానం పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే సంబంధిత వర్గాలు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. సాంకేతిక లోపం కారణంగానే ఈ ఘటన జరిగినట్లుగా తెలుస్తోంది. విమానంలో అజిత్ పవార్‌తో పాటు మరో ఇద్దరు భద్రతా సిబ్బంది, ఇద్దరు క్రూ సభ్యులు ఉన్నారు.



### ధ్రువీకరించిన డీసీజీఏ

మరోవైపు బారామతి విమాన ప్రమాదాన్ని పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) ధ్రువీకరించింది. విమానం ప్రమాదంలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని పేర్కొంది. అయితే బుధవారం ఉదయం 8:45 గంటలకు బారామతిలోని రన్‌వే థ్రెషోల్డ్ వద్ద క్రాష్ ల్యాండింగ్ జరిగిందని వెల్లడించింది. ఈ ప్రమాదంలో అజిత్ పవార్‌తో సహా ఐదుగురు మృతి చెందినట్లు తెలిపింది. ఘటనాస్థలి నుంచి ఇప్పటికే మూడు మృతదేహాలను వెలికితీసినట్లు పుణె ఎస్పీ సందీప్ సింగ్ గిల్ తెలిపారు. వాటిని గుర్తించేందుకు ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

అజిత్ పవార్, ఎన్సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ సోదరుడి కుమారుడు. 2023లో ఎన్సీపీ రెండుగా చీలింది. అందులో ఒక వర్గానికి అజిత్ పవార్ ఆధ్వర్యంలో, మరో వర్గం శరద్ పవార్ నాయకత్వంలో కొనసాగుతోంది. ఆ తర్వాత అజిత్ పవార్ ఎన్డీఏ ప్రభుత్వంలో చేరి మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ రెండు వర్గాలు కలిసి పోటీ చేసి అందరినీ ఆశ్చర్యపర్చాయి. అజిత్ పవార్- శరద్ పవార్ మళ్లీ కలిసిపోవడంపై ఎన్సీపీ వర్గాలు ఆనందం వ్యక్తం చేశారు. అయితే ఆనందం ఎంతో కాలం నిలవకుండానే అజిత్ పవార్ చనిపోవడంతో పార్టీ వర్గాలను కలిచివేస్తోంది.

### ప్రధాని మోదీ, మంత్రి అమిత్ షా దిగ్భ్రాంతి

ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారు వెంటనే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు ఫోన్ చేసి ప్రమాద వివరాలను, తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాద వార్త తెలియగానే అజిత్ పవార్ కుటుంబ సభ్యులు హుటాహుటిన ఘటనా స్థలానికి బయలుదేరారు. సమాచారం అందుకున్న వెంటనే అత్యవసర సేవలు, భద్రతా బలగాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. మూడు మృతదేహాలను బారామతి మెడికల్ కాలేజీకి తరలించామని, మృతుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని పుణె ఎస్పీ తెలిపారు. డీజీసీఏ అధికారుల బృందం కూడా ప్రమాద స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించింది.

### 1982లో రాజకీయ ప్రస్తానం

అజిత్ పవార్ 1959 జులై 22న అహ్మదాబాద్ జిల్లా డియోలాలీ ప్రవరాలో జన్మించారు. ఆయన మాజీ సీఎం శరద్ పవార్ సోదరుడి కుమారుడు. డియోలాలీ ప్రవరాలోనే పాఠశాల విద్యాభ్యాసం జరిగింది. తండ్రి మరణంతో కాలేజీ విద్యను మధ్యలోనే వదిలేశారు. 1982లో అజిత్ పవార్ రాజకీయ ప్రస్థానం మొదలైంది. చక్కెర ఫ్యాక్టరీ సహకార బోర్డు ఎన్నికల్లో తొలిసారి గెలుపొందారు. ఆ తర్వాత పుణె జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్‌గా విజయం సాధించారు. ఆ పదవిలో ఆయన సుదీర్ఘకాలంపాటు కొనసాగారు. మొదటిసారి బారామతి ఎంపీగా గెలుపొందిన అజిత్ పవార్ 1991లో తన చిన్నాన్న శరద్ పవార్ కోసం ఎంపీ పదవికి రాజీనామా చేశారు. అప్పుడు జరిగిన ఉపఎన్నికలో శరద్ పవార్ బారామతి ఎంపీగా గెలుపొంది పీవీ నర్సింహారావు కేబినెట్‌లో రక్షణ మంత్రిగా సేవలందించారు. అజిత్ పవార్ బారామతి నుంచి ఒకసారి ఎంపీగా, ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆరుసార్లు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సేవలందించారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఎక్కువకాలం సేవలందించిన వ్యక్తిగా ఆయన ఘనత సాధించారు. 2022-23 మధ్యకాలంలో మహారాష్ట్ర ప్రతిపక్ష నేతగా అజిత్ పవార్ కొనసాగారు. అజిత్ పవార్ 2019 నవంబర్ 23న తిరుగుబాటు చేశారు. శరద్ పవార్ సారథ్యంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని చీల్చి కొంతమంది ఎమ్మెల్యేలతో కలిసి బీజేపీ-శివసేన సారథ్యంలోని సంకీర్ణ ప్రభుత్వంలో చేరారు. దేవేంద్ర ఫడణవీస్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు.

# అభివృద్ధి చెందిన భారతే లక్ష్యం

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం చేశారు. దేశం వేగంగా అభివృద్ధి చెందుతూ వికసిత్ భారత్ వైపు వేగంగా అడుగులు వేస్తోందన్నారు. తమ ప్రభుత్వం నిజాయితీతో కూడిన పారదర్శక పాలన అందిస్తుస్తోందని, వెనకబడిన వర్గాల అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అన్నారు. జనవరి 28, 2026న పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కీలక ప్రసంగం చేశారు. "భారతదేశం ప్రతి రంగంలోనూ అభివృద్ధి చెందుతోంది. స్వావలంబన జీవితాన్ని గడపకుండా స్వాతంత్ర్యం అసంపూర్ణంగా ఉంటుంది. గత 11 సంవత్సరాలుగా దేశ ఆర్థిక పరిస్థితి గణనీయంగా బలపడింది. ద్రవ్యోల్బణాన్ని తక్కువగా ఉంచడంలో ఈ రికార్డును కొనసాగించాము. ఇది మధ్యతరగతి, పేదలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చింది." అన్నారు. ఆపరేషన్ సింధూర్ గురించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రస్తావించారు. "భారత సైన్యం ధైర్యం, పరాక్రమాన్ని మనం చూశాము. ఉగ్రవాద స్థావరం నాశనం చేశాము. భవిష్యత్తులో ఉగ్రవాద దాడులకు ప్రతిస్పందన దృఢంగా, నిర్ణయాత్మకంగా ఉంటుంది. సింధు జల ఒప్పందం కూడా ఇందులో భాగమే" అని అన్నారు. మావోయిస్టుల గురించి మాట్లాడుతూ, మావోయిస్టు ఉగ్రవాదులపై నిర్ణయాత్మక చర్య తీసుకున్నామని




రాష్ట్రపతి ముర్ము అన్నారు. నేడు, మావోయిస్టు ఉగ్రవాదుల సంఖ్య 126 నుండి 8 జిల్లాలకు తగ్గింది. కేవలం 3 జిల్లాలు మాత్రమే తీవ్రంగా ప్రభావితమయ్యాయి. 2,000 మందికి పైగా మావోయిస్టులు లొంగిపోయారు. దేశం నుండి ఉగ్రవాదం పూర్తిగా నిర్మూలించే రోజు ఎంతో దూరంలో లేదు. భారతదేశం సౌర విద్యుత్ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతోంది. రెండు మిలియన్ల సౌర వ్యవస్థలను ఏర్పాటు చేశారు, లక్షలాది కుటుంబాల ఇళ్లలో విద్యుత్ ఉత్పత్తిని పెంచారు. గత 11 సంవత్సరాలలో ఈశాన్యంలో 7,200 కు పైగా రహదారులు నిర్మించారు. రైల్వే అభివృద్ధిలో రూ. 80,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టారు. ఈ దశాబ్దం ఈశాన్య భద్రతకు కీలకమైనది. గిరిజన ప్రాంతాల్లోని 20,000 కు పైగా గ్రామాలు అభివృద్ధికి అనుసంధానించాము. విద్యార్థులకు రూ. 42,000 కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం జరుగుతోంది. నా ప్రభుత్వం సంపన్న రైతును అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యంగా భావిస్తుంది." అని రాష్ట్రపతి పేర్కొన్నారు. "ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ప్రారంభించడం జరిగింది. దీని ద్వారా ఇప్పటివరకు 4 లక్షల కోట్ల రూపాయలు అందించడం జరిగింది. దేశంలో నూనె గింజల పంటల ఉత్పత్తి కూడా పెరిగింది. పశుసంవర్ధకం, మత్స్య సంపద, తేనెటీగల పెంపకం కూడా సమగ్రంగా వృద్ధి చెందుతోంది. మత్స్యకారులకు ప్రయోజనం చేకూర్చేలా కొత్త విధానాన్ని రూపొందించారు. 2014తో పోలిస్తే, మత్స్య సంపద 105 శాతం పెరిగింది. దేశంలో ఆహార ప్రాసెసింగ్ సామర్థ్యం 20 శాతం పెరిగింది" అని రాష్ట్రపతి అన్నారు. "దేశంలోని పౌరులందరీ సమాన హక్కులు కల్పించడం ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమవుతుంది. నా ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేక పథకాలను రూపొందిం చింది. 10 కోట్ల మంది మహిళలు స్వయం సహాయక సంఘాలతో అనుసంధానించడం జరిగింది. 3 కోట్ల మంది మహిళలను అనుసంధానించడమే లక్ష్యం, అందులో 6 మిలియన్లకు పైగా మహిళలు లఖ్‌పతి దీదీలుగా మారారు. డ్రోన్ దీదీ కూడా వేగంగా అభివృద్ధి చెందుతోంది" అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.

## పంపాలో పేరుకుపోయిన భక్తుల దుస్తులు..

# మండిపడ్డ కేరళ హైకోర్టు

**కేరళ:** శబరిమల యాత్ర ముగిసిన తర్వాత పంపా నదిలో భక్తులు వదిలేసిన దుస్తులతో చెత్తకుప్పలా మారింది. ఈ అంశంపై విచారణ చేపట్టిన ధర్మాసనం అధికారుల తీరుని తప్పుపట్టింది. అలాగే ఈ దుస్తులను తొలగించడంలో విఫలమైన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. నిజానికి శబరిమల సీజన్ ముగిసిన తర్వాత పంపా నదిని శుభ్రం చేయాలని గతంలోనే హైకోర్టు ఆదేశించినా అధికారులు నిర్లక్ష్యం వహించడంపై జస్టిస్ రాజా విజయరాఘవన్, జస్టిస్ కె.వి. జయకుమార్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. దిలో పేరుకుపోయిన బట్టల కుప్పలు పర్యావరణానికి, జలచరాలకు ముప్పుగా మారుతుందని స్పష్టం చేసింది. చాలామంది భక్తులు దీన్ని ఆచారంగా భావిస్తున్నారు..కానీ ఇది శబరిమల సంప్రదాయంలో భాగం కానేకాదని, అదొక అపోహని పేర్కొంది. భక్తులకు దీనిపై అవగాహన పెంచాలని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డుకు సూచించింది. నిజానికి ఇలా నదిలో వదిలేసిన బట్టలు కుళ్లిపోయి దుర్వాసన రావడమే గాక, ఇది ప్రజారోగ్యానికి చాలా ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేసింది. పైగా ఈ వ్యర్థాల వల్ల చేపలు వంటి జలచరాలు మృత్యువాతపడుతున్నాయని పేర్కొంది. కేవలం నదిలో తేలే బట్టలను మాత్రమే కాకుండా, నది అడుగున పేరుకుపోయిన వ్యర్థాలను కూడా తొలగించాలని ధర్మాసనం ఆదేశించింది. అలాగే సుచిత్ర మిషన్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, పంతినం తిట్ట జిల్లా యంత్రాంగం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతోపాటు పంపా నదిని యథాస్థితికి తీసుకురావడానికి తక్షణమే చర్యలు చేపట్టాలని దేవస్వం బోర్డును ఆదేశిస్తూ కేసును తదుపరి విచారణకు వాయిదా వేసింది కేరళ హైకోర్టు. కాగా, ఈ పంపా నది కేరళలో మూడవ అతి పొడవైన నది. దక్షిణ గంగగా పూజలందుకుంటోంది. ఇడుక్కిలోని పీర్మేడు పీఠభూమిలోని పొగమంచుతో నిండిన పులచిమలై కొండల నుంచి ఉద్భవించి, అరుదైన ఔషధ వృక్షజాలంతో సమృద్ధిగా ఉన్న అడవుల గుండా ప్రవహించే ఈ పవిత్ర నది ప్రతి అలలోనూ



ఇతిహాసాలు, గొప్ప చరిత్రను దాచుకుంది. ఒకప్పుడూ స్వచ్ఛతకు ప్రతీకగా నిలిచిన అవే జలాలు ఇలా భక్తులు వదిలేసిన బట్టలు, పూసల మాలలు వంటి వాటితో కలుషితమవుతోంది. ఉనికిలోని ఆచారంతో పవిత్రమైన నదిని కాస్తా అపవిత్రంగా మారుస్తుండటం బాధకరం.

## మదర్ ఆఫ్ ఆల్ డీల్స్

## ఇది యువత ఆశలకు 'గేమ్ ఛేంజర్

భారతదేశం, ఐరోపా సమాఖ్య మధ్య కుదిరిన చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ప్రపంచవ్యాప్తంగా 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా ప్రశంసలు అందుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇది మన దేశ యువత భవిష్యత్తును మార్చేసే 'గేమ్ ఛేంజర్' అని స్పష్టం చేశారు. బుధవారం దిల్లీ కంటోన్మెంట్‌లో జరిగిన వార్షిక నేషనల్ క్యాడెట్ కార్ప్స్ ప్రధాని ర్యాలీని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. అయితే, ఇదే వేదికపై నుంచి ఆయన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణించడం దేశానికి, ముఖ్యంగా మహారాష్ట్ర అభివృద్ధికి తీరని లోటని ఆయన కన్నీటి నివాళులర్పించారు.

### 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' యువతకు వరం

"నిన్ననే భారత్ ఒక చరిత్ర సృష్టించింది. ఐరోపా సమాఖ్యతో మనం కుదుర్చుకున్న ఒప్పందాన్ని ప్రపంచం మొత్తం 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' అని పిలుస్తోంది. ఇది కేవలం కాగితాలపై జరిగిన ఒప్పందం కాదు. ఇది మీ ఆశలకు, ఆశయాలకు స్వేచ్ఛను ఇచ్చే ఒప్పందం. మన యువతకు ఎల్లలు లేని అవకాశాలను ఇది కల్పిస్తుంది. 27 దేశాల సమాఖ్య అయిన ఈయూతో ఒప్పందం వల్ల, మన స్టార్టప్‌లకు నిధుల కొరత ఉండదు. వారికి అంతర్జాతీయ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ అందుబాటులోకి వస్తుంది" అని మోదీ వివరించారు.

### 99 శాతం వస్తువులపై పన్ను లేదు

ఈ ఒప్పందం వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలను మోదీ గణాంకాలతో సహా వివరించారు. "ఈ ఒప్పందం కింద, భారత్ నుంచి ఎగుమతి అయ్యే 99 శాతం వస్తువులపై సుంకాలు ఉండవు. లేదా చాలా తక్కువగా ఉంటాయి. దీనివల్ల మన వస్తువులు ఐరోపా మార్కెట్లో చౌకగా లభిస్తాయి. తద్వారా మన ఎగుమతులు భారీగా పెరుగుతాయి. ఇది అంతిమంగా ఇక్కడ లక్షలాది కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందం కేవలం వస్తువులకే పరిమితం కాదని, సేవారంగానికి కూడా విస్తరించిందని ప్రధాని తెలిపారు. "ఈ ఒప్పందం మన 'క్రియేటివ్ ఎకానమీ'కి ఊపిరి పోస్తుంది. సినిమా, గేమింగ్, ఫ్యాషన్, డిజిటల్ కంటెంట్, సంగీతం, డిజైన్ వంటి రంగాల్లో ఉన్న యువతకు ఐరోపాలో ద్వారాలు తెరుచుకుంటాయి. పరిశోధన, విద్య, ఐటీ రంగాల నిపుణులకు లెక్కలేనన్ని అవకాశాలు వస్తాయి. ప్రొఫెషనల్ సర్వీసెస్ రంగంలో భారత్ అగ్రగామిగా నిలుస్తుంది" అని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

### యహీ సమయ్ హై, సహీ సమయ్ హై

ఎర్రకోట నుంచి తాను ఇచ్చిన పిలుపును ప్రధాని మరోసారి గుర్తు చేశారు. "ఇదే సమయం, సరైన సమయం. భారత యువతకు ఇంతకంటే మంచి సమయం మరొకటి లేదు. ఓమన్, న్యూజిలాండ్, బ్రిటన్, యూఏఈ, ఆస్ట్రేలియా, మారిషస్ వంటి దేశాలతో మనం ఇప్పటికే ఒప్పందాలు చేసుకున్నాం. ఇప్పుడు ఈయూతో ఒప్పందం, మన యువత నైపుణ్యం, సంస్కారంపై ప్రపంచానికి ఉన్న నమ్మకానికి నిదర్శనం" అని అన్నారు. ఇదే వేదికపై నుంచి ప్రధాని మోదీ విమాన ప్రమాద ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. "ఈ ఉదయం మహారాష్ట్రలో జరిగిన ఘోర విమాన ప్రమాదం మనందరినీ కలచివేసింది. ఈ ప్రమాదం మన నుంచి మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌ని, మరికొందరు మిత్రులను దూరం చేసింది. అజిత్ దాదా మహారాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఆయన ఎప్పుడూ చురుగ్గా పనిచేశేవారు. దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివి. ఆయన కుటుంబానికి, మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని ప్రధాని భావోద్వేగానికి లోనయ్యారు.

### వందేమాతరానికి 150 ఏళ్లు

ఎన్‌సీసీ క్యాడెట్లను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. "ఎన్‌సీసీ అనేది యువతకు ఒక గొప్ప వేదిక. ఇక్కడ మన వారసత్వం గర్వంగా జీవిస్తుంది. ఈ ఏడాది 'వందేమాతరం' గీతానికి 150 ఏళ్లు పూర్తయ్యాయి. దీనిని మనం ఘనంగా జరుపుకున్నాం. అండమాన్ నికోబార్‌లోని 21 దీవులకు మన పరమ వీర చక్ర గ్రహీతల పేర్లు పెట్టుకున్నాం. జాతి వీరులను గౌరవించే సంప్రదాయాన్ని మీరు ముందుకు తీసుకెళ్తున్నారు" అని ప్రధాని యువతను ప్రశంసించారు.

## భారత్-యూరోపియన్ యూనియన్ వాణిజ్య ఒప్పందం..

భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై అమెరికా స్పందించింది. ఈ మేరకు అగ్రరాజ్యం వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కొన్ని వివరాలను పరిశీలించానని, దీని వల్ల భారత్‌కే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని అన్నారు. ఐరోపా మార్కెట్‌లో భారత్‌కు ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. దీంతో ఈ ఒప్పందం ద్వారా భారత్‌ది పైచేయి అవుతుందని అన్నారు. భారతీయ నిపుణులకు ఐరోపా దేశాల్లో ఎక్కువ అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశీయ ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని గుర్తు చేశారు. మా దేశంలోకి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై అధిక టారిఫ్ విధిస్తుండటంతో పలు దేశాలు తమ ఉత్పత్తుల కోసం ఇతర మార్కెట్ల వైపు చూస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈయూ, భారత్ మధ్య ఒప్పందం కుదిరినట్లు వెల్లడించారు.

## రూ.87 కోట్ల విలువైన సాఫ్ట్‌వేర్ డేటా చోరీ

**బెంగళూరు:** సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేసిన ఐటీ ఇంజినీర్ రూ.87 కోట్ల విలువైన సాఫ్ట్‌వేర్ డేటా చోరీ చేశాడు. సాఫ్ట్‌వేర్ సోర్స్ కోడ్‌ను దొంగిలించాడు. ఈ నేపథ్యంలో ఆ టెకీని ఉద్యోగం నుంచి ఆ కంపెనీ తొలగించింది. ఆ తర్వాత ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. అమేడియస్ సాఫ్ట్‌వేర్ ల్యాబ్స్ ఇండియా (పి) లిమిటెడ్ కంపెనీలో 2020 ఫిబ్రవరి 1 నుంచి ఆశుతోష్ నిగమ్ సీనియర్ మేనేజర్ రీసెర్చ్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్నాడు. కాగా, 2025 అక్టోబర్ 11న ఆశుతోష్ నిగమ్ కంపెనీకి చెందిన సాఫ్ట్‌వేర్‌తో పాటు సోర్స్ కోడ్‌ను వ్యక్తిగత ఇమెయిల్ ఖాతా నుంచి బయటకు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ఆ సంస్థ ఆరోపించింది. అంతర్గత దర్యాప్తు, ఫుటేజ్, నివేదికలతో అతడ్ని నిలదీయగా సోర్స్ కోడ్‌ను దొంగిలించినట్లు అంగీకరించాడని తెలిసింది. దీంతో గత ఏడాది డిసెంబర్ 3న ఉద్యోగం నుంచి తొలగించినట్లు పేర్కొంది. మరోవైపు టెకీ ఆశుతోష్ నిగమ్ చోరీ చేసిన సాఫ్ట్‌వేర్, సోర్స్ కోడ్ విలువ 8,000,000 యూరోలు (సుమారు రూ.87 కోట్లు) అని ఆ ఐటీ సంస్థ తెలిపింది. దీని వల్ల కంపెనీ మేథో సంపత్తి హక్కులకు భంగం కలగడమే కాకుండా, కంపెనీకి తీవ్రమైన వ్యాపార నష్టం, హాని జరిగినట్లు ఆరోపించింది. జనవరి 23న వైట్‌ఫీల్డ్ సీఈఎన్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఆశుతోష్ నిగమ్‌పై ఐటీ చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## యూజీసీ కొత్త రూల్స్‌పై రగడ

ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ భావనను పెంపొందించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) రూపొందించిన కొత్త రూల్స్‌పై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఈ నిబంధనలను వ్యతిరేకిస్తూ బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, బంగాల్ సహా పలు రాష్ట్రాల్లో జనరల్ కేటగిరీల విద్యార్థులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జనరల్ కేటగిరీల విద్యార్థులను అభద్రతా భావానికి గురిచేసేలా ఈ రూల్స్ ఉన్నాయని నిరసనకారులు ఆరోపిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థుల్లాగే ఓబీసీ స్టూడెంట్స్‌కు కూడా వివక్ష నుంచి రక్షణ కల్పించేలా నిబంధనల్లో సవరణలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంతకీ యూజీసీ ఇప్పుడు కొత్త రూల్స్‌ను ఎందుకు తెచ్చింది? ఆ నిబంధనల్లో ఏయే అంశాలను ప్రస్తావించారు? జనరల్ కేటగిరీల విద్యార్థులు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? రాజకీయ నేతలు, విద్యావేత్తలు, విద్యార్థులు ఏమంటున్నారు? ఈ కథనంలో చూద్దాం. సమానత్వ భావనను పెంపొందించే నిబంధనలను దేశంలోని ఉన్నత విద్యా సంస్థల్లో అమలు చేయడం ఇదే తొలిసారేం కాదు. ఇంతకుముందు వరకు '2012 యూజీసీ ఫ్రేమ్ వర్క్'లోని రూల్స్‌ను అన్ని యూనివర్సిటీలు, కాలేజీలు అమలుచేసేవి. అయితే తాజాగా ఈ నిబంధనలను యూజీసీ కఠినతరం చేసింది. ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వాన్ని పెంపొందించే రూల్స్‌లో ఈ మేరకు పలు కీలక సవరణలు చేసి, 2026 జనవరి 13న అధికారిక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

# అప్పుల సంఖ్య పెంచి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు

-మొదటిపేజీ తరువాయి

ఆశాభావం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో గొప్ప విజయం సాధించాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ తన అనుచరులతో కలిసి బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరగా, పార్టీ కండువా కప్పి కేటీఆర్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. రెండు సంవత్సరాల్లో అన్ని రంగాల్లో విఫలం అయిన కాంగ్రెస్ పార్టీ పరిపాలనకు వ్యతిరేకంగా అందరూ కలిసికట్టుగా పోరాడి అద్భుతమైన విజయం సాధించాలన్నారు. ఈ ఎన్నికల్లో అందరు కలిసి సమిష్టిగా ఎన్నికల్లో పోరాడాలని కేటీఆర్ కోరారు. కేవలం మున్సిపల్ ఎన్నికలు మాత్రమే కాకుండా రానున్న ప్రతి ఎన్నికల్లోనూ గులాబీ జెండాకు, కారు గుర్తుకు మద్దతు ఇచ్చి కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో కాంగ్రెస్, 12 ఏండ్లుగా దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎలాంటి అభివృద్ధి చేయకుండా టైంపాస్ చేస్తున్నాయని, అందుకే తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీల పట్ల తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడిందని కేటీఆర్ అన్నారు. తెలివిలేని వ్యక్తి రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకావడం లేదని.. అందుకే గత ప్రభుత్వంపై అడ్డగోలు విమర్శలు చేస్తూ పరిపాలనను వదిలిపెట్టారు. అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి వాటి అమలును పూర్తిగా విస్మరించారని,



హామీల అమలును ప్రశ్నిస్తే బెదిరింపులు, కేసులు, అబద్ధాలకు దిగుతున్నారని కేటీఆర్ ఆరోపించారు.

**కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన ప్రతి పైసా అభివృద్ధి కార్యక్రమాలకే..**

రేవంత్ రెడ్డి పూర్తిగా అబద్ధాల మీద పరిపాలన చేయడం అలవాటు చేసుకున్నారని కేటీఆర్ విమర్శించారు. కేవలం పరిపాలన చేతగాక అప్పుల పేరుతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని.. అప్పుల విషయంలో కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్, కాగ్ (జూా+) ఏజెన్సీలు నామమాత్రపు అప్పు మాత్రమే ఉందని చెబుతున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అప్పుల సంఖ్య పెంచి తప్పుడు లెక్కలు చూపుతోందని కేటీఆర్ ఆరోపించారు. అయితే కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన ప్రతి పైసా అప్పును సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకే వినియోగించిందని కేటీఆర్ గుర్తు చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి పథకాలు, విద్యాలయాలు, ఆసుపత్రులు నిర్మించామని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాల్లో తెచ్చిన రెండున్నర లక్షల కోట్ల రూపాయల అప్పుతో ఒక్కటంటే ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఆ అప్పును ఎక్కడ ఖర్చు పెట్టారో..? ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం ఒక్క ప్రాజెక్టైనా నిర్మించారా..? సంక్షేమంపై ఖర్చు చేశారా..? అని నిలదీశారు.

**ఆరూరి రమేష్‌కు స్వాగతం..**

తిరిగి పార్టీలోకి వచ్చిన ఆరూరి రమేష్‌కు కేటీఆర్ హృదయపూర్వక స్వాగతం పలికారు. రెండు సంవత్సరాల్లో బీజేపీకాంగ్రెస్ వైఫల్యాలను చూసిన తర్వాత ప్రజలంతా కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని అన్నారు. ఆరూరి రమేష్ గతంలో వర్ధన్నపేట నియోజక వర్గాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశారని, దాదాపు లక్ష ఓట్ల మెజార్టీతో గెలిచిన ఆయన 16 ఓట్ల తేడాతో ఓడిపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కానీ రానున్న రోజుల్లో కాంగ్రెస్ పాలనను చూసిన తర్వాత వర్ధన్నపేటలో మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమని కేటీఆర్ స్పష్టం చేశారు. గతంలో పార్టీ నాయకులతో పాటు ప్రస్తుతం ఉన్న ప్రతి ఒక్కరినీ కలుపుకొని సమిష్టిగా ముందుకు వెళ్లి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అద్భుతమైన విజయం సాధించాలని ఆరూరి రమేష్‌ను కోరారు.

# బస్సులన్నీ మేడారం వైపే!

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ ఆర్టీసీ ఈ నెల 25వ తేదీ నుంచి ఫిబ్రవరి 1 వరకు స్పెషల్ బస్సులను నడుపుతోంది. హైదరాబాద్ నగరం సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి దాదాపు 4 వేల బస్సులు మేడారం బాట పట్టాయి. గ్రేటర్ పరిధిలో దాదాపు 3200 బస్సులు మాత్రమే అందుబాటులో ఉండగా వాటిలో నుంచి 900 వరకు మేడారం జాతరకు నడుపుతున్నారు. దాంతో హైదరాబాద్ నగరంలోని సాధారణ ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు.

ఇదే అదనుగా ఆటోవాలాలు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. భక్తులు, ఆర్టీసీ డ్రైవర్లకు పలు సూచనలు అందజేసేందుకు అధికారులు హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఆర్ఎం జె.శ్రీలత ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. జాతరకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయటంలో సిబ్బంది నిమగ్నమయ్యారు. అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రవి నాయక్ ఆధ్వర్యంలో ఎంజీబీఎస్ బస్‌స్టాండ్‌లో అఫ్జల్‌గంజ్ పోలీసులు ప్లాట్‌ఫాంల వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. ఆర్టీసీ విజిలెన్స్ సిబ్బంది, కంట్రోలర్లు, సూపర్‌వైజర్లు భక్తులకు తగు సూచనలిస్తున్నారు.



**ఎంజీబీఎస్‌లో ట్యాగ్ స్టాల్ ప్రారంభం**

జాతరలో పొరపాటున తప్పిపోయే పిల్లల ఆచూకీని సులభంగా గుర్తించేందుకు చిల్డ్రన్ ట్రాకింగ్, మానిటరింగ్ సిస్టం ఎంతో ఉపయోగపడుతుంది గోల్కొండ జోన్ డీసీపీ జి.చంద్ర మోహన్ అన్నారు. నగర పోలీసు శాఖ వోడాఫోన్ ఐడియా సెల్యులార్ నెట్‌వర్క్ సహకారంతో రూపొందించిన పిల్లల చేతి మణికట్టు వద్ద ట్యాగ్‌ను (రిస్ట్ బ్యాండ్) అమర్చే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మంగళవారం ఎంజీబీఎస్ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆయన ప్రారంభించారు.

లక్షలాది మంది భక్తులు పాల్గొనే మేడారం మహాజాతరలో తల్లిదండ్రులతో కలిసి వెళ్లే పిల్లలు తప్పిపోతే వారి చేతికి ఉన్న ట్యాగ్‌పై ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసినట్లయితే వారి తల్లిదండ్రుల ఫోన్‌లో ఎక్కడ ఉన్నారనే సమాచారం తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. బాలుడు లేదా బాలిక తల్లిదండ్రులు, సంరక్షకుడి పేరు, మొబైల్ నంబరు నమోదు చేసుకుని క్యూఆర్ కోడ్ ముద్రించిన రిస్ట్‌బ్యాండ్ పొందాలని సూచించారు. పిల్లలకు డీసీపీ చంద్రమోహన్ స్వయంగా ట్యాగ్‌లను కట్టి తల్లిదండ్రులకు సూచనలిచ్చారు.

**మేడారానికి దారులివీ**

మేడారం మహాజాతర ప్రారంభం అయింది. ఇందులో ట్రాఫిక్ నియంత్రణ అత్యంత కీలకం. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక రూట్‌మ్యాప్‌లను సిద్ధం చేశారు. ఏ రూట్ నుంచి వచ్చే వాహనాలు ఎలాంటి జాగ్రత్తలను తీసుకోవాలి? తిరిగి ఏ మార్గంలో వెళ్లాలి అనే దానిపై ఇప్పటికే ఓ ప్లాన్‌ను రెడీ చేశారు. ఆయా మార్గాల నుంచి వచ్చే వాహనాలకు అనువుగా పార్కింగ్ ప్రదేశాలను కూడా ఏర్పాటు చేశారు. ఓరుగల్లు వైపు నుంచి వచ్చే ప్రైవేటు వాహనాలు ఆరెపల్లి, గుడెప్పాడ్, మల్లంపల్లి, ములుగు, జంగాలపల్లి, పస్రా, వెంగళాపూర్, నార్లాపూర్ రూట్‌లో మేడారం చేరతాయి.

**పార్కింగ్ ప్రదేశాలు :**

వెంగళాపూర్, చింతల్, నార్లాపూర్, కన్నెపల్లి, కొత్తూరు, ముత్యాల గూడెం, యాసంగి తోగు.

వరంగల్ నుంచి వచ్చేవారు తిరుగు ప్రయాణంలో నార్లాపూర్, బయ్యక్కపేట, గొల్ల బుద్దారం, కమలాపూర్ క్రాస్, దూదేకులపల్లి, భూపాలపల్లి, గణపురం క్రాస్‌రోడ్డు, రేగొండ, అంబాల క్రాస్, పరకాల, కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల, వరంగల్ బైపాస్, కరుణాపురం, చిన్న పెండ్యాల మీదుగా వరంగల్ చేరుకుంటాయి.

గద్దెల నుంచి పార్కింగ్ ప్రదేశాల దూరం కిలోమీటర్లలో : ఆర్టీసీ బస్‌స్టాప్ అర కిలోమీటరు దూరంలో ఉంది. ఊరట్టం పార్కింగ్ ప్రదేశం 4 కిలోమీటర్లు, కన్నెపల్లి 4. కొత్తూరు 4. చింతల్ 6 కిలోమీటర్లు. నార్లాపూర్ 6కిలోమీటర్లు. వెంగళాపూర్ 8. జంపన్న వాగు పార్కింగ్ 2. చిలకల గుట్ట ఒక కిలోమీటరు. జంపన్న వాగు 3. కన్నెపల్లి 5. గంగారం మండల పూనుగుండ్లలోని పగిడిద్దరాజు గుడి నుంచి మేడారం గద్దెలకు 70 కిలోమీటర్లు. ఏటూరునాగారం మండల కొండాయిలోని గోవిందరాజులు గుడి నుంచి 18 కి.మీటర్ల దూరం ఉంటుంది. 11

# మహారాష్ట్ర నుంచి యాదాద్రికి పులి జర్నీ

**నల్గొండ :** మహారాష్ట్ర సరిహద్దుల నుంచి బయలుదేరిన ఓ మగ పులి.. తెలంగాణలోని 19 జిల్లాల మీదుగా 375 కిలోమీటర్లు ప్రయాణించి యాదాద్రి జిల్లాకు చేరుకుంది. గత 50 ఏళ్లలో ఈ ప్రాంతంలో పులి ఆనవాళ్లు కనిపించడం ఇదే తొలిసారి. అటవీ శాఖ అధికారులు అప్రమత్తమై ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు.మహారాష్ట్ర సరిహద్దుల నుంచి బయలుదేరిన ఒక మగ పులి.. తెలంగాణ అడవుల గుండా సుమారు 375 కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణం చేస్తూ ప్రస్తుతం యాదాద్రి జిల్లాకు చేరుకుంది. తిప్పేశ్వర్ వన్యప్రాణి అభయారణ్యం నుంచి ప్రారంభమైన ఈ పులి ప్రయాణం.. గత రెండు నెలలుగా రాష్ట్రంలోని సుమారు 19 జిల్లాల మీదుగా సాగుతూ ఇప్పుడు యాదాద్రి భువనగిరి జిల్లాలో అడుగుపెట్టింది. రాజధాని హైదరాబాద్‌కు కేవలం 60 కిలోమీటర్లు, ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టకు కేవలం 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న దత్తాయిపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో పులి పాదముద్రలు కనిపించడంతో అటవీ శాఖ యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గడిచిన 50 ఏళ్ల కాలంలో ఈ ప్రాంతంలో పులి ఆనవాళ్లు కనిపించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. వన్యప్రాణి నిపుణుల విశ్లేషణ ప్రకారం.. మగ పులులు సాధారణంగా తమకంటూ ఒక ప్రత్యేకమైన సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవడానికి లేదా ఆడ తోడు కోసం ఇలాంటి సుదీర్ఘ ప్రయాణాలు చేస్తుంటాయి. అందుకోసమే మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ నుంచి పెన్‌గంగా నదిని దాటి ఆదిలాబాద్‌లోని బోథ్ మండలంలోకి ప్రవేశించిన ఈ పులి.. అక్కడి నుంచి నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల గుండా ప్రయాణించింది. ఒకానొక దశలో పులి తిరిగి మహారాష్ట్రకు



వెళ్ళిపోయిందని అధికారులు భావించినప్పటికీ.. అది అనూహ్యంగా రూట్ మార్చుకుని దట్టమైన పొదలు, వాగుల గుండా యాదాద్రి జిల్లాకు చేరుకుంది. సాధారణంగా ఇలాంటి ప్రయాణాల్లో పులులు పగటిపూట విశ్రాంతి తీసుకుంటూ.. రాత్రి వేళల్లోనే సగటున 18 నుంచి 20 కిలోమీటర్లు నడుస్తుంటాయి.పులి సంచారంపై సమాచారం అందిన వెంటనే పీసీసీఎఫ్ నుంచి క్షేత్రస్థాయి సెక్షన్ ఆఫీసర్ల వరకు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. దత్తాయిపల్లి, గంధమల్ల, కోనాపూర్, ఇబ్రహీంపూర్ వంటి సమీప గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు సమూహాలుగా వెళ్లాలని.. పశువులను అడవికి సమీపంలో కట్టేయకూడదని సూచించారు. ఈ పులి తన ప్రయాణ మార్గంలో ఇప్పటికే సుమారు 5 నుంచి 10 పశువులను వేటాడి ఉండవచ్చని పాదముద్రలు, మల విసర్జితాల ఆధారంగా అంచనా వేస్తున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. అధికారులు ఎన్ని కెమెరా ట్రాప్‌లు, బోనులు ఏర్పాటు చేసినా ఈ పులి ఇప్పటివరకు వాటికి చిక్కకుండా తన ఉనికిని చాటుతోంది. తెలంగాణలో ఇటీవల కాలంలో పులుల సంఖ్య, సంచారం గణనీయంగా పెరగడం సానుకూల పరిణామంగా కనిపిస్తోంది. ప్రస్తుతం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో సుమారు 37 పులులు ఉండగా.. కవ్వాల్ రిజర్వ్‌లో 6 నుంచి 8 వరకు ఉన్నట్లు సమాచారం. వీటితో పాటు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి పులులు రాకపోకలు సాగిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ఒక పులి 8 నెలలుగా, మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో మరో పులి 6 నెలలుగా స్థిర నివాసం ఏర్పరుచుకోవడం రాష్ట్ర అటవీ సంపదకు నిదర్శనం. పులుల కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు అటవీ శాఖ ప్రతి డివిజన్‌కు 10 నుంచి 15 కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఉంచింది.

## ఆశావహుల్లో ఉత్కంఠ

-మొదటిపేజీ తరువాయి

పూర్తి కాలేదు. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావహులంతా నేతల చుట్టూ తిరుగుతూ అవకాశమివ్వాలని కోరుతున్నారు. దీంతో రాష్ట్రంలోని పోటీ ఎక్కువగా ఉన్న వార్డుల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపిక విషయంలో కొంత తర్జనభర్జన నెలకొంది. వివిధ స్థాయిల్లో పరిశీలన చేసి ఎంపిక చేస్తున్నారు. నామినేషన్‌ల ఘట్టం ప్రారంభమవుతున్న నేపథ్యంలో సమయం ఆలస్యం కాకుండా అభ్యర్థులను ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ముందస్తుగానే ఓటర్లతో ముచ్చట**

ఆశావహుల్లో అత్యధికులు టికెట్ తమకే వస్తుందనే నమ్మకంతో ఎదురుచూస్తున్నారు. పార్టీలలోని ప్రధాన నేతల అండదండలు ఉన్నాయని తప్పనిసరిగా బీఫారం తమకే వస్తుందని వారి స్నేహితులు, బంధువుల వద్ద చెప్పుకొంటున్నారు. టికెట్ రాకుండానే వీరంతా పోటీ చేయాలనుకుంటున్న వార్డుల్లో ఓటర్లను కలుస్తున్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల్లో వార్డు సమస్యల విషయాలను పోస్టు చేస్తున్నారు. ఆపై పార్టీ పెద్దలతో దిగిన ఫొటోలను షేర్ చేస్తున్నారు. ఓటర్ల జాబితాపై వర్గాల వారీగా చేసుకుని ఎన్నికల కోసం కసరత్తు చేస్తున్నారు. ప్రభావం చూపే వ్యక్తులు, వివిధ వర్గాల ప్రతినిధులను కలుస్తూ పోటీ చేసే ఆలోచన విషయాన్ని చెబుతున్నారు.

**పొత్తులతో వారి ఆశలకు గండి**

అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షంతో వామపక్షాలు పొత్తుల చర్చలు జరిపాయి. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు పొత్తు అంశాలపై ఇరుపార్టీలు ఇంకా అవగాహనకు రాలేదు. చివరి నిమిషంలో అధికార, ప్రతిపక్ష పార్టీలతో వామపక్ష పార్టీలకు పొత్తు పొడిస్తే వార్డుల సర్దుబాటులో ఆయా పార్టీల పోటీదారుల ఆశలకు గండి పడే అవకాశం ఉంది.

క్రియాశీలక రాజకీయాల్లో ఉన్న వారు రాజకీయ పదవులపై ఆశతో ఉన్నారు. వీరికి పుర ఎన్నికల రూపంలో ప్రజాప్రతినిధి అయ్యే అవకాశంగా భావించి పోటీకి సిద్ధమవుతున్నారు. పార్టీ టిక్కెట్టు దక్కించుకోవడం కీలకం కావడంతో అధికార పార్టీలోని వారు ఎమ్మెల్యేలను మిగతా పార్టీల వారు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు ముఖ్య నేతల ఆశీస్సుల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. షెడ్యూల్ కూడా విడుదలై నామినేషన్లు మొదలు కానున్న నేపథ్యంలో వీరిలో ఉత్కంఠ తీవ్రమైంది.

**పోటీ చేసేందుకు ఇవి తప్పనిసరి**

ఎన్నికల్లో పోటీకి అర్హతలు, డిపాజిట్, ఎన్నికల వ్యయ పరిమితిపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే మార్గదర్శకాలను ప్రకటించింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పోటీ చేయాలనుకునే అభ్యర్థి భారత పౌరుడై ఉండాలి. పోటీ చేసేందుకు కనీసం 21 ఏళ్ల వయసు ఉండాలి. ఏదైనా వార్డు నుంచి కౌన్సిలర్‌గా పోటీ చేయాలంటే ఆ మున్సిపాలిటీలోని ఏదైనా ఒక వార్డులో ఓటరుగా నమోదై ఉండాలి. అదేవిధంగా కార్పొరేటర్‌గా పోటీ చేయాలంటే ఆ కార్పొరేషన్‌లోని ఒక డివిజన్‌లో ఓటరుగా ఉండాలి. పార్టీ తరఫున పోటీ చేస్తే వార్డు లేదా డివిజన్‌లోని ఒక ఓటరు ప్రతిపాదించాలి. ఇండిపెండెంట్‌గా ఎన్నికల బరిలో నిలిస్తే పది మంది ఓటర్లు ఆ అభ్యర్థిని ప్రతిపాదించాలి. ఒక ఓటరు ఒకరిని మాత్రమే ప్రతిపాదించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

**వీరు అనర్హులు**

పోటీ చేసే వ్యక్తి ఆ మున్సిపాల్టీ లేదా కార్పొరేటర్‌లో కాంట్రాక్టరుగా ఉండకూడదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో, కార్పొరేషన్, మున్సిపాల్టీల్లో లాభదాయక పదవులు చేపట్టకూడదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసు నుంచి తొలగించి ఉంటే వారు పోటీకి అనర్హులు. గతంలో ఎన్నికల్లో పోటీ చేసి ఖర్చుల వివరాలు సమర్పించని కారణంగా ఎస్ఈసీ అనర్హుల జాబితాలో ఉన్నవారు ఐపీ పెట్టిన వారు కూడా పోటీ చేయరాదు.

## అత్యంత వైభవంగా మేడారం మహాజాతర



-మొదటిపేజీ తరువాయి

ఈనెల 30వ తేదీన తల్లులు ఇద్దరు కూడా గద్దెలపై కొలువై ఉండడంతో భక్తజనం తమ మొక్కులను చెల్లించుకుంటారు. నాలుగవ రోజైన శనివారం సాయంత్రం దేవతలు వారివారి ప్రాంతాలకు తిరుగుముఖం పట్టడంతో జాతర ముగుస్తుంది. కొత్తగా... సరికొత్తగా... మంత్రి సీతక్క చొర వ..సీఎం నిధులుఈసారి మహాజాతర కొత్తగా, సరికొత్తగా భక్తులకు కనువిందు చేస్తున్నది. శాశ్వత నిర్మాణాల పేరిట ఆధునీకరించడంతో మేడారం ధగధగలాడుతున్నది.

ఈసారి మేడారం జాతర కోసం మంత్రి సీతక్క చొరవతో సీఎం రేవంత్ రెడ్డి నిధులు విడుదల చేశారు. సుమారు 150 కోట్లతో పనులు చేపట్టడంతో మేడారం కొత్త శోభను సంతరించుకున్నది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఏకంగా మేడారంలోనే కేబినెట్ సమావేశం నిర్వహించడం, కొత్తగా పనులు చేపట్టడంతో జాతరపై భక్తుల్లో ఆసక్తి, అంచనాలు పెరిగిపోయాయి. 1944 నుంచి ప్రభుత్వం జాతరను నిర్వహిస్తున్నా, 1967లో దేవాదాయ శాఖ తన ఆధీనంలోకి తీసుకున్నది. 1998లో మేడారం జాతరను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించింది. అప్పటినుంచి భక్తులు భారీగా పెరగడంతో జాతీయ పండుగగా గుర్తించాలని డిమాండ్ పెరిగింది. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 150 కోట్లు కేటాయించి జాతరను ఆధునీకరించడంతో మైలురాయిగా నిలవనున్నది. మంత్రి సీతక్క జాతరలోనే తిష్ట వేసి పనులను పర్యవేక్షిస్తున్నారు. మహాజాతరకు తరలివచ్చే కోట్లాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జాతరను 8 జోన్లు, 42 సెక్టార్లుగా విభజించింది. వివిధ శాఖలకు చెందిన 42 వేల 27 మంది ఉద్యోగులను జాతర విధులకు నియమించింది. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూసేందుకు పోలీసులు ప్రత్యేకంగా ఎఐ టెక్నాలజీని వినియోగిస్తున్నారు.జాతరలో తప్పిపోతున్న భక్తులను సులువుగా గుర్తించేందుకు వీలుగా ఈసారి జియోట్యాగ్ బెస్ట్ మిస్సింగ్ పర్సన్ ట్రాకింగ్ సిస్టమ్ ను తీసుకువచ్చారు. అలాగే పాత నేరస్థులను గుర్తించేందుకు ఆసుపత్రి ఏరియా, పార్కింగ్ ప్రాంతాల్లో ఫేస్ రికగ్నైజింగ్ కోసం టెక్నాలజీ వినియోగిస్తున్నారు. అనుమానితులను గుర్తించేందుకు వీలుగా రియల్ టైమ్ అలెర్ట్ సిస్టమ్ సిద్ధం చేశారు. ఇదేకాకుండా జాతరలో 450 సీసీ కెమెరాలు, 20 డిస్ ప్లే ప్యానెల్స్, క్లౌడ్ కౌంటింగ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. జాతరకు వెళ్ళే దారిలో ప్రతి నాలుగు కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఔట్ పోస్ట్ ఏర్పాటుచేశారు. వీటితో పాటుగా మొబైల్ పెట్రోలింగ్ టీమ్ లు, మఫ్టీ టీమ్ లు ఉన్నాయి. జాతరలో విధుల నిర్వహణకు 13వేల మందిని కేటాయించారు. ఉమ్మడి జిల్లాలోని ఎస్పీ, డీసీపీ, ఎసిపిలకు కూడా డ్యూటీలు వేశారు.ఆర్టీసీ ప్రాంగణం దాకా వచ్చి వెళ్లలేని భక్తుల కోసం ఇంటికే బస్సు పంపే ఏర్పాట్లు చేసింది. ఎక్కడైనా 30 మంది భక్తులు ఉన్నట్లయితే అక్కడికి ఆర్టీసీ బస్సును పంపించనున్నారు. మేడారం ప్రసాదాన్ని భక్తులకు ఇంటికే అందించేందుకు వీలుగా కార్గో సర్వీస్ అందిస్తున్నది. ఇదే కాకుండా మహా జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులను తరలించేందుకు వీలుగా 4 వేల బస్సులను ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రం నలుమూలల నుంచి 20 లక్షల మందికి జాతరకు తరలించేందుకు లక్ష్యం పెట్టుకుంది. 50 పడకల ఆసుపత్రి...30 హెల్త్ క్యాంపులు జాతరలో వైద్య సేవల కోసం 50 పడకల ఆసుపత్రి..30 హెల్త్ క్యాంపులు ఏర్పాటుచేశారు. వైద్య సేవలు అందించేందుకు 5192 మంది మెడికల్, పారా మెడికల్ సిబ్బందిని నియమించారు.

# బరువును తగ్గించే మ్యాజిక్ బ్రేక్‌ఫాస్ట్



బరువు తగ్గాలనే లక్ష్యంతో చాలామంది చేసే మొదటి పని బ్రేక్ ఫాస్ట్ మానేయడం. కానీ అది మీ ఆరోగ్యానికి మేలు కంటే కీడే ఎక్కువ చేస్తుందని మీకు తెలుసా? బరువు తగ్గడానికి బ్రేక్‌ఫాస్ట్ మానేయడం కాదు.. అసలు ఏం తింటున్నామన్నదే ముఖ్యం. ఉదయం పూట మీరు తీసుకునే ఆహారమే మీ రోజంతటి వేగాన్ని, మీ జీవక్రియను నిర్ణయిస్తుంది.నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది చేసే అతిపెద్ద తప్పు బ్రేక్ ఫాస్ట్ విషయంలో అశ్రద్ధ చూపడం. మరికొందరు బరువు తగ్గాలనే ఉద్దేశంతో అసలు టిఫినే తినరు. అయితే బరువు తగ్గడానికి టిఫిన్ మానేయడం కాదు.. సరైన అల్పాహారం ఎంచుకోవడం ముఖ్యమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. శరీరానికి రోజంతా అవసరమైన శక్తిని ఇచ్చేది, జీవక్రియను వేగవంతం చేసేది అల్పాహారమే. మరి బరువు తగ్గడానికి ఎలాంటి బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవాలి? బరువు తగ్గాలనుకునే వారికి మొలకెత్తిన పప్పులు ఒక అద్భుతమైన ఎంపిక. ఇందులో ప్రోటీన్ మరియు ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. నానబెట్టిన పచ్చి పప్పు లేదా శనగలను మొలకలు వచ్చిన తర్వాత అందులో ఉల్లిపాయ, టమోటా, దోసకాయ ముక్కలు, కొంచెం నిమ్మరసం, చాట్ మసాలా కలిపి తీసుకోవాలి. ఇది తిన్న తర్వాత కడుపు నిండుగా అనిపిస్తుంది. తద్వారా అనవసరమైన చిరుతిళ్లు తినాలనే కోరిక తగ్గుతుంది. పీచు పదార్థం జీర్ణవ్యవస్థను శుభ్రం చేయడమే కాకుండా, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. ఓట్స్, చియా గింజలు, తాజా పండ్లు, బెర్రీలు, మల్టీగ్రెయిన్ బ్రెడ్ వంటివి మీ అల్పాహారంలో భాగంగా ఉండాలి. ఫైబర్ వల్ల కేలరీలు త్వరగా ఖర్చవుతాయి. ఇది అతిగా తినకుండా మిమ్మల్ని నియంత్రిస్తుంది. ఆఫీసులకు వెళ్లే వారికి, విద్యార్థులకు ఇది బెస్ట్ ఆప్షన్. అల్పాహారానికి ముందే మీ శరీరాన్ని లోపలి నుండి శుభ్రం చేసుకోవడం ముఖ్యం. ఉదయం లేవగానే ఒకటి లేదా రెండు గ్లాసుల గోరువెచ్చని నీరు తాగాలి. ఇది శరీరంలోని విషపూరిత వ్యర్థాలను బయటకు పంపివేస్తుంది. సాధారణ టీ, కాఫీలకు బదులుగా గ్రీన్ టీ లేదా హెర్బల్ టీలను ఎంచుకోండి. ఇది మీ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతూనే బరువు తగ్గడానికి సహకరిస్తుంది. బరువు పెరగడానికి ప్రధాన కారణం అల్పాహారంలో మనం వాడే నూనె, చక్కెర, అధిక కార్బోహైడ్రేట్లు. ప్యాక్ చేసిన తృణధాన్యాలు, నూనెలో వేయించిన పదార్థాలకు దూరంగా ఉండటం ఉత్తమం. సరైన సమయానికి, సరైన మోతాదులో పోషకమైన అల్పాహారం తీసుకోవడం వల్ల కేవలం బరువు తగ్గడమే కాకుండా రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చు. కాబట్టి రేపటి నుండి మీ బ్రేక్‌ఫాస్ట్ ప్లేట్‌ను ఆరోగ్యకరంగా మార్చుకోండి.

# మెంతి కూర పవర్ తెలిస్తే వదలరు



ఎన్నో ఔషధ గుణాలు ఉన్న మెంతి ఆకు.. అనేక ఆరోగ్య సమస్యలను నివారించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. కాలేయ సమస్యలు, మధుమేహం నియంత్రణ, చర్మ వ్యాధుల నివారణకు తోడ్పడుతుంది. కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్, ప్రోటీన్లు, ఫైబర్ సమృద్ధిగా ఉండే ఈ ఆకు, జ్ఞాపకశక్తిని పెంచి, క్యాన్సర్ వంటి వ్యాధులను నిరోధించగలదు. మెంతి కూరలో ఎన్నో పోషకాలతో పాటు.. ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. మన భారతీయ వంటకాల్లో సర్వసాధారణంగా ఉపయోగించే ఒక అద్భుతమైన ఆకుకూర. ఇది కేవలం రుచిని పెంచడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. దీనిని మెంతి లేదా మెంతి కూర అని కూడా పిలుస్తారు. రుచికి చేదుగా ఉన్నప్పటికీ, ఈ ఆకు అనేక పోషక విలువలను, అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. సాధారణంగా మెంతి ఆకులో చిన్న మెంతెం, పెద్ద మెంతెం అని రెండు రకాలుంటాయి. ఈ ఆకు శరీరానికి సంబంధించిన అనేక ఆరోగ్య సమస్యలను తగ్గించడంలో ఎంతగానో సహాయపడుతుంది. మెంతి ఆకులో కాల్షియం, ఇనుము, ఫాస్ఫరస్‌లతో పాటు ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. అంతేకాకుండా, ఫైబర్ పుష్కలంగా లభిస్తుంది. ఈ పోషకాలు శరీరానికి బలాన్ని చేకూర్చి, వివిధ వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయి. లివర్ ఆరోగ్యం, డయాబెటిస్ నియంత్రణ: మెంతి ఆకు ముఖ్యంగా కాలేయ సమస్యలను తగ్గించడంలో తోడ్పడుతుంది. మధుమేహం ఉన్నవారికి ఇది చాలా మేలు చేస్తుంది. రక్తంలో షుగర్ స్థాయిలను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. చర్మ సంరక్షణ: చర్మ ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది. దీనిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. జీర్ణక్రియ, ఇతర సమస్యలు: మెంతి ఆకు ఆకలిని పెంచుతుంది. దగ్గు, మొలలు, వాంతులు, కీళ్ల వ్యాధులు వంటి అనేక సాధారణ వ్యాధులను నివారిస్తుంది. కడుపులోని నులిపురుగులకు ఇది మంచి ఔషధంగా పనిచేస్తుంది. అయితే, పప్పు దినుసులలో దీనిని అతిగా వేయకూడదు.. లేదంటే పప్పు చేదుగా మారుతుంది. రక్తహీనత నివారణ: ఇందులో ఐరన్ పుష్కలంగా ఉండటం వల్ల రక్తహీనతను దూరం చేయడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. కంటిచూపు మెరుగుదల: మెంతికూరలో అధికంగా ఉండే ఫైబర్ కంటిచూపును మెరుగుపరుస్తుంది. దృష్టి లోపాలు ఉన్నవారు ఈ ఆకును తమ ఆహారంలో ఎక్కువగా చేర్చుకోవడం మంచిది. శరీర ఉష్ణోగ్రత నియంత్రణ: శరీర ఉష్ణోగ్రత అధికంగా ఉండేవాళ్లు మెంతికూరను తీసుకోవచ్చు. ఇది శరీరానికి చలువనిస్తుంది.. వేడి వలన వచ్చే అలర్జీలను దూరం చేస్తుంది. కఫం, పిత్త, వాతం వంటి రోగాలను దరిచేరనివ్వకుండా చేస్తుంది. జ్ఞాపకశక్తి మెరుగుదల, క్యాన్సర్ నిరోధం: మెంతి ఆకు జ్ఞాపకశక్తిని పెంచుతుంది. ఇందులో ఉండే సఫోన్ మ్యూకలేట్ ధాతువులు క్యాన్సర్‌ను నిరోధించడంలో సహాయపడతాయి. హృదయ ఆరోగ్యం, ఇతర ప్రయోజనాలు: విటమిన్ ఎ సమృద్ధిగా ఉండటం వల్ల గుండెపోటు, అలర్జీలు, దృష్టి లోపాలు, రక్తహీనత వంటి వాటిని తొలగిస్తుంది. నరాల బలహీనతతో బాధపడేవారు కూడా మెంతి కూరను తమ ఆహారంలో భాగంగా చేసుకోవచ్చు. ఇంకా.. మెంతి ఆకులను పేస్ట్‌లా చేసి ఫేషియల్‌గా ఉపయోగించవచ్చు. ఇది నల్లగా ఉన్నవారికి చర్మకాంతిని పెంచి, ముఖంపై నల్ల మచ్చలు, ముడతలను తగ్గిస్తుంది. మెంతులను నానబెట్టి పేస్ట్‌లా చేసి జుట్టుకు అప్లై చేయడం వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. మెంతి ఆకుతో లేదా మెంతులతో చేసే పప్పు ఆరోగ్యానికి మంచి పౌష్టికాహారం. మెంతి ఆకును ఎండబెట్టి పొడి చేసుకొని, అవసరమైనప్పుడు పప్పులు, కూరలలో వాడుకోవచ్చు. ఇది ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తుంది. మన ఇంటి పెరడులో కూడా మెంతి ఆకును సులువుగా పెంచుకోవచ్చు.. వారానికి కనీసం రెండు లేదా మూడుసార్లు మెంతులు లేదా మెంతి ఆకును ఆహారంలో చేర్చుకోవడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఇది కేవలం ఒక ఆకుకూర మాత్రమే కాదు.. సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించే ఒక దివ్య ఔషధం అంటున్నారు ఆయుర్వేద నిపుణులు.

# చిన్న ముక్క అల్లం తింటే ఇన్ని లాభాలా!



అల్లం కేవలం వంటకు రుచిని ఇవ్వడమే కాదు, అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమెటరీ గుణాలు జలుబు, నొప్పులను తగ్గిస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. బరువు తగ్గడానికి, కొలెస్ట్రాల్ నియంత్రణకు, రక్తంలో చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరించడానికి అల్లం తోడ్పడుతుంది. మీ రోజువారీ ఆహారంలో చేర్చుకుంటే మంచి ఆరోగ్యం సొంతం. అల్లం వంటలకు కేవలం మంచి రుచిని ఇవ్వడమే కాదు.. ఇంకా అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అల్లంలో ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమెటరీ గుణాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు అల్లంతో చెక్ పెట్టొచ్చు. జలుబు, దగ్గు, తలనొప్పి, మైగ్రేన్, నడుంనొప్పి, వెన్నుపూస నొప్పి, మోకాలి నొప్పులు, జాయింట్ పెయిన్స్ వంటి సమస్యలను తగ్గించడానికి అల్లం మంచి మెడిసిన్. ఆకలిని పెంచడంలో అల్లం బాగా సహాయ పడుతుంది. ముఖ్యంగా కీమోథెరపీ, రేడియోథెరపీ, క్యాన్సర్ బాధితులకు ఆకలి తగ్గిపోతుంది. అల్లం రోగనిరోధక శక్తిని పెంచి, శరీరాన్ని వ్యాధుల నుండి రక్షిస్తుంది. చర్మాన్ని మెరిసేలా చేసి, జుట్టును బలంగా, ఒత్తుగా ఉంచుతుంది. ఒత్తిడిని తగ్గించి మనస్సును ప్రశాంతంగా ఉంచడంలో కూడా ఇది ఎంతో సహాయపడుతుంది. ఆరోగ్యాన్ని మెరుగుపరచే ఈ సహజ ఔషధాన్ని మీ రోజువారీ జీవనశైలిలో చేర్చుకోవడం మంచిది. అలాగే ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి కొన్నిసార్లు ఆకలిగా అనిపించదు. ఇందులో నొప్పి, వాపును తగ్గించే లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. రోజుకు 2 నుంచి 5 గ్రాముల అల్లంను రెండు వారాల పాటు తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. అల్లం జీర్ణక్రియను మెరుగుపరచి, మలబద్ధకం సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. అదనపు కొవ్వును కరిగించి బరువు తగ్గడంలో సహాయపడుతుందే కాకుండా, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించి డయాబెటిక్ రోగులకు మేలు చేస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో అల్లం తినడం లేదా అల్లం నీరు తాగడం శరీర డిటాక్స్‌కు సహాయపడుతుంది. ఒక నెలపాటు ప్రతిరోజూ అల్లం తినడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. అల్లంలోని పదార్థాల వల్ల రక్తంలో ట్రైగ్లిజరైడ్‌ల పరిమాణం తగ్గుతుంది.

# ఈ సమయంలో అరటిపండు అస్సలు తినొద్దా

చలికాలం వచ్చిందంటే చాలు, పిల్లల ఆరోగ్యం విషయంలో తల్లులకు ఒకటే ఆందోళన. మారుతున్న వాతావరణం వల్ల పిల్లలు త్వరగా జలుబు, దగ్గు బారిన పడుతుంటారు. ఈ క్రమంలో తల్లులు పిల్లలకు దూరంగా పెట్టే ప్రధానమైన ఆహారం అరటిపండు. అరటిపండు తింటే కఫం పెరుగుతుందని, దగ్గు ఎక్కువవుతుందని చాలామంది నమ్ముతారు. చలికాలం వచ్చిందంటే చాలు.. చిన్న పిల్లల తల్లులకు ఒకటే ఆందోళన. మారుతున్న వాతావరణం వల్ల పిల్లలు త్వరగా జలుబు, దగ్గు బారిన పడుతుంటారు. ఇలాంటప్పుడు వారి ఆహారం విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ క్రమంలో తల్లులు పిల్లలకు దూరంగా పెట్టే ప్రధానమైన ఆహారం అరటిపండు. అరటిపండు తింటే శ్లేష్మం పెరుగుతుందని, దగ్గు ఎక్కువవుతుందని చాలామంది నమ్ముతారు. కానీ ఇందులో నిజమెంత? చలికాలంలో అరటిపండు పెట్టడం సురక్షితమేనా? నిజానికి జలుబు లేదా దగ్గు అనేవి వైరస్ల ద్వారా వచ్చే ఇన్ఫెక్షన్లు. ఏ పండు కూడా నేరుగా జలుబును కలిగించదు. అరటిపండు తినడం వల్ల శరీరంలో శ్లేష్మం పెరుగుతుందని నిరూపించడానికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. అరటిపండు తిన్నప్పుడు గొంతులో కొంచెం బిగుతుగా అనిపించడం సహజం. అది కేవలం ఆ పండు ఆకృతి వల్ల కలిగే అనుభూతి మాత్రమే తప్ప కఫం కాదు. పిల్లలు జలుబు, దగ్గుతో బాధపడుతున్నప్పుడు నీరసించి పోతుంటారు. ఏమీ తినడానికి ఇష్టపడరు. అలాంటి సమయంలో అరటిపండు వారికి ఒక వరంలా పనిచేస్తుంది. ఇందులో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండటం వల్ల పిల్లలకు తక్షణ శక్తిని ఇస్తుంది. అరటిపండు మెత్తగా ఉండటం వల్ల గొంతు నొప్పి ఉన్న పిల్లలు కూడా దీనిని సులభంగా తినగలరు. ఇందులోని విటమిన్ సి, విటమిన్ ః6 రోగనిరోధక శక్తిని పెంచి వైరస్‌తో పోరాడటానికి సహాయపడతాయి. శరీరంలోని ఖనిజ లవణాల సమతుల్యతను కాపాడుతుంది. పిల్లలకు అరటిపండు పెట్టినప్పుడు ఒకవేళ విరేచనాలు అవుతుంటే మాత్రం తాత్కాలికంగా ఆపేయడం మంచిది. చలికాలంలో ఏ ఆహారమైనా మితంగా ఇవ్వాలి. రోజుకు ఒకటి లేదా సగం అరటిపండును మ్యాష్ చేసి ఇవ్వడం వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఫ్రిజ్‌లో పెట్టిన అరటిపండ్లను నేరుగా పిల్లలకు ఇవ్వకండి. గది ఉష్ణోగ్రత వద్ద ఉన్న పండ్లను మాత్రమే ఇవ్వండి. అరటిపండు ప్రకృతి మనకిచ్చిన ఒక అద్భుతమైన సూపర్ ఫుడ్. అనవసరమైన అపోహలతో పిల్లలకు ఈ పోషకాలను దూరం చేయకండి. జలుబు చేసినప్పుడు ఆకలిగా లేని పిల్లలకు అరటిపండు ఒక మంచి ప్రత్యామ్నాయం.



# ఆరోగ్యం కోసం పరగడుపున అదొక్కటి తింటే చాలు



చూడటానికి ఎంతో సుకుమారంగా కనిపించినా, వ్యాయామం విషయంలో మాత్రం ఆమె ఒక రోల్‌మోడల్. నిత్యం యోగా, జిమ్ వర్కవుట్లతో తన సోషల్ మీడియాలో స్ఫూర్తిని నింపే ఆ బాలీవుడ్ నటి, తాజాగా తన మార్నింగ్ రొటీన్‌కు సంబంధించిన ఒక వింత అలవాటును పంచుకుంది. సాధారణంగా ఉదయాన్నే నిమ్మరసం, తేనె లేదా గ్రీన్ టీ తాగుతుంటారు. కానీ ఈమె మాత్రం అందరికీ భిన్నంగా ఒక పచ్చి వెల్లుల్లి రెబ్బను నమిలి తింటోంది. ఆ ఘాటైన వాసన, మండే రుచిని సైతం భరిస్తూ ఆమె ఎందుకు వెల్లుల్లిని తీసుకుంటోంది? కేవలం కొన్ని వారాల నుంచి పాటిస్తున్న ఈ చిన్న మార్పు తన శరీరంలో ఎలాంటి మ్యాజిక్ చేసిందో ఆమె స్వయంగా వెల్లడించింది. ఇంతకీ సోహా అలీ ఖాన్ నమ్ముతున్న ఆ ప్రాచీన వైద్య రహస్యం ఏంటి? వెల్లుల్లి మంత్రం.. ప్రముఖ నటి సోహా అలీ ఖాన్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక ఆసక్తికరమైన వీడియోను షేర్ చేశారు. గత కొన్ని వారాలుగా తను ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున ఒక చిన్న పచ్చి వెల్లుల్లి రెబ్బను తింటున్నట్లు ఆమె తెలిపారు. ఇది ప్రాచీన జ్ఞానం అని, ఇప్పటికీ ఇది అద్భుతంగా పనిచేస్తుందని ఆమె నమ్ముతున్నారు. ఈ అలవాటు వల్ల తన రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా, జీర్ణక్రియ మెరుగుపడిందని సోహా వివరించారు. వెల్లుల్లిని ఊరికే మింగేయడం కంటే నమిలి తినడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందని సోహా చెబుతున్నారు. వెల్లుల్లిని నమిలినప్పుడు అందులో ఉన్న 'అల్లిసిన్' అనే సమ్మేళనం యాక్టివేట్ అవుతుంది. వెల్లుల్లిలో ఉండే శక్తివంతమైన ఆరోగ్య ప్రయోజనాలకు ఈ అల్లిసిన్ ప్రధాన కారణం. ఒకవేళ నమలడం కష్టంగా అనిపిస్తే, వెల్లుల్లిని ముక్కలుగా కోసి లేదా దంచి ఒక 10 నిమిషాల పాటు పక్కన పెట్టి, ఆ తర్వాత నీటితో కలిపి తీసుకోవాలని ఆమె సూచించారు.

# నిబంధనల ప్రకారం నామినేషన్ ప్రక్రియ

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ :** ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు.మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా హుజురాబాద్, జమ్మికుంట మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, నామినేషన్ ఫారాలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఆయా వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించుకుని, వెంటవెంటనే రోజు వారీగా టీ.పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలని అన్నారు. అభ్యర్థులు అన్ని వివరాలతో నామినేషన్ పత్రాలను దాఖలు చేసేలా హెల్ప్ డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, వారి సందేహాలు నివృత్తి చేయాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి కట్టుబడి, మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గురువారం నుంచి ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని సూచించారు. నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలన జరిపేలా అవసరమైన సిబ్బందిని నియమించామని అన్నారు. ఎన్నికల సంఘం నియమ, నిబంధనలను పక్కాగా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.కలెక్టర్ వెంట జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండి. ఆయాజ్, హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ ఉన్నారు.



# సర్వజన హితం కోసమే రాజశ్యామల యాగం

## డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు

**హైదరాబాద్ :** ఆధ్యాత్మిక భావనతో నిర్వహించే కార్యక్రమాలు సమాజ హితాన్ని దృష్టిలో పెట్టుకుని జరుగుతాయని తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ మాజీ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. సనాతన ధర్మం, సంప్రదాయ ఆచారాలు, పూజా విధానాలు ప్రజలను సన్మార్గంలో నడిపించడానికే ఉద్దేశించబడ్డవని ఆయన స్పష్టం చేశారు. రాజశ్యామల యాగం వంటి యజ్ఞాలు, హోమ క్రతువులు సర్వజన హితాన్ని లక్ష్యంగా చేసుకుని నిర్వహించబడతాయని తెలిపారు. ధర్మ పరిరక్షణ ద్వారా సమాజంలో శాంతి, శ్రేయస్సు నెలకొల్పడంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.జనవరి 19 నుంచి 28 వరకూ పది రోజుల పాటు శ్రీ రాజశ్యామల దేవి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించగా, ఇవాళ పూర్ణాహుతితో ముగిశాయి. ఈ సందర్భంగా డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.ఈ మహోత్సవాలు శ్రీ విద్యా శక్తి పీఠం ఆధిపతి శ్రీ నారాయణం చక్రవర్తుల శర్మ మార్గదర్శకత్వంలో నిర్వహించబడ్డాయి. కార్యక్రమాలు శ్రీ విద్యా శక్తి పీఠంలో, ఆర్‌కే పురం, హైదరాబాద్‌లో జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరా వడంతో పీఠ ప్రాంగణం భక్తిశ్రద్ధలతో నిండిపోయింది. ముగింపు రోజైన ఇవాళ బుధవారం వేదపండితులు, ఘనపాఠులు ఆధ్వర్యంలో శాస్త్రోక్త విధానంలో యాగాంగ రంగా వైభవంగా పూర్ణాహుతి నిర్వహించబడింది. హోమాలు, యాగ క్రతువులు, పారాయణాలు వేదోక్తంగా జరిగాయి.పది రోజుల పాటు మహిళా భక్తుల విశేష పాల్గొనతో కుంకుమార్చన, విష్ణు అష్టోత్తర, సహస్రనామావళి పారాయణం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఉపాసకులు రాంసుధాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు. పూర్ణాహుతి అనంతరం తీర్థ ప్రసాద స్వీకరణ తర్వాత, పీఠం ఆధ్వర్యంలో డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావును శాలువాతో సత్కరించి, లడ్డూ ప్రసాదం అందజేశారు.



## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ పెబ్బేరు మున్సిపాలిటీ ప్రధాన నాయకులు



**వనపర్తి :** పెబ్బేరు మున్సిపాలిటీకి చెందిన మాజీ ఎంపిటిసి, మాజీ కోఆప్షన్, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్, మాజీ వార్డు సభ్యుడు అయిన ఐజాక్ తో పాటు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ గంధం వెంకటయ్య, నరేందర్ లు బుధవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, డీసీసీ అధ్యక్షులు శివసేన రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.కాంగ్రెస్ పార్టీకి అవసరం ఉన్న సమయంలో మీరు రావడం అభినందనీయమని రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించేందుకు మీరు మనస్ఫూర్తిగా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ హయంలో పదవుల్లో ఉన్నామే తప్ప ఎలాంటి గౌరవ మర్యాదలు ఉండేవి కావని నేను కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో ప్రభుత్వ పథకాలు ప్రతి నిరుపేద కందుతున్నాయని ఆకర్షితులమై నేడు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, మండల

# నామినేషన్ ప్రక్రియను సందర్శించిన జిల్లా కలెక్టర్ కె. హైమావతి

**సిద్దిపేట :** సాధారణ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి చేర్యాల పట్టణంలోని పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పురపాలక సంఘం మరియు దుబ్బాక మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన నామినేషన్ ప్రక్రియను ను జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ.ముసిపాలిటీ ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. మన జిల్లాలో చేర్యాల, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ మున్సిపాలిటీలో బుధవా రం నుండి 3 రోజుల పాటు ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఆయా మున్సిపల్ సెంటర్ లో నామినేషన్ స్వీకరించడం జరుగుతుంది. 4 మున్సిపాలిటీల్లో 72 వార్డులలో 176 పోలింగ్ స్టేషన్ లలో ఫిబ్రవరి 11 వ తేదీన పోలింగ్, 13 వ తేదీన కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం సెంటర్ చుట్టు 100 మీటర్లలో 144 సెక్షన్ అమలుతో పాటు నామిని అభ్యర్థితో పాటు ఇద్దరిని మాత్రమే లోపలికి పంపించాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. నామిని అభ్యర్థి సెంటర్ కి వచ్చిన సమయం నుండి నామినేషన్ వేసి బయటికి వెళ్ళే సమయాన్ని నోట్ చేసుకుని మొత్తం ప్రక్రియను వీడియో తీయించాలని మున్సిపల్ కమిషనర్లు ఆదేశించారు. నామినేషన్ సెంటర్ లో ఫోన్ అనుమతి లేదని అన్ని సెంటర్లలో 100 శాతం వెబ్ కాస్టింగ్ చేస్తున్నామని తెలిపారు.



# కారులో బయల్దేరిన 8 మంది స్నేహితులు.. గమ్యం చేరకుండానే..

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగర సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పై వేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి పిల్లర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు యువకులు అక్కడి కక్కడే మృతి చెందగా.. మరి కొందరు గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారిని హాస్పిటల్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.బుధవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి చెందిన ఘటన హైదరాబాద్ నగర సమీపంలోని ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పై వెలుగు చూసింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకొని పోస్ట్‌మార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. అయితే ప్రమాద సమయంలో సుమారు 8 మంది విద్యార్థులు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానిక హాస్పిటల్‌కు తరలించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయి వరుణ్, నిఖిల్, వెంకట్, రాకేశ్, యశ్వంత్, సాత్విక్, హర్షవర్ధన్, అభినవ్ అనే 8 మంది యువకులు కారులో బుధవారం ఉదయం మౌలాలి నుంచి పోచారం వైపు వెళ్తున్నారు. అయితే కారు వేగంగా ఉండడంతో ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్‌పైకి రాగానే అదుపుతప్పి 97వ పిల్లర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయి వరుణ్, నిఖిల్ అక్కడికక్కడే మృతి చెందగా.. వెంకట్, రాకేష్ స్వల్పంగా గాయపడ్డారు. మిగతా స్నేహితులకు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.స్థానికుల సమాచారంతో వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు గాయపడిన వెంకట్, రాకేశ్‌ను సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాలను వెలికితీసి పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు.

## సీపీఐ (ఎమ్ ఎల్) చంద్ర పుల్లా రెడ్డి

## పార్టీ అనుబంధ కేంద్ర, రాష్ట్ర, ప్రజా సంఘాలు రద్దు

**పిఓడబ్లు సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు**

**త్వరలో పార్టీ ప్రజా సంఘాల నిర్మాణం**

**సీపీఐ( ఎమ్ ఎల్) సీపీ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్**

**హైదరాబాద్ :** సంగారెడ్డి పట్టణం లో జరిగిన పార్టీ పొలిట్ బ్యూరో సమావేశంలో ఇటీవల జరిగినా కొన్ని పరిణామాలతో పార్టీ కి నష్టం కల్గే చర్యల వల్ల పార్టీ పొలిట్ బ్యూరో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి కొన్ని తీర్మానాలు చెయ్యడం జరిగిందని సీపీఐ( ఎమ్ ఎల్) సీపీ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ నేడొక ప్రకటనలో తెలిపారు. పార్టీ అనుబంధ ప్రజా సంఘాలు ఇఫ్టు, పిఓడబ్లు ,పివైఎల్ ,రైతు కూలి సంఘం, పిడిఎస్యు తదితర ప్రజా సంఘాల ను రద్దు చేయ్యడం జరిగింది,ఇక పై ఈ సంఘాల తో ఉన్న నాయకత్వం ఈ సంఘాల పేరుతో పని చెయ్యరాదని పార్టీ పొలిట్ బ్యూరో కోరడమైనది,త్వరలో జాతీయ స్థాయి ప్లీనరీలో పార్టీ ప్రజా సంఘాలు ఏర్పాటు చేస్తుందని,కొన్ని ప్రత్యేక పరిస్తితి లో పిఓడబ్లు సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేసింది జాతీయ కార్యదర్శి వెలుగు వనిత,ప్రసిడెంట్ గా సంపంగి పద్మక్క ,గడిపే విమల ను పార్టీ పొలిట్ బ్యూరో నియామకం చేసింది

## మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది

**మున్సిపాలిటీ నామినేషన్,పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి**

**జగిత్యాల :** అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తన నియమావళి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను కచ్చితంగా పాటించాల్సి ఉంటుందని అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్లు ప్రారంభమైన నేపథ్యంలో కోరుట్ల,రాయికల్ పట్టణాల్లో ఏర్పాటు చేసిన మున్సిపాలిటీ నామినేషన్ స్వీకరణ కేంద్రాలను, పలు పోలింగ్ కేంద్రాలను అదనపు ఎస్పీ ఎస్పీ శేషాద్రిని రెడ్డి పరిశీలించారు.అక్కడ కొనసాగుతున్న నామినేషన్ ప్రక్రియ, నిర్వహణ తీరు, భద్రతా ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఉన్న పోలీసు సిబ్బందికి ఎన్నికల నిబంధనల ప్రకారం 100 మీటర్ల పరిధి నిబంధనలను అమలు చేయాలని నామినేషన్ కేంద్రాల్లోకి అనుమతి లేకుండా వ్యక్తులను పంపవద్దని అన్నారు.అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తన నియమావళి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను కచ్చితంగా పాటించాల్సి ఉంటుందని అన్నారు. అదనపు ఎస్పీ వెంట డిఎస్పి రాములు, కోరుట్ల సీ.ఐ సురేష్, ఎస్.ఐ లు చిరంజీవి, సుధీర్ రావు ఉన్నారు.

## అంగన్వాడి కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ విద్యార్థుల సంఖ్యను పెంపుకు కృషి చేయండి

**జిల్లా సంక్షేమ అధికారి రాజ్ కుమార్**

**కోరుట్ల :** అంగన్వాడి కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మోహన్ రావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన మెట్ పల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ప్రాజెక్టు పరిధిలోని ప్రతి అంగన్వాడి కేంద్రంలో నిబంధన కనుగుణంగా సరుకులు పంపిణీ చేయాలని. ప్రతి విద్యార్థి యొక్క ఎదుగుదలను నమోదు చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ప్రీ ప్రైమరీ లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని తెలిపారు. గర్భిణులకు బాలింతలకు విధిగా పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. కిషోర్ బాలికలకు కావలసిన సూచనలను చేస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం అందరూ పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి నరేష్ తో పాటు మెట్ పల్లి ప్రాజెక్టు సూపర్వైజర్ కె. మణెమ్మ మరియు ప్రాజెక్టు పరిధిలోని సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమవళి పక్కాగా అమలు చేయాలి

**నామినేషన్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలి**

**నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**కోరుట్ల :** మెట్ పెల్లి,కోరుట్ల మున్సిపాలిటీల్లో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరుగుతోందా లేదా అనే విషయాన్ని స్వయంగా పరిశీలించారు.నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద అన్నిరకాల ఫామ్స్ అందుబాటులో ఉండేల చూసుకోవాలని ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని,శాంతియుత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి, కోరుట్ల ఆర్డీఓలు శ్రీనివాస్, జివాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరు సహకరించాలి

**మున్సిపల్ ఎన్నికల కోడ్ నియమావళి ని పాటించాలి**

**జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్**

**జగిత్యాల :** ఎన్నికల కోడ్ నియమావళిని అందరు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు.బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో మిని సమావేశ హాల్ లో ఏర్పాటు చేసిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ( లోకల్ బాడీ) బి. రాజ గౌడ్ పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలకు సంబంధించిన గోడ రాతలు, వాల్‌పోస్టర్, ఫ్లెక్సీ బ్యానర్లు తొలగించాలని సూచించారు. నామినేషన్ కేంద్రాలు మరియు పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల దూరం నిబంధన పాటించాలని కోరారు. ఎన్నికలు జరుగు 5 మున్సిపాలిటీల్లో అనుమతులు లేకుండా సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతి నిధులు ఎన్నికల నియమావళి పాటించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలకు లోబడి ఎన్నికల ఖర్చును వినియోగించుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఎన్నికల ప్రచార కరపత్రాలపై తప్పనిసరిగా ప్రింటర్ల సమాచారం ఉండాలని రాజకీయ పార్టీలకు సూచించారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణం లో జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సంహకరించాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా నోడల్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా ఎన్నికల విభాగం మరియు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ లీగల్ సెల్ చీఫ్ కన్వీనర్‌గా బైరి విజయ్ నియామకం

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు**

**కోరుట్ల :** బీఆర్ఎస్ లీగల్ సెల్ చీఫ్ కన్వీనర్‌గా బైరి విజయ్, కో - కన్వీనర్ ల నియమించినట్లు బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు తెలిపారు. కోరుట్ల పట్టణ, మండల బీఆర్ఎస్ లీగల్ సెల్ కన్వీనర్, కో కన్వీనర్ లకు నియామక పత్రాలు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ప్రకటించారు. ఈ సందర్భంగా కోరుట్ల పట్టణ మండల భారత రాష్ట్ర సమితి పార్టీ లీగల్ సెల్ చీఫ్ కన్వీనర్ గా బైరి విజయ్ కుమార్, కో - కన్వీనర్లుగా సుతారి నవీన్ కుమార్, వనపర్తి క్రాంతికుమార్, వేముల నాగరాజు, కటుకం రాజేష్, ఊరడి నరేందర్, రాస గౌతమ్, అల్వాల వినయ్ కుమార్, సదుల మాధురి, ఓటారికారి రంజిత, గట్ల సృజన్ కుమార్ లను నియమిస్తూ వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ నియామకాల పట్ల భారత రాష్ట్ర సమితి పార్టీ కోరుట్ల మండల అధ్యక్షులు దారిశెట్టి రాజేష్, సింగిరెడ్డి నారాయణ రెడ్డి, కోరుట్ల పట్టణ భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యదర్శి గుడ్ల మనోహర్ తదితర నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ లీగల్ సెల్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## బిజినెస్

### ఆర్థిక సర్వే అంచనాలను వాస్తవ వృద్ధి అధిగమిస్తోంది!



మనదేశ ఆర్థిక వృద్ధి గణాంకాలను పరిశీలిస్తే, ఆర్థిక సర్వేలో ప్రకటించిన అంచనాలను తరచుగా అధిగమిస్తున్నాయి. బడ్జెట్ ముందస్తు పత్రం (ప్రీ-బడ్జెట్ డాక్యుమెంట్)లో అంచనా వేసిన 6.3-6.8% వృద్ధికి మించి 2025-26 ఆర్థిక సంవత్సరంలో 7.4% వృద్ధిరేటు నమోదవుతుందని అంచనా. 2023-24 ఆర్థిక సర్వేలో జీడీపీ వృద్ధి 6-6.8 శాతమని అంచనా వేయగా, అది 9.2 శాతంగా నమోదైంది. 2024-25లో మాత్రం ఆర్థిక సర్వే అంచనా 6.5-7 శాతానికి అనుగుణంగా, 6.5 శాతంగా నమోదైంది. 2022-23లో లక్ష్యం నెరవేరలేదు. వాస్తవిక ఆర్థిక వృద్ధి 7.65% ఉండగా, ఆర్థిక సర్వే అంచనా 8-8.5 శాతంగా ఉంది. 2021-22లో కొవిడ్ కారణంగా ఆర్థిక సర్వే ఎలాంటి అంచనాలను వేయలేదు. కానీ బేస్ ప్రభావం కారణంగా 9.7% వృద్ధి నమోదైంది. 2020-21లో కొవిడ్ ప్రభావం, తదనంతర లాక్‌డౌన్‌ల కారణంగా 5.8% ప్రతికూల వృద్ధి నమోదైంది. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండగా, దీనికి ఒకరోజు ముందు ఆర్థిక సర్వేను వెల్లడిస్తారు.

### ఎఫ్‌టీఏతో యూరప్‌లో భారతీయ ఐటీ సంస్థలకు మెరుగైన అవకాశాలు




ప్రతిష్ఠాత్మక ఇండియా-యూరోపియన్ యూనియన్(ఈయూ) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) జరగడం పట్ల ఐటీ పరిశ్రమల సంఘం నాస్కామ్ హర్షం వ్యక్తం చేసింది. ఈ ఒప్పందం ద్వారా దేశంలోని టెక్ పరిశ్రమకు మెరుగైన ఈయూ మార్కెట్ యాక్సెస్ లభిస్తుంది. ప్రస్తుతం యూరప్ భారతీయ ఐటీ సేవల సంస్థలకు ఆశాజనకమైన కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్ లాంటి సంస్థలు విస్తరిస్తున్నాయి. ఎఫ్‌టీఏ ద్వారా ఆయా కంపెనీలకు మరిన్ని ఒప్పందాలను సాధించడానికి సహాయపడుతుంది. వస్తువులపై గణనీయంగా సుంకాలు తగ్గనున్నప్పటికీ, సేవల రంగ లాభాల వల్ల మార్కెట్లో మరింత యాక్సెస్ లభిస్తుందని, నిబంధనల సడలింపు కలిసొస్తుందని నాస్కామ్ అభిప్రాయపడింది. ముఖ్యంగా ఎఫ్‌టీఏ ఖరారు కావడంతో భారతీయ ఐటీ ప్రొఫెషనల్స్‌కు అవకాశాలు మెరుగుపడతాయి. స్కిల్స్ ఉన్న ఉద్యోగులను సులభంగా బదిలీ చేయవచ్చని, సేవలను సజావుగా సరిహద్దు దాటేందుకు, సురక్షితమైన డేటా సరఫరాకు వీలవుతుంది. ఈ ఒప్పందంలో టెక్నాలజీ చిన్న భాగం కాదని నిపుణులు అంటున్నారు. ఇది భారత్‌ను ప్రపంచ ఐటీ లీడర్‌గా గుర్తిస్తుంది. డిజిటల్ వాణిజ్యం, ఈ-సేవలు, డేటా భద్రత, డిజిటల్ అథంటికేషన్‌ను ప్రోత్సహిస్తుంది. భారతీయ టెక్ కంపెనీలు యూరప్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థతో మరింత లోతుగా కనెక్ట్ అవ్వడానికి సహాయపడుతుందని నాస్కామ్ పేర్కొంది.

## ఆల్ టైం కనిష్టానికి ఇరాన్ కరెన్సీ..
# డాలరుకు 15 లక్షల రియాల్స్

ఇరాన్ కరెన్సీ అయిన ఇరానియన్ రియాల్ మళ్లీ భారీగా పడిపోయింది. ఓపెన్ మార్కెట్‌లో ఒక అమెరికన్ డాలర్‌కు ఆల్ టైమ్ కనిష్టంగా సుమారు 14.7 లక్షల నుంచి 15 లక్షల రియాల్స్ వరకు డౌన్ అయింది. ఇది ఇరాన్ చరిత్రలోనే అత్యల్ప స్థాయి కావడం గమనార్హం. 2025 చివరితో పోలిస్తే రియాల్ విలువ దాదాపు 20 నుంచి 30 శాతం వరకు పడిపోయింది. అయితే ఇరాన్ సెంట్రల్ బ్యాంక్ ప్రకటించే అధికారిక రేటు సుమారు 42 వేల రియాల్స్‌గా ఉన్నప్పటికీ, ఆ రేటును సాధారణంగా ఎవరూ ఉపయోగించరు. దేశంలో వాస్తవంగా జరిగే లావాదేవీలు అన్నీ ఓపెన్ మార్కెట్ రేటు ప్రకారమే జరుగుతున్నాయి. ఇరాన్ కరెన్సీ పతనానికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా అమెరికా సహా పశ్చిమ దేశాల ఆర్థిక ఆంక్షల వల్ల ఇరాన్‌కు చమురు ఎగుమతులు తగ్గాయి. విదేశీ కరెన్సీ దేశంలోకి రావడం బాగా తగ్గిపోయింది. మరోవైపు దేశంలో ద్రవ్యోల్బణం తీవ్రంగా పెరిగింది. 2025 డిసెంబర్ నాటికి ఇన్‌ఫ్లేషన్ 40 శాతానికి పైగా ఉండగా, ఆహార పదార్థాల ధరలు 70 శాతం కంటే ఎక్కువగా పెరిగాయి. ధరల పెరుగుదలతో ప్రజలు ఆందోళనకు గురై దేశవ్యాప్తంగా నిరసనలు కూడా చేశారు. ప్రభుత్వం తీసుకున్న కొన్ని ఆర్థిక నిర్ణయాలు, సబ్సిడీల తగ్గింపు, ఫారెక్స్ నియమాల్లో మార్పులు కూడా పరిస్థితిని మరింత దిగజారేలా మార్చాయి. ఇది సాధారణ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఒక డాలర్‌కు 15 లక్షల రియాల్స్ అంటే దిగుమతి చేసుకునే ఆహారం, మందులు, టెక్నాలజీ వస్తువుల ధరలు భారీగా పెరిగిపోయినట్టేనని నిపుణులు




చెబుతున్నారు. బ్రెడ్, మాంసం, ఔషధాలు వంటి అవసరమైన వస్తువులు కూడా సామాన్యులకు అందని స్థితికి చేరుతున్నాయి. ఇరాన్ ఇప్పుడు హైపర్ ఇన్‌ఫ్లేషన్ దశకు చేరిందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అందుకే ప్రజలు తమ డబ్బు విలువ కాపాడుకోవడానికి డాలర్లు, బంగారం, క్రిప్టో కరెన్సీల్లో పెట్టుబడి పెడుతున్నారు. ప్రభుత్వం, సెంట్రల్ బ్యాంక్ మాత్రం దీనిని సహజ ప్రక్రియగా చెబుతున్నా, ఆర్థిక నిపుణులు ఇది తీవ్రమైన ఆర్థిక సంక్షోభమని, రాబోయే రోజుల్లో మరిన్ని నిరసనలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మరోవైపు ఇరాన్ రియాల్ ప్రపంచంలోనే అతి తక్కువ విలువ గల కరెన్సీల జాబితాలో ఒకటిగా చేరింది.

## కొత్త భారత్ యాత్ర ట్రావెల్ కార్డును విడుదల చేసిన క్విక్-కామర్

ప్రముఖ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ బ్లింక్ఇట్ కొత్త ట్రావెల్ కార్డును విడుదల చేసింది. తన ప్లాట్‌ఫామ్ ద్వారా భారత యాత్ర పేరుతో తెచ్చిన ఈ కార్డు నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్(ఎన్‌సీఎంసీ) ఆధారంగా పనిచేస్తుంది. బ్లింక్ఇట్ ఈ కార్డును ఢిల్లీ ఎన్‌సీఆర్, బెంగళూరు, ముంబై, చెన్నై, అహ్మదాబాద్‌లలో అందుబాటులోకి తెచ్చింది. దీని ధర రూ. 50 ఉంటుందని, ఎలాంటి కేవైసీ ప్రక్రియ అవసరం లేదని కంపెనీ తెలిపింది. ఇదే సమయంలో ఒక్కో సిటీలో ఒక్కో ట్రావెల్ కార్డుల అవసరాన్ని కూడా తొలగిస్తుందని బ్లింకిట్ మాతృ సంస్థ ఎటర్నల్ గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా త్వరలో బాధ్యతలు స్వీకరించనున్న అల్బిందర్ దిండ్సా అన్నారు. ఇది రూపే ఆధారిత కార్డు, తక్షణం యూపీఐ టాప్-అప్ సౌకర్యంతో పనిచేస్తుంది. దేశంలో వివిధ నగరాల్లో మెట్రో, బస్సులు వంటి ప్రజా రవాణాలో కీలకంగా ఉంటుందని దిండ్సా వివరించారు. ఈ కార్డును భారత్ యాత్ర మొబైల్ అప్లికేషన్ ఉపయోగించి లింక్ చేయడం ద్వారా యాక్టివేట్ చేసుకోవచ్చు. ఇది ఐదేళ్ల కాలపరిమితితో వస్తుందని, వ్యాలెట్‌లో రూ. 2,000 వరకు యాడ్




చేసుకోవచ్చని బ్లింక్ఇట్ పేర్కొంది. ప్రస్తుత దీన్ని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్‌లోని మెట్రోలకు, ముంబై, చెన్నైలోని బస్సు ప్రయాణాలకు ఉపయోగించవచ్చు. భారత్ యాత్ర కార్డ్ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫ్లిప్‌కార్ట్‌లో కూడా అందుబాటులో ఉంది.

## స్పోర్ట్స్

## చరిత్ర సృష్టించిన టెన్నిస్ స్టార్..
# ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లోకి జోకోవిచ్

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లోకి నోవాక్ జోకోవిచ్ ప్రవేశించాడు. ఈ నేపథ్యంలో ఆ టెన్నిస్ స్టార్ చరిత్ర సృష్టించారు. క్వార్టర్ ఫైనల్‌తో పాటు రౌండ్-16లోనూ ఒక్క సెట్ కూడా గెలవకుండానే సెమీఫైనల్లోకి ప్రవేశించాడతను. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కొత్త రికార్డులు క్రియేట్ చేశాడు. క్వార్టర్స్‌లో ఓటమి అంచు నుంచి బయటపడ్డ అతను.. చాలా లక్కీగా సెమీస్‌కు ఎంట్రీ ఇచ్చాడు. రాడ్ లావెర్ ఎరినా లో ఇవాళ జరిగిన క్వార్టర్స్ మ్యాచ్ నుంచి ఇటలీ ప్లేయర్ లోరెంజో ముసెటి గాయంతో తప్పుకున్నాడు. వాస్తవానికి ఈ మ్యాచ్‌లో ముసెటి పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. ఇక గెలుపు ఖాయం అనుకున్న దశలో.. తొడ కండరాలు పట్టేయడంతో ముసెటి మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. 6-4, 6-3 స్కోరుతో ముసెటి తొలి రెండు సెట్లను కైవసం చేసుకున్నాడు. ఇక మూడవ సెట్‌లోనూ 3-1 తేడాతో ఆధిపత్యంలో కొనసాగుతున్నాడు. ఆ సమయంలో ముసెటి



కుడి తొడలో తీవ్రమైన నొప్పి వచ్చింది. ఆ దశలో అయిదో సీడ్ ముసెటి రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. గాయం వల్ల తప్పుకోవడంతో లక్కీగా జోకోవిచ్ సెమీస్‌లోకి ప్రవేశించాడు. అంతకుముందు రౌండ్-16లో కూడా జాకబ్ మెన్సిక్ గాయంతో తప్పుకున్నాడు. ఆ మ్యాచ్‌లో జోకోవిచ్‌కు వాకోవర్ లభించింది. దీంతో రెండు మ్యాచుల్లో ఒక్క సెట్ కూడా గెలవకుండా జోకోవిచ్ సెమీస్‌లోకి ఎంటర్‌కావడం విశేషం. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కొత్త రికార్డ్ క్రియేట్ చేశాడు జోకోవిచ్. ఆ గ్రాండ్‌స్లామ్‌లో 103వ మ్యాచ్ గెలిచాడు. గతంలో రోజర్ ఫెదరర్ పేరిట ఉన్న రికార్డును బ్రేక్ చేశాఆడు. మెల్‌బోర్న్ పార్క్‌లో స్విస్ ప్లేయర్ ఫెదరర్ కూడా వందకు పైగా మ్యాచ్‌ల్లో విజయం సాధించాడు. మూడు రకాల గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో జోకోవిచ్ వందకుపైగా మ్యాచ్‌లను గెలవడం గమనార్హం.

### మన స్పిన్నర్లు సూపర్.. ఆ ఒక్కడికే కష్టం: కుంబ్లే

టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిపై భారత స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే ప్రశంసలు కురిపించాడు. అద్భుతమైన నైపుణ్యాలు కలిగి ఉన్న వరుణ్.. టీ20 ప్రపంచకప్-2026 టోర్నమెంట్లో స్పిన్ దళానికి నాయకుడిగా ఉంటాడని పేర్కొన్నాడు. మంచు ప్రభావం అతడి బౌలింగ్‌పై ప్రభావం చూపబోదని.. తడిచిన బంతితోనూ వరుణ్ అనుకున్న ఫలితం రాబట్టలగడని పేర్కొన్నాడు.

**మంచు ప్రభావం**

భారత్- శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న టీ20 వరల్డ్‌కప్-2026 టోర్నీ ఫిబ్రవరి 7- మార్చి 8 వరకు జరుగనుంది. ఇందుకు ఆఖరి సన్నాహకంగా టీమిండియా స్వదేశంలో న్యూజిలాండ్‌తో సిరీస్‌తో బిజీగా ఉంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇప్పటికే 3-0తో గెలిచి.. సిరీస్ సొంతం చేసుకుంది. ఈ మూడు మ్యాచ్‌లలోనూ మంచు ప్రభావం కనిపించింది. ఈ నేపథ్యంలో టీమిండియా దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశాడు. టీ20 వరల్డ్‌కప్‌లో టీమిండియా స్పిన్నర్లు సత్తా చాటుతారని.. తేమ ప్రభావం వల్ల మనవాళ్లకు పెద్దగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం లేదని అభిప్రాయపడ్డాడు.

**స్పిన్నర్లకు కష్టమే.. కానీ**

జియోహాట్‌స్టార్‌లో మాట్లాడుతూ.. "ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలో వరల్డ్‌కప్ జరగనుంది. రాత్రి పూట మంచు ప్రభావం ఉండటం సహజం. కాబట్టి.. తడిసిన బంతితో బౌలింగ్ చేయడం స్పిన్నర్లకు కష్టమే. అయితే భారత స్పిన్నర్లకు ఇది పెద్ద ఇబ్బందేం కాకపోవచ్చు. ముఖ్యంగా



వరుణ్ చక్రవర్తి ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నోసార్లు ఆడాడు. తడిచిన బంతితోనూ ప్రభావం చూపగల సత్తా అతడికి ఉంది. అక్షర్ పటేల్‌కు కూడా ఇదేమీ పెద్ద కష్టం కాబోదు. అయితే మణికట్టు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మాత్రం.. తన బౌలింగ్ శైలి కారణంగా తేమ కారణంగా కాస్త ఇబ్బంది పడవచ్చు. అయినా పరిస్థితులకు తగ్గట్లు ఎలా బౌలింగ్ చేయాలో కుల్దీప్‌నకు తెలుసు' అని కుంబ్లే అన్నాడు. అదే విధంగా.. న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో అదరగొడుతున్న టీమిండియా... వరల్డ్‌కప్‌లోనూ అదే జోరు కొనసాగిస్తుందని కుంబ్లే ఆశాభావం వ్యక్తం చేశాడు. "టీ20 ఫార్మాట్‌లో వరుసగా రెండుసార్లు ప్రపంచకప్ గెలవడం అంత సులువైన విషయం కాదు. ఇప్పటి వరకు ఏ జట్టూ ఆ ఫీట్ నమోదు చేయలేదు. అయితే టీమిండియాకు ఆ సత్తా ఉంది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనున్న భారత్... ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేంత బలంగా ఉంది" అని కుంబ్లే పేర్కొన్నాడు.

### ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మళ్లీ టాప్‌టెన్‌లోకి సూర్యకుమార్



ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత క్రికెట్ జట్టు సారథి సూర్యకుమార్ యాదవ్ టాప్ టెన్ (౧శీజూ 10) బ్యాట్స్‌మెన్ జాబితాలో తిరిగి చోటు దక్కించుకున్నాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో అదరగొడుతున్న సూర్యకుమార్.. ఐదు స్థానాలు ఎగబాకి 717 రేటింగ్ పాయింట్లతో ఏడో స్థానానికి ఎగబాకాడు. పొట్టి క్రికెట్‌లో పరుగులు సాధించడానికి ఇబ్బందిపడుతున్న సూర్యకుమార్ మళ్లీ ఫామ్‌లోకి వచ్చాడు. న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20లో 82, మూడో టీ20లో 57 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. భారత ఓపెనర్ అభిషేక్ శర్మ కూడా మూడో టీ20లో 68 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 14 బంతుల్లోనే అర్ధసెంచరీ చేశాడు. నాగపూర్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 35 బంతుల్లో 84 పరుగులు చేశాడు. తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 929 రేటింగ్ పాయింట్లతో తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. ఇంగ్లండ్ క్రికెటర్ ఫిల్ సాల్ట్ (849), తిలక్ వర్మ (781) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా నాలుగు స్థానాలు ఎగబాకి 13వ ర్యాంకులో నిలిచాడు. అదేవిధంగా మూడో టీ20లో మూడు వికెట్లు తీసి రాణించాడు. ఆల్ రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్య ఒక స్థానం ఎగబాకి మూడో ర్యాంకుకు, శివమ్ దుబే ఐదు స్థానాలు ఎగబాకి పదకొండవ ర్యాంకుకు చేరుకున్నారు. అక్షర్ పటేల్ 3 స్థానాలు పడిపోయి 13వ ర్యాంకులో ఉన్నాడు.


# నటిగా ఎంట్రీ ఇస్తున్నా..

బిగ్‌బాస్ ఫేమ్ స్రవంతి చొక్కారపు యాంకర్‌గా ఫుల్ బిజీగా ఉంది. ఓపక్క సినిమా ఈవెంట్స్ చేస్తూ మరో పక్క సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటోంది. తాజాగా ఆమె ఓ సినిమా చేసింది. సుహాస్ హీరోగా నటిస్తున్న హే భగవాన్ మూవీలో స్రవంతి ఓ కీలక పాత్ర పోషించింది. బుధవారం హే భగవాన్ సినిమా టీజర్ రిలీజైంది. ఈ సందర్భంగా యాంకర్ స్రవంతి మాట్లాడుతూ.. నటిగా ఇది నా ఫస్ట్ స్పీచ్.. కాబట్టి ముందు నా గురించి చెప్తాను. నా పేరు స్రవంతి చొక్కారపు. అనంతపురం జిల్లాలోని కదిరి నా స్వస్థలం. నటి అవ్వాలన్న ఆశతో 2009లో ఇండస్ట్రీకి వచ్చాను. కానీ నటి అవడానికి ఇన్నేళ్లు పట్టింది. హే భగవాన్‌తోనే నటిగా లాంచ్ అవాలని రాసిపెట్టుందేమో! దర్శకుడు గోపి ఒక్క ఆడిషన్ కూడా తీసుకోకుండా నన్ను సెలక్ట్ చేశారు. నేరుగా షూటింగ్‌కే పిలిచి ఆయనకు కావాల్సినట్లు నటించేలా చేశారు. ఈ మూవీలో నేనే సర్‌ప్రైజ్. సుహాస్ చాలా తక్కువగా మాట్లాడతారు. అయితే ఒక సీన్ కోసం నాకు చాలా సపోర్ట్ చేశారు. యాంకర్‌గా నన్ను ఎలా నిలబెట్టారో నటిగా కూడా అలాగే నిలబెడతారని కోరుకుంటున్నాను అని చెప్పుకొచ్చింది. ఇది చూసినవాళ్లు తనకు కంగ్రాట్స్ చెప్తున్నారు. అయితే స్రవంతి గతంలోనే నటిగా మారింది. బ్యాడ్ గాళ్స్ మూవీలో యాక్ట్ చేసింది. ఈ మూవీ వచ్చి ఎంతోకాలం అవలేదు. గతనెలలోనే విడుదలైంది. 2025 డిసెంబర్ 25న రిలీజైన ఈ మూవీ ఫ్లాప్‌గా నిలిచింది. బహుశా అందుకేనేమో.. దాన్ని పక్కనపెట్టి హే భగవాన్ తన తొలి సినిమా అని చెప్తోందని పలువురు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.



# రక్తం చూడని యుద్ధం ఉంటుందా? ఆసక్తికరంగా దీక్షిత్ శెట్టి 'శబర' టీజర్

'దసరా', 'దియా', 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన టాలెంటెడ్ నటుడు దీక్షిత్ శెట్టి కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'శబర'. ఈ సినిమా టీజర్‌ను తాజాగా విడుదల చేసింది చిత్రబృందం. ఈ టీజర్ చూస్తుంటే బంగారం నిధి వేటకి సంబంధించిన నేపథ్యంలో సాగే కథలా కనిపిస్తుంది. కిలారు ప్రేమ్ చంద్ దర్శకత్వంలో ఒక ఇంటెన్స్ పవర్‌ఫుల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో దీక్షిత్ శెట్టి మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో కనిపిస్తున్నారు. ఈ చిత్రంలో మిషా నారంగ్ కథానాయికగా నటిస్తుండగా, మోహన్ భగత్, రాజీవ్ గోవింద పిళ్ళై, కృతికా సింగ్ యాదవ్, భూషణ్ కళ్యాణ్, ఆరుష్, ప్రమోదిని వంటి పలువురు నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. హర్షిత చదలవాడ, దుర్గ చుంచు మరియు రమాదేవి కిలారు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు మిథున్ ముకుందన్ అద్భుతమైన నేపథ్య సంగీతాన్ని అందించారు. అజయ్ అబ్రహం జార్జ్ సినిమాటోగ్రఫీ, భువనేష్ మణివన్నన్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించగా, నటరాజ్ మాడిగొండ యాక్షన్ సన్నివేశాలను అద్భుతంగా రూపొందించారు. అత్యున్నత సాంకేతిక విలువలతో, హార్న్‌బిల్ వీఎఫ్ఎక్స్ సంస్థ విజువల్స్ తో విజువల్ వండర్ లా అనిపిస్తున్న ఈ టీజర్ ప్రస్తుతం సినీ ప్రియుల్లో అంచనాలను రెట్టింపు చేసింది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.




# మెగాస్టార్‌కి పద్మభూషణ్.. 'పాదయాత్ర' సెట్స్‌లో మమ్ముట్టికి ఘన సన్మానం



మలయాళ మెగాస్టార్ మమ్ముట్టికి కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. దాదాపు 40 ఏండ్లుగా సినిమా రంగంలో అతడు అందిస్తున్న సేవలకు గాను ఈ అవార్డును కేంద్రప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ శుభసందర్భంగా ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'పాదయాత్ర' సినిమా షూటింగ్ సెట్స్‌లో చిత్ర బృందం మమ్ముట్టిని ఘనంగా సన్మానించింది. భారత ప్రభుత్వం 2026 గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశంలోనే మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్‌ను ఆయనకు ప్రకటించడంతో సెట్స్‌లో పండుగ వాతావరణం నెలకొంది. లెజెండరీ దర్శకుడు అదూర్ గోపాలకృష్ణన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం సెట్స్‌లో యూనిట్ సభ్యులందరూ కలిసి మమ్ముట్టిని సత్కరించి తమ సంతోషాన్ని పంచుకున్నారు. దాదాపు 32 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మమ్ముట్టి మరియు అదూర్ గోపాలకృష్ణన్ కాంబినేషన్‌లో సినిమా వస్తుండటం, అదే సమయంలో ఈ గౌరవం దక్కడం విశేషం. గతంలో 1998లో పద్మశ్రీ, 2022లో కేరళ ప్రభ పురస్కారాలు అందుకున్న మమ్ముట్టి ఇప్పుడు పద్మభూషణ్ గ్రహీతగా నిలిచారు.

# పెళ్లి చూపులు సమయంలో హార్ట్ ఎటాక్ వచ్చినంత పనైంది.. తరుణ్ భాస్కర్ కామెంట్స్



తెలుగు సినీ పరిశ్రమలో వైవిధ్యమైన సినిమాలతో అలరిస్తున్నవారిలో తరుణ్ భాస్కర్ ఒకరు. తన ప్రత్యేక కథా శైలి, వినూత్న ప్రయత్నాలతో ఆయనను "స్టోరీ మేకర్"గా గుర్తిస్తారు. తాజాగా ఆయన దర్శకత్వంలో రూపొందిన 'ఓం శాంతి శాంతి శాంతిః' జనవరి 30న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా తరుణ్ భాస్కర్ మీడియాతో తన ప్రయాణాన్ని పంచుకున్నారు. తరుణ్ తన కెరీర్ మొదటి సినిమాగా వచ్చిన 'పెళ్లి చూపులు' విజయాన్ని గుర్తు చేసుకుంటూ, "ఆ విజయం నా కోసం ఎక్కువ ఒత్తిడిని తెచ్చింది" అని చెప్పారు. ఆ సమయంలో ఆయనకు ఎదురైన భయాలు, ఆందోళనలు, విజయంతో పాటు వచ్చిన బాధ్యతలన్నీ మామూలు అనుభవం కాదని అన్నారు. సినిమా రిలీజ్ సమయంలో హార్ట్ ఎటాక్ వచ్చినంత పనైందని స్పష్టం చేశాడు. విజయాన్ని సులభంగా స్వీకరించడం, అపజయాన్ని అధిగమించడం నిజమైన విద్య అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సినిమాలో హీరోయిన్ గా ఈషా రెబ్బ నటించగా, యూత్ ఫుల్ ఎలిమెంట్స్, హ్యూమర్, సెంటిమెంట్ అన్నీ తగినంత మేళవించబడ్డాయని తెలిసింది. తరుణ్ తన ప్రత్యేకమైన శైలిలో కథను రాసి, ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నారని నిర్మాతలు తెలిపారు. కేవలం దర్శకుడిగా కాకుండా, నటుడిగా కూడా తన మార్క్ సినిమాలను కొనసాగిస్తూ, ప్రతి సినిమాతో లోకల్ కల్చర్ ను విశేషంగా ప్రతిబింబించాలనుకుంటున్నారని ఆయన చెప్పినారు. తరుణ్ భాస్కర్ ఈ ప్రయాణంలో ఒక బలమైన పాఠాన్ని అందించారు. విజయం వచ్చినా, విఫలం అయినా, దానిని తట్టుకోవడమే నిజమైన గెలుపు. 'పెళ్లి చూపులు' నాటి ఆందోళనల నుండి నేడు 'ఓం శాంతి శాంతి శాంతిః' వరకు ఆయన నిరంతర కృషి, క్రియేటివిటీ, ధైర్యం యువ దర్శకులకు మార్గదర్శకం. జనవరి 30న విడుదలయ్యే ఈ సినిమా ప్రేక్షకులను ఏ విధంగా ఆకట్టుకుంటుందో వేచి చూడాలి.

# దుల్కర్ 'ఆకాశంలో ఒక తార' నుంచి శృతి హాసన్ ఫస్ట్ లుక్ విడుదల

దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా పవన్ సాధినేని దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఆకాశంలో ఒక తార'. ఈ చిత్రం నుంచి తాజాగా క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమాలో శృతి హాసన్ ఒక కీలక పాత్రలో నటిస్తుండగా.. ఆమె బర్త్‌డే సందర్భంగా మూవీ నుంచి శృతికి బర్త్‌డే విషెస్ తెలుపుతూ.. ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్ మరియు లైట్ బాక్స్ మీడియా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రంలో సాత్విక వీరవల్లి హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. ఇప్పటికే విడుదలైన సాత్విక గ్లింప్స్ ఒక పల్లెటూరి అమ్మాయి కలల నేపథ్యంతో ఆకట్టుకోగా, ఇప్పుడు శృతి హాసన్ రాకతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం వేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని 2026 వేసవిలో తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.



# రొమాంటిక్ హీరోతో కోలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్న మృణాల్!

'సీతారామం, ఫ్యామిలీ స్టార్' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు బాలీవుడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ సుపరిచితురాలే. అయితే మృణాల్ ఠాకూర్‌కు కోలీవుడ్ నుంచి కబురు వచ్చిందట. శింబు హీరోగా తమిళంలో 'ఓ మై కడవులే, డ్రాగన్ (తెలుగులో 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ 'గా విడుదలైంది)' వంటి సక్సెస్‌ఫుల్ సినిమాలకు దర్శకత్వం వహించిన అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఏజీఎస్ ఎంటర్‌టైన్ మెంట్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుంది. కాగా ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు మృణాల్ ఠాకూర్‌ను ఎంపిక చేసుకున్నారట చిత్రం యూనిట్. మృణాల్‌కు ఆల్రెడీ మేకర్స్ ఈ సినిమా కథ వినిపించారని, ఆమె ఈ సినిమాలో నటించేందుకు ఆల్మోస్ట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఒకవేళ ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ నటించనున్న విషయం అధికారికంగా వెల్లడైతే, మృణాళ్‌కు తమిళ్‌లో ఇదే తొలి చిత్రం అవుతుంది. మరి..ఈ సినిమాతోనే మృణాల్ కోలీవుడ్ ఎంట్రీ జరుగుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఇక ప్రస్తుతం అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న సినిమా, అడవి శేష్ హీరోగా చేస్తున్న 'డెకాయిట్' చిత్రాలతో మృణాల్ ఠాకూర్ బిజీగా ఉన్నారు. అలాగే ఆమె హిందీలో నటించిన 'దో దీవానే షెహర్ మే' చిత్రం ఈ ఫిబ్రవరి 20న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ఈ చిత్రాలే కాదు..మరికొన్ని హిందీ చిత్రాల్లోనూ ఆమె నటిస్తున్నారు. బాలీవుడ్ సక్సెస్‌ఫుల్ టాప్ హీరోయిన్ ప్రియాంకా లైఫ్ జర్నీ అంటే తనకు ఎంతో ఇష్టమని చెబుతున్నారు మృణాల్ ఠాకూర్. ఈ అంశంపై ఇటీవల ఆమె ఇంటర్వ్యూలో స్పందించారు. "సినీ ఇండస్ట్రీ బ్యాక్‌గ్రౌండ్ లేకుండ సినిమాల్లోకి వచ్చారు ప్రియాంకా చోప్రా ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొని, కష్టపడి గ్లోబల్ రేంజ్ హీరోయిన్ గా రాణిస్తున్నారు. అలాగే ప్రియాంక చోప్రా యువతకు ఇచ్చే సూచనలు, సలహాలు నాకు చాలా ఇష్టం. ఇలా ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచిన ప్రియాంకా చోప్రా నాకు కూడా స్ఫూర్తి. నా ప్రయాణం, ప్రియాంక చోప్రా ప్రయాణం పూర్తిగా భిన్నమైనవి. కానీ మా ఇద్దరి



Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

# అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఘనంగా సమ్మక్క సారక్క జాతర మహోత్సవం









**ధర్మఘంట, జనవరి28, కరీంనగర్**

సమ్మక్క సారక్క జాతర మహోత్సవం తెలంగాణలో అతిపెద్ద గిరిజన పండుగని, కుంభమేళా తలపించే విధంగా ఈ మహోత్సవాన్ని మేడారంతోపాటు ఇతర ప్రాంతాల్లో సైతం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు.బుధవారం కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో జాతర మహోత్సవం ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సాంప్రదాయంగా జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మక్క - సారక్క చిత్రపటాలకు పూజ కార్యక్రమాన్ని నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారంలో నిర్వహించే ఈ జాతరకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉన్నదని మరియు 2014లో అప్పటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించడం జరిగిందని రెండేళ్ల ఒకసారి నిర్వహించుకునే ఈ పండుగ మన రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్గఢ్, ఒరిస్సా, జార్ఖండ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుండి అత్యధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుంటారని చెప్పారు. నాలుగు రోజులపాటు ఉత్సవంలా కొనసాగే ఈ జాతర తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్తుందని గుర్తు చేశారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సమ్మక్క - సారక్క వీరోచిత పోరాటం చేశారని, ప్రజలకు అన్యాయంపై పోరాటం చేశారని గుర్తు చేస్తూ సమ్మక్క సారక్కలను ఆరాధించిన వారికి విజయాలు కలుగుతాయని వారు చెప్పారు. ఈ జాతర మహోత్సవంలో సాంప్రదాయబద్ధంగా బెల్లం నైవేద్యంగా సమర్పించడం ఒక గొప్ప ఆనావాయితి అని తెలుపుతూ 900 సంవత్సరాల చరిత్ర కలిగినటువంటి ఈ జాతర నేటికి తరగని ఉత్సాహంతో నిర్వహించడం చాలా హర్షించదగ్గ విషయమని తెలియజేశారు. ప్రజలందరూ ఈ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రేమ ఆప్యాయలతో నిర్వహించుకుని అభివృద్ధికి పాటుపడాలని వారు చెప్పారు. ప్రజలందరికీ మేడారం సమ్మక్క సారక్క జాతర మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల సందర్భంగా ప్రాంగణాన్ని సంప్రదాయబద్ధంగా అలంకరించి సుమారు వందమంది విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో విచ్చేసి పండుగ వాతావరణం రెట్టింపు చేశారు. వేడుకలను భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి సమ్మక్క సారక్క వైభవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్.

## నిబంధనల ప్రకారం నామినేషన్ ప్రక్రియ కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి.





**ధర్మఘంట, జనవరి 28, కరీంనగర్:**

ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా హుజురాబాద్, జమ్మికుంట మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, నామినేషన్ ఫారాలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఆయా వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించుకుని, వెంటవెంటనే రోజు వారీగా టీ.పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు. అభ్యర్థులు అన్ని వివరాలతో నామినేషన్ పత్రాలను దాఖలు చేసేలా హెల్ప్ డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, వారి సందేహాలు నివృత్తి చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి కట్టుబడి, మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 30వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని సూచించారు. నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలన జరిపేలా అవసరమైన సిబ్బందిని నియమించామన్నారు. ఎన్నికల సంఘం నియమ, నిబంధనలను పక్కాగా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండి. ఆయాజ్, హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ ఉన్నారు.

# అత్యాధునిక వైద్య విధానంతో ఆపరేషన్ లేకుండా చికిత్స

**అత్యాధునిక వైద్య విధానంతో ఆపరేషన్ లేకుండా చికిత్స**

**అకాలేసియా కార్డియా బాధితురాలికి ఉపశమనం**

**మలకపేట యశోద ఆసుపత్రి వైద్య బృందం విజయం**

**ధర్మ ఘంట జనవరి 28,సూర్యాపేట జిల్లా ప్రతినిధి**

:ఆహారం మింగలేని అరుదైన వ్యాధి అయిన అకాలేసియా కార్డియాతో బాధపడుతున్న సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి చెందిన 63 ఏళ్ల మహిళకు మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు అత్యాధునిక వైద్య విధానంతో ఆపరేషన్ లేకుండా విజయవంతంగా చికిత్స అందించినట్లు మలకపేట యశోద ఆసుపత్రి మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రలాజిస్టు డాక్టర్ ఎన్, కిషన్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ చిదుర శ్రీనివాస్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఖమ్మం రోడ్డు భాస్కర ఇన్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత కొంతకాలంగా ఆహారం మింగడంలో తీవ్ర ఇబ్బందులు, ఛాతీలో నొప్పి బరువు తగ్గడం వంటి సమస్యలతో బాధపడుతున్న ఆమె ఆసుపత్రిలో చేరారని తెలిపారు. వైద్య పరీక్షలు ప్రత్యేక




ఎండోస్కోపిక్ మూల్యాంకనంలో రోగికి టైప్× అకలాసియా కార్డియాగా నిర్ధారణ కావడంతో మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రలాజిస్టు వైద్యులు డాక్టర్ ఎన్,కిషన్ పర్యవేక్షణలో ఆధునిక పి.ఒ.ఇ.ఎమ్ (పర్ ఓరల్ ఎండోస్కోపిక్ మయోటోమీ) అనే అత్యాధునిక ఎండోస్కోపిక్ చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ విధానం ద్వారా శస్త్రచికిత్స లేకుండానే అన్నవాహిక కండరాల ఒత్తిడిని తగ్గించి, ఆహారం సజావుగా లోపలికి వెళ్లేలా చేసినట్లు చెప్పారు. చికిత్స అనంతరం రోగి ఆహారం మింగగలగడం పూర్తిగా మెరుగుపడిందని వైద్యులు తెలిపారు. ఎలాంటి సంక్లిష్టతలు లేకుండా చికిత్స పూర్తయ్యిందని, రోగి ఆరోగ్యం వేగంగా కోలుకుందని పేర్కొన్నారు. యశోదా హాస్పిటల్‌లో ఉన్న అత్యాధునిక ఎండోస్కోపిక్ సదుపాయాలు, అనుభవజ్ఞులైన గ్యాస్ట్రోఎంటరాలజీ వైద్య బృందం సమగ్ర వైద్య నిర్వహణ వల్లే ఈ క్లిష్టమైన చికిత్స విజయవంతమైందని ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది. కార్యక్రమంలో మలకపేట యశోద ఆసుపత్రి సీనియర్ మేనేజర్ వాసుకిరణ్ రెడ్డి, ఏజీఎం వినయ్ కుమార్, మేనేజర్ స్వాగత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నామినేషన్ సెంటర్లను సందర్శించిన గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్



**ధర్మఘంట, జనవరి28,రామగుండం:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐదు నామినేషన్ కేంద్రాలను గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రాసేనా రెడ్డి తో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్, ఎన్నికల సిబ్బందితో మాట్లాడి భద్రతా చర్యలు, శాంతియుత వాతావరణంలో నామినేషన్ ప్రక్రియ నిర్వహణపై సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. 100 మీటర్స్ దూరం లోనే అందరిని ఆపివేయాలని, నామినేషన్ సెంటర్ లోకి అభ్యర్థి తో పాటు ఇద్దరు వ్యక్తులను మాత్రమే అనుమతించాలని, ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని సూచించారు.

## ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న మోడీకి బుద్ధి చెప్పాలి..

**సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా జిల్లా కార్యదర్శి జూపక శ్రీనివాస్**




**ధర్మఘంట, జనవరి 28,రామగుండం:**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక కూలి వ్యతిరేక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర కమిటీ ఈరోజు దేశవ్యాప్తంగా నిరసన దినం పాటించాలని ఇచ్చిన పిలుపులో భాగంగా స్థానిక ఎన్టీపీసి గెట్ వద్ద మాస్ లైన్ ఆధ్వర్యంలో నిరసన దినంగా పాటిస్తూ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా మాస్ లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్,జిల్లా నాయకులు గుమ్మడి వెంకన్న,ఇసంపల్లి రాజేందర్, లు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్నటువంటి ప్రభుత్వం దేశవ్యాప్తంగా కార్మికులకు హక్కులు లేకుండా రక్షణ లేకుండా దుర్మార్గమైన విధానాలు కొనసాగిస్తుందని విదేశీ మరియు స్వదేశీ కార్పొరేట్లకు అనుకూలంగా వారి ప్రయోజనాలకుఅనుగుణంగా పనిచేస్తుందని కార్మికుల హక్కులను కాల రాస్తుందని మరోవైపు దేశవ్యాప్తంగా రైతాంగంపై దాడులు చేస్తుందని ఇంకోవైపు ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి దాని స్థానంలో వి బి జి రామ్ జి చట్టాన్ని ప్రవేశపెట్టిందని కార్పొరేట్ల ప్రయోజనం కోసం పర్యావరణ విధ్వంసాన్ని చేస్తూ ఆదివాసుల హక్కులు కాల రాస్తున్నారు మరోవైపు మతపరమైన దాడులను కొనసాగిస్తుందని ప్రజల హక్కుల్ని కాపాడడం కోసం ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించాలని జూపాక శ్రీనివాస్ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు గుమ్మడి వెంకన్న ఇసంపల్లి రాజేందర్ ఆడెపు శంకరన్న గొల్లపల్లి చంద్రన్న మార్త రామన్న పొల్లూరి భూషణం రాయమల్లు. పోచం నర్సయ్య లక్ష్మి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## 8వ డివిజన్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షునిగా అజాహరుద్దీన్ నియామకం

**ధర్మఘంట, జనవరి 28 మానకొండూర్:**



కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 8వ డివిజన్ ,అల్గునూర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షునిగా మహ్మద్ అజాహరుద్దీన్ నియామకమయ్యారు. ఈ మేరకు బుధవారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో గోపు మల్లారెడ్డి గెలుపు కోసం పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 8వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మనవేణి రమేశ్ యాదవ్, 8వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి,మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు రహమత్ హుస్సేన్, మాజీ కార్పొరేటర్ చల్లా రవీందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కంది లక్ష్మీనారాయణ రెడ్డి, కంది అశోక్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు,మామిడి నరేందర్ రెడ్డి, చిందం కిష్టయ్య, దాసం నాగేందర్ జాప రాఘవరెడ్డి, జాప రవీందర్ రెడ్డి, సింగం శ్రీనివాస్, కొమురయ్య, చిల్ల రాములు, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎన్నికల అధికారితో ఎలక్షన్ అబ్జర్వర్ భేటీ

**నిజామాబాద్, జనవరి 28 ధర్మ ఘంట:**



మున్సిపల్ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ గా నియమితులైన తెలంగాణ టెక్నాలజికల్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్.సత్యనారాయణ రెడ్డి బుధవారం కలెక్టరేట్ లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠితో భేటీ అయ్యారు. జనరల్ అబ్జర్వర్ కు పూలమొక్క అందించి స్వాగతం పలికిన కలెక్టర్, జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు.చేసిన ఏర్పాట్ల గురించి తెలియజేశారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. కాగా, మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి జనరల్ అబ్జర్వర్ కు ఫిర్యాదులు, సూచనలు చేయదలచిన వారు సెల్ నెంబర్: 95533 95000 కు ఫోన్ చేసి తెలుపవచ్చని ఎన్నికల పరిశీలకులు సత్యనారాయణ రెడ్డి సూచించారు. ఈ భేటీలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నోడల్ ఆఫీసర్ ఫర్ మైక్రో అబ్జర్వర్ సునీల్ ఉన్నారు.

ధర్మఘంట

# ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు

**ఎన్నికల ప్రవర్తన నియమవలి కఠినంగా అమలు ఫిర్యాదుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్**

ధర్మ ఘంట జనవరి 28, నల్గొండ




మున్సిపల్ ఎన్నికలను సవ్యంగా ,శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ తెలిపారు.బుధవారం అయన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ మరియు మీడియా కేంద్రాన్ని ప్రారంభించారు.అనంతరం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ,మిర్యాలగూడ, దేవరకొండ, నందికొండ, హాలియా, చిట్యాల, చండూరు మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశం మేరకు బుధవారం ఎన్నికల నోటిఫికేషన్ ను ఆయా మున్సిపల్ కేంద్రాల్లో జారీ చేయడం జరిగిందని తెలిపారు.ఈ నెల 28 నుండి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైందని, 30 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఈనెల 31న నామినేషన్ల పరిశీలన , ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు ఉంటుందని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు సవ్యంగా నిర్వహించేందుకుగాను వివిధ నోడల్ టీములను ఏర్పాటు చేయడం జరిగిందని,మున్సిపాలిటీల పరిధిలో ఉన్న మూడు లక్షల 9 వేల97 మంది ఓటర్లు ఓటు వేసేందుకు గాను 162 వార్డులలో 475 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, తగినంత మంది ఆట ఓ, ఏ ఆర్ ఓ లు,సిబ్బందిని నియమించామని,ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమాలని కఠినంగా అమలు చేస్తున్నామని, ఎఫ్ ఎస్ టి ,ఎస్ ఎస్ టి బృందాలన్ని నిన్నటి నుండి చురుకుగా పని చేస్తున్నాయని తెలిపారు. ఎన్నికల సమయంలో 50 వేలకు మించి ఎక్కువ డబ్బును, అలాగే ఆధారాలు లేని గిఫ్ట్ ఆర్టికల్స్ ను తీసుకు వెళ్లేందుకు అనుమతి ఉండదని, సరైన ఆధారాలు చూపిస్తే సరిపోతుందని వెల్లడించారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని, ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 18004251422 కు తెలియ చేయాలని, అలాగే సోషల్ మీడియా లో వచ్చేఅసత్య వార్తలు, ఫిర్యాదులను వాట్సాప్ నంబర్ 6305951279 కు తెలియజేయాలన్నారు.జిల్లా ఎస్ పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఎన్నికలను సవ్యంగా నిర్వహించేందుకుగాను తగినంత బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, నగదు, మద్యం వంటివి పంపిణీ కాకుండా నిఘా ఉంచుతామని, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, ఇతర బృందాలను అప్రమత్తం చేశామని తెలిపారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, డి పి ఆర్ ఓ యు. వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. అంతకుముందు మీడియా కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని మీడియా కేంద్రం ద్వారా మీడియా ప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందించడం జరుగుతుందని తెలిపారు.

# నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

## ఎన్నికల విధులను పక్కాగా నిర్వహించాలని అధికారులకు దిశా నిర్దేశం





నిజామాబాద్, జనవరి 28 ధర్మ ఘంట:

ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, ఎన్నికల విధుల పట్ల జాగరూకతతో వ్యవహరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలోని కంటేశ్వర్ మున్సిపల్ జోన్ ఆఫీసు, టీటీడీ కల్యాణ మండపంలలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, నామినేషన్ ఫారంలు, రిజిస్టర్లను పరిశీలించారు. అదేవిధంగా కామారెడ్డి జిల్లా ఇంచార్జి కలెక్టర్ గా కొనసాగుతున్న నేపథ్యంలో బాన్సువాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొదటి రోజు ఆయా డివిజన్లు, వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించుకుని, వెంటవెంటనే రోజు వారీగా టీ.పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలని అన్నారు. అభ్యర్థులు అన్ని వివరాలతో నామినేషన్ పత్రాలను దాఖలు చేసేలా హెల్ప్ డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, వారి సందేహాలు నివృత్తి చేయాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి కట్టుబడి, మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్ర స్థాయిలో ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 30వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని సూచించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు సంబంధిత మున్సిపాలిటీ పరిధిలోని ఏదైనా డివిజన్/వార్డులో ఓటరుగా నమోదై ఉండవచ్చని సూచించారు. అయితే ప్రతిపాదకులు (ప్రపోజర్స్) మాత్రం అదే డివిజన్/వార్డు కు చెందిన ఓటరు అయి ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అన్ని నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో ఓటర్ల జాబితాలను అందుబాటులో ఉంచామని, నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలన జరిపేలా అవసరమైన సిబ్బందిని నియమించామని అన్నారు. ఎన్నికల సంఘం నియమ, నిబంధనలను పక్కాగా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, ఎవరు కూడా ఎలాంటి అపోహలు, సందేహాలకు గురి కావద్దని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు తదితరులు ఉన్నారు.

## మెట్ పల్లి లో మున్సిపల్ నామినేషన్ ల ప్రక్రియ ను పరిశీలించిన కలెక్టర్ జి. సత్య ప్రసాద్



ధర్మ ఘంట జనవరి 28, మెట్ పల్లి:

జగిత్యాల జిల్లా మెట్ పల్లి మున్సిపాలిటీలో నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ జి సత్యప్రసాద్ పరిశీలించారు .ఎన్నికల నియమవళిని పక్కగా అమలు చేయాలని నామినేషన్ల స్వీకరణ సజావుగా పార్గదర్శకంగా జరిగేలా చూడాలని ఆయన అధికారులకు ఆదేశించారు మొదటి రోజు కావడంతో మందకోడిగా ప్రక్రియ కొనసాగుతుందని రేపటి నుంచి తాకిడి పెరిగే అవకాశం ఉందన్నారు దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ టీ మోహన్ , పాల్గొన్నారు

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే.




ధర్మఘంట, జనవరి 28 కరీంనగర్:

చొప్పదండి మున్సిపాలిటీల్లో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం పరిశీలించారు.నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. హెల్ప్ డెస్క్ వద్ద అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, శాంతియుత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని వెను వెంటనే టీ పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు. చొప్పదండి మున్సిపల్ పరిధిలోని వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ వివరాలను ఎన్నికల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

## రంజాన్ మాసం సందర్భంగా అన్ని సౌకర్యాలు కల్పించాలి : అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే




ధర్మఘంట, జనవరి 28, కరీంనగర్:

వచ్చే నెల 17 నుండి రంజాన్ మాసం ప్రారంభమవుతున్న దృశ్య జిల్లాలోని మసీదులు, ఈద్గాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత అధికారులను ఆదేశించారు.రంజాన్ మాసం ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో అడిషనల్ కలెక్టర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు.సామూహిక నమాజ్ చేసే ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. మసీదుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, దోమల సమస్య రాకుండా ఫాగింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. రంజాన్ పర్వదినం నేపథ్యంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, వీధిలైట్లు మరమ్మతులు ఉన్నచోట కొత్తవి అమర్చాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ప్రార్థన ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని తెలిపారు.ప్రార్థన సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఎలక్ట్రిసిటీ అధికారులను ఆదేశించారు. నగరంలో రద్దీ ఎక్కువగా ఉండే చోట ఉన్న ప్రార్థనా మందిరాల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని ఏసీపీకి సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డిఓ మహేశ్వర్, అడిషనల్ డిసిపి వెంకటరమణ, మున్సిపల్, ట్రాఫిక్, పోలీస్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

# రిపబ్లిక్ డే రోజున బాబాసాహెబ్ డా. బి.ఆర్. అంబేద్కర్ ఆత్మగౌరవాన్ని కాపాడిన మహిళా అధికారికి సెల్యూట్






ధర్మఘంట, జనవరి 28, హైదరాబాద్

రిపబ్లిక్ డే సందర్భంగా మహారాష్ట్రలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ను అవమానించిన ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆవేదన కలిగించింది. ఈ అవమానకర పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొన్న ఒక మహిళా పోలీస్ అధికారి, తన ఉద్యోగం సైతం సస్పెండ్ అవుతుందన్న సంగతి తెలిసినా, "ఉద్యోగం పోయినా పర్వాలేదు, కానీ అంబేద్కర్ కి అవమానాన్ని మాత్రం సహించను" అని స్పష్టంగా ప్రకటిస్తూ ఆ వేదికపై నుంచే "జై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్! జై భీమ్రావు అంబేద్కర్!" అని నినదించడం చరిత్రలో నిలిచిపోయే ధైర్యమైన చర్య. ఆ మహిళా అధికారి నిజంగా ఒక లేడీస్ సింహంలా నిలబడి, డా. అంబేద్కర్ గౌరవం అంటే ఈ దేశ రాజ్యాంగ గౌరవం కోట్లాది దళిత, బహుజనుల ఆత్మగౌరవం అని దేశానికి గుర్తుచేశారు. తన ఉద్యోగ భద్రత కంటే అంబేద్కర్ ఆత్మగౌరవాన్ని ముందుగా ఉంచిన ఆ మహిళా మూర్తికి దేశవ్యాప్తంగా సెల్యూట్. ఈ సందర్భంగా తెలంగాణ స్మాల్, మీడియం న్యూస్ పేపర్స్ మరియు మ్యాగజైన్స్ అసోసియేషన్ (ఐజియు – టియుడబ్ల్యూజే అనుబంధం) స్టేట్ వైస్ ప్రసిడెంట్ గోల్ల రమేష్ మాట్లాడుతూ ఆమెకు హృదయపూర్వక నమస్కారాలు తెలిపారు. ఈ దేశంలోని ప్రతి మహిళ, ప్రతి యువత ఆమె నుంచి ప్రేరణ పొందాల్సిన అవసరం ఉందని, అంబేద్కర్ కి అవమానం అంటే దేశమంతా అవమానపడినట్టే అనే ఆమె నినాదం మనందరికీ ఆదర్శమని, డా. అంబేద్కర్ సిద్ధాంతాలను, రాజ్యాంగ విలువలను ప్రజల మధ్య మరింత బలంగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, దేశ ప్రజల తరఫున, ఆ ధైర్యవంతమైన మహిళా అధికారికి అభినందనలు, వందనాలు, ధన్యవాదాలని పేర్కొన్నారు.

**అంబేద్కర్ పేరే మర్చిపోతారా? - గణతంత్ర వేడుకల్లో మంత్రిని నిలదీసిన మహిళా ఆఫీసర్**

మహారాష్ట్రలో బాబాసాహెబ్ ప్రస్తావన లేకుండానే రిపబ్లిక్ డే ప్రసంగం – తట్టుకోలేకపోయిన అటవీ శాఖ అధికారిణి – వేదికపైనే మంత్రి గిరీశ్ మహాజన్‌కు నిరసన ఎదురైంది. భారతదేశ 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల వేళ మహారాష్ట్రలోని నాసిక్‌లో అనూహ్య ఘటన జరిగింది. ఒక రాష్ట్ర మంత్రిని, ఒక మహిళా అధికారిణి వేదికపైనే నిలదీసి ప్రశ్నించిన వైనం ఇప్పుడు చర్చనీయాంశమైంది. రిపబ్లిక్ డే ప్రసంగంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరును ప్రస్తావించకపోవడంపై అటవీ శాఖ అధికారిణి మాధవి జాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర మంత్రి గిరీశ్ మహాజన్ తీరును ఆమె తప్పుబట్టారు.

"రాజ్యాంగం అమల్లోకి వచ్చిన ఈ పవిత్ర దినాన, ఆ రాజ్యాంగ నిర్మాత పేరే చెప్పరా? బాబాసాహెబ్‌ను విస్మరిస్తారా?" అంటూ ఆమె మంత్రిని, అధికారులను నిలదీసిన తీరు సంచలనం సృష్టించింది.

ఈ ఘటన నాసిక్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగింది. అక్కడ ప్రధాన గణతంత్ర వేడుకలు జరుగుతున్నాయి. మంత్రి గిరీశ్ మహాజన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంప్రదాయం ప్రకారం ప్రసంగించారు. అయితే, ఆ ప్రసంగంలో ఆయన ఎక్కడా బాబాసాహెబ్ అంబేద్కర్ పేరును ఉచ్చరించలేదు. ఈ కార్యక్రమానికి సంబంధం లేని ఎందరో వ్యక్తుల పేర్లను ఆయన ప్రస్తావించారు. కానీ రాజ్యాంగానికి ప్రతీక అయిన అంబేద్కర్ పేరును మాత్రం పూర్తిగా విస్మరించారు. కార్యక్రమాన్ని నడిపిస్తున్న మహిళా యాంకర్ కూడా అంబేద్కర్ పేరును ప్రస్తావించకపోవడం గమనార్హం.

**మండిపడ్డ మాధవి**

అక్కడే విధుల్లో ఉన్న ఫారెస్ట్ ఆఫీసర్ మాధవి జాదవ్ దీనిని గమనించారు. ఆమె తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ప్రోటోకాల్‌ను సైతం పక్కనబెట్టి ఆమె తన నిరసనను వ్యక్తం చేశారు. "రాజ్యాంగాన్ని రాసిన వ్యక్తిని ఈ సమాజం నుంచి తుడిచిపెట్టేయాలని చూస్తున్నారా?" అని ఆమె ప్రశ్నించారు. మంత్రి తీరుపై, యాంకర్ తీరుపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ కాసేపు గందరగోళం నెలకొంది. తోటి అధికారులు ఆమెను సముదాయించడానికి ప్రయత్నించినా ఆమె తగ్గలేదు.

**కూలీ పని చేసుకుంటా, కానీ**

దీనికి సంబంధించిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ వీడియోలో మాధవి ఆవేదన స్పష్టంగా కనిపిస్తోంది. "మంత్రి బాబాసాహెబ్ పేరు చెప్పలేదు. ఇది కచ్చితంగా గార్డియన్ మినిస్టర్ చేసిన అతిపెద్ద తప్పు. ఆయన తన తప్పును ఒప్పుకోవాలి. దీనివల్ల నన్ను సస్పెండ్ చేసినా పర్లేదు. ఉద్యోగం పోయినా భయపడను. అవసరమైతే కూలీ పని చేసుకుని బతుకుతాను. కానీ బాబాసాహెబ్ గుర్తింపును చెరిపేయడానికి ప్రయత్నిస్తే మాత్రం ఊరుకోను. ఆయన గౌరవాన్ని తగ్గించే పనులు చేస్తే నేను చూస్తూ ఉండలేను" అని మాధవి అధికారులతో వాగ్వాదానికి దిగారు.

**అసలేం జరిగిందంటే**

మాధవి జాదవ్ ధర్మఘంట'తో మాట్లాడుతూ మరిన్ని వివరాలు వెల్లడించారు. "మంత్రి బహుమతులు ఇస్తున్న సమయంలో నేను ప్రోటోకాల్ ప్రకారమే వేదిక దగ్గరకు వెళ్లాను. ఆయన బాబాసాహెబ్ పేరు చెప్పలేదు. కనీసం నివాళి అర్పించలేదు. ఇదే విషయాన్ని నేను యాంకర్‌తో చెప్పాను. మంత్రి జెడ్–సెక్యూరిటీలో ఉన్నారని, ఆయన వెళ్లాక మాట్లాడమని చెప్పారు. కనీసం ఒక్క సెకను కూడా కేటాయించలేదు. నేను కేవలం అంబేద్కర్ విషయం మాత్రమే కాదు, తపోవన్‌లో చెట్ల నరికివేతను ఆపాలని కూడా మంత్రిని కోరాలనుకున్నాను. కానీ వారు నాకు అవకాశం ఇవ్వలేదు. కార్యక్రమం మొత్తం స్క్రిప్ట్ ప్రకారం జరిగింది. అందులో ఎక్కడా అంబేద్కర్ స్మరణ లేదు. నివాళి లేదు, నినాదాలు లేవు. ఇది ఖచ్చితంగా కుల వివక్షే" అని ఆమె ఆరోపించారు.

**పోలీసుల అదుపులో**

మాధవి జాదవ్ నిరసనతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆమెను అక్కడి నుంచి బలవంతంగా వాహనంలో ఎక్కించి తరలించారు. "నేను మనసులోనే బాబాసాహెబ్‌కు జైకొట్టాను. అప్పుడే పోలీసులు నన్ను అదుపులోకి తీసుకున్నారు. కాసేపటి తర్వాత నన్ను విడుదల చేశారు. నా తరఫున నేను రాజ్యాంగ నిర్మాతకు నివాళి అర్పించాను. దీనిపై నేను గర్వపడుతున్నాను" అని ఆమె తెలిపారు. వివాదం ముదరడంతో మంత్రి గిరీశ్ మహాజన్ స్పందించారు. "అంబేద్కర్ పేరును విస్మరించాలన్న ఉద్దేశం నాకు లేదు. అది అనుకోకుండా జరిగిన పొరపాటు మాత్రమే. నేను భారత్ మాతాకీ జై, వందేమాతరం, శివాజీ మహారాజ్ కీ జై వంటి నినాదాలు చేశాను. బాబాసాహెబ్ పేరును ఉద్దేశపూర్వకంగా వదిలేయలేదు. జరిగిన దానికి విచారం వ్యక్తం చేస్తున్నాను" అని మంత్రి వివరణ ఇచ్చారు.

# కార్పొరేట్‌కు ధీటుగా నల్లగొండలో ప్రభుత్వ పాఠశాల

# విద్యలో విప్లవానికి నాంది పలికిన నల్లగొండ బొట్టుగూడ స్కూల్





ధర్మఘంట, జనవరి 27, నల్లగొండ

భారతదేశంలోనే అత్యున్నత ప్రమాణాలతో ప్రభుత్వ పాఠశాలలు ఉండాలనే లక్ష్యంతో, ప్రపంచ స్థాయి 'వాల్డార్ఫ్' విద్యా విధానం స్ఫూర్తితో నల్లగొండ పట్టణంలోని బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలను కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ నిధులతో నిర్మించారు. ఏసీల సౌకర్యంతో డిజిటల్ క్లాస్‌రూమ్స్, 45 కంప్యూటర్లతో కంప్యూటర్ ల్యాబ్, ఎస్టీఈఎం (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం) విద్య, గ్రంథాలయం, స్పోర్ట్స్ రూమ్స్, యోగా సెంటర్ వంటి ఆధునిక వసతులు ఈ పాఠశాల నందు అందుబాటులో ఉన్నాయి. ఈ పాఠశాల నిర్మాణంతో నల్లగొండ నడిబొడ్డున ఉన్న బొట్టుగూడలో ఒక చరిత్ర తిరగరాయబడింది అని 100శాతం చెప్పవచ్చు.

70 ఏళ్లుగా సొంత భవనం లేని ఆ ప్రభుత్వ పాఠశాల.. ఇప్పుడు కార్పొరేట్ స్కూల్‌లకే సవాల్ విసిరే స్థాయికి ఎదిగింది... ఆటబొమ్మలతో శిశు తరగతులు,కంప్యూటర్ ల్యాబ్‌లతో హైస్కూల్ విద్య, ఆడియో – వీడియో పాఠాలతో ఆధునిక బోధనలు, విలువలు, సృజనాత్మకత, అనుభవాత్మక విద్యకు పెద్దపీట. ఇవన్నీ ఇకపై నల్లగొండ బొట్టుగూడలోని కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ పాఠశాల లో సాధారణమే కాబోతున్నాయి...

ప్రభుత్వ పాఠశాలలో తొలిసారిగా వాల్డార్ఫ్ విద్యా విధానం విద్య అనేది పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థి వ్యక్తిత్వాన్ని మలిచే ప్రక్రియగా ఉండాలన్న ఆలోచనతో ప్రభుత్వ పాఠశాలల్లో తొలిసారిగా వాల్డార్ఫ్ విద్యా విధానంను ఇక్కడ అమలు చేస్తున్నారు...

సృజనాత్మకత, అనుభవం, విలువల ఆధారిత బోధనతో విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఈ విధానం రూపుదిద్దుకుంది. రూ.8 కోట్లతో నాలుగంతస్తుల ఆధునిక భవనం కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.8 కోట్ల వ్యయంతో బొట్టుగూడ (ప్రకాశం బజార్)లో జీ ప్లస్ త్రీ అంతస్తులతో అత్యాధునిక భవనం నిర్మించారు. సుమారు 600 మంది విద్యార్థులు చదువుకునేలా ప్రతి అవసరాన్ని ముందే అంచనా వేసి నిర్మాణం చేపట్టారు. 36 ఏసీ గదులు, కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాల అయినప్పటికీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పించారు. 36 ఏసీ తరగతి గదులు కంప్యూటర్లతో కూడిన డిజిటల్ బోర్డ్స్ ఆధునిక ల్యాబ్‌లు మినీ ఆడిటోరియం విశాలమైన గ్రంథాలయం పై అంతస్తులో ఆడిటోరియం, ల్యాబ్ ల ఏర్పాటు విద్యార్థులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

చిన్నారులకు ఆటతో కూడిన విద్య శిశు తరగతుల కోసం ప్రత్యేకంగా ఆటబొమ్మలతో ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఆటలోనే విద్యఀ విద్యలోనే ఆనందం.. అనే భావనకు ఇది ప్రత్యక్ష ఉదాహరణ. సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధతో ప్రతి అంతస్తులో తాగునీటి సౌకర్యం, కార్పొరేట్ స్థాయిలో వాష్‌రూమ్‌లు, 1.50 లక్షల లీటర్ల సామర్థ్యంతో నీటి ట్యాంకు, లిఫ్ట్ సదుపాయం (ఒకేసారి 18 మంది ప్రయాణించే సామర్థ్యం), టెన్నిస్ కోర్టు, విశాలమైన ఆటస్థలం పిల్లల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఔదార్యం..**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ పాఠశాల నిర్మాణానికి కీలకంగా వ్యవహరించారు. పనుల పర్యవేక్షణ బాధ్యతను ఈ పాఠశాల ఉపాధ్యాయుడు సలీమ్ కు అప్పగించగా, గత 16 నెలలుగా ఆయన ప్రతిరోజూ పనులను పర్యవేక్షిస్తూ ఈ భవనాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారు. వేలాది జీవితాలకు వెలుగు నింపిన విద్యాలయం ఇప్పటికే ఈ పాఠశాల నుంచి చదువుకొని దేశ, విదేశాల్లో ఉన్నత హోదాల్లో ఉన్న వేలాది మంది విద్యార్థులు ఉన్నారు. ఇప్పుడు సొంత భవనం కల నెరవేరడంతో ఈ పాఠశాల నుంచి మరింత ప్రతిభావంతులు రాబోతున్నారనే నమ్మకం వ్యక్తమవుతోంది. నేడు ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రేపటి భవిష్యత్తుకు పునాదిగా నేటి ఉదయం 9:30 గంటలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ అత్యాధునిక పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కేవలం ఒక స్కూల్ భవనం కాదు.! ప్రభుత్వ విద్యకు కొత్త దిశను చూపించే ఒక విద్యా విప్లవం.! అని, ఈ పాఠశాలకు "కోమటిరెడ్డి ప్రతీక్" పేరుకు అంగీకారం తెలిపిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి పాఠశాల ప్రతి పల్లెటూరు, గ్రామాల్లో ఉండాలని ఆశిద్దాం.. ఇంతటి మహోన్నతమైన పాఠశాల రూపకల్పం చేయబోతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డికి ధర్మఘంట జాతీయ తెలుగు దినపత్రిక బృందం కృతజ్ఞతలు తెలుపుతుంది

## నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించిన జనరల్ అబ్జర్వర్



నిజామాబాద్, జనవరి 28 ధర్మ ఘంట

మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు సీహెచ్.సత్యనారాయణ రెడ్డి నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని కంటేశ్వర్ మున్సిపల్ జోన్ ఆఫీసు, ఫులాంగ్ టీటీడీ కల్యాణ మండపం, గౌతంనగర్, గోల్ హనుమాన్ వాటర్ ట్యాంక్, బడా బజార్ వాటర్ ట్యాంక్ తదితర కేంద్రాలను సందర్శించి, నామినేషన్ల స్వీకరణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. నిబంధనలకు అనుగుణంగా స్వీకరణ ప్రక్రియ జరుగుతోందా అని నిశిత పరిశీలన చేశారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, హెల్ప్ డెస్క్ లను పరిశీలించారు. టీ.పోల్ యాప్ లో ఎన్నికల రిపోర్టులు అప్లోడ్ చేస్తున్న వైనాన్ని పరిశీలించారు. అబ్జర్వర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, స్థానిక అధికారులు ఉన్నారు.

## ఎన్నికల విధులకు గైర్హాజర్ అయిన హెచ్.ఎం సస్పెన్షన్




నిజామాబాద్, జనవరి 28 ధర్మ ఘంట

ఎన్నికల విధులకు గైర్హాజర్ అయిన ఆర్మూర్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనజారెడ్డి సస్పెన్షన్ వేటుకు గురయ్యారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆర్మూర్ లోని 4, 5, 6 వార్డుల ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్.ఓ)గా హెచ్.ఎం వనజా రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. అయితే ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకుండా ఎన్నికల విధులకు గైర్హాజర్ అయ్యారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి దృష్టికి వచ్చింది. దీనిని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్, ప్రధానోపాధ్యాయురాలు వనజారెడ్డిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు హెచ్.ఎం వనజా రెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్ ఉత్తర్వులు జారీ చేశారు.

## నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం.





ధర్మఘంట, జనవరి 28, కరీంనగర్

హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో త్వరలో జరగనున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను ఆయన వ్యక్తిగతంగా పరిశీలించారు.హుజురాబాద్, జమ్మికుంట పురపాలక సంఘ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించి, అక్కడ కల్పించిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, జమ్మికుంట డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఏర్పాటు చేయబోయే కౌంటింగ్ కేంద్రాలను, బ్యాలెట్ బాక్సుల భద్రత కోసం కేటాయించిన స్ట్రాంగ్ రూమ్‌లను సిపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద నిరంతరం నిఘా ఉంచాలని, బందోబస్తు విషయంలో ఎటువంటి అలసత్వం వహించకూడదని సూచించారు.ఈ పర్యటనలో సిపితో పాటు ఏసీపీ మాధవి, జమ్మికుంట ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, హుజురాబాద్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభివృద్ధి కోసం ఏ పార్టీలు ఏ ప్రభుత్వాలు ఇప్పటివరకు చేసింది ఏమి లేదు

ధర్మ ఘంట జనవరి 28,సూర్యాపేట జిల్లా ప్రతినిధి

మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో పార్టీ శ్రేణులు ఎన్నికలకు సన్నద్ధం కావాలని టి ఆర్ పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంఛార్జ్ వట్టె జానయ్య యాదవ్ అన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా బుధవారం టిఆర్ పి జిల్లా కార్యాలయం లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో పాల్గొని మాట్లాడుతూ అగ్రకులాల పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు బడుగు, బలహీన వర్గాలను ఎప్పటికప్పుడు మోసం చేస్తూ వస్తున్నాయని తీవ్ర విమర్శలు చేశారు. మున్సిపల్ చైర్మన్ పదవిపై అన్ని వర్గాలకు ఆశ చూపి చివరికి అన్యాయం చేయడం సూర్యాపేట ప్రజలు ప్రతిసారీ చూస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభివృద్ధి కోసం ఈ పార్టీలు ప్రభుత్వాలు ఇప్పటివరకు ఏమీ చేయలేదని, చేయకుండా ఎప్పుడూ మోసమే చేస్తున్నాయని ఆరోపించారు.

ఈసారి సూర్యాపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజలందరూ తెలంగాణ రాజ్యాధికార పార్టీకి చెందిన కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం, నిజమైన ప్రజాపాలన కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీయే సరైన ప్రత్యామ్నాయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ నీరజ గౌడ్ , సూర్యాపేట జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య,



ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, చాంద్ భాయ్ జిల్లా మైనార్టీ ప్రెసిడెంట్, కార్యదర్శి నారాయణదాసు కవిత, మహిళా ఉపాధ్యక్షురాలు కవిత, పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు,కార్యదర్శి ఏశబోయిన మల్లేష్, సూర్యాపేట మండల అధ్యక్షుడు లింగస్వామి పెన్పహాడ్ మండల అధ్యక్షులు ఆవుల అంజయ్య, ఆత్మకూరు మండల అధ్యక్షులు బొల్లె సైదులు, మాజీ మార్కెట్ డైరెక్టర్ మురళి, రంగన్న, కుంభం వెంకన్న, దేశబోయిన మల్లేష్, 4వ వార్డ్ టీఆర్పీ సభ్యులు మొండే గోపి, నెలచర్ల మధు ప్రజాపతి, మామిడి ఉపేందర్, కడియం వంశీ, దీపమాల, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## హామిలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీని కార్పోరేషన్ ఎన్నికల్లో నీలదీయండీ..

**అడ్డగోలు హామిలిచ్చి అమలు చేయకుండా ప్రజలను వచించింది కాంగ్రెస్**

**ఎన్నికల కోడ్ అధికార పార్టీ కి వర్తించాదా**

**రామగుండానికి బీ.ఆర్.ఎస్ పార్టే శ్రీరామరక్ష**

**మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్**

ధర్మఘంట, జనవరి28,రామగుండం

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామిలను అమలుపర్చకుండా ప్రజలను మెసం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్పోరేషన్ ఎన్నికల్లో ఓట్లు అడిగెందుకు వస్తే కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డును చూపించి ప్రజలు నీలదీయాలని అబద్దాలకు మెసాలకు కెరాఫ్ కాంగ్రెస్ పార్టీ, అడ్డగోలు హామిలిచ్చి అమలు చేయకుండా ప్రజలను వంచించిన కాంగ్రెస్ పార్టీ కి బుద్ధిచెప్పి బీ.ఆర్.ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఎర్పాటు చేసిన విలేఖరుల సమావేశం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు సమయంలో ప్రతేక్షంగా సంతకాలు చేసిన అభయహస్తం కార్డు పేరిట ప్రతి ఇంటికి అందించి నమ్మబలికి ఎన్నికల్లో గెలిచాకా హామిలను అమలు చేయకుండా మెండి చెయ్యి చూపిందన్నారు. ఎన్నికల సమయంలో దొంగ హామీలు ఇవ్వడం అధికారం లోకి వచ్చాక మర్చిపోవడం కాంగ్రెస్ పార్టీకి పరి పాటిగా మారిందని మండిపడ్డారు. 420 హామీలు, ఆరు గ్యారెంటీలు ఇచ్చి, 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి రెండు సంవత్సరాలు గడుస్తున్నా వాటి



ఊసే ఎత్తడం లేదని దుయ్య బట్టారు. వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మి కులు, దివ్యాంగులకు డబుల్ పెన్షన్లు, ఆడబిడ్డల వివాహానికి తులం బంగారం, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే ఆడ పిల్లలకు సైకిళ్లు, స్కూటీలు, రైతులకు రుణమాఫీ, నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్, విద్యా భరోసా, ఉచిత కరెంట్, గ్యాస్ వంటి పథకాల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. ఉద్యమకారులకు 250చదరపు గజాల ఇంటి స్థలం, రూ.5 లక్షలు ఇస్తామని నమ్మించి మోసం చేశారన్నారు. రాజీవ్ యువ కిరణాల పేరుతో నాలుగుసార్లు దరఖాస్తులు తీసుకుని, ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఎన్నికలు కోడ్ అమల్లోకి రావడంతో మున్సిపల్ సిబ్బంది బీ.ఆర్.ఎస్ పార్టీ కి చెందిన ప్లేక్సీలను మాత్రమే తొలగించిందని కాంగ్రెస్ పార్టీ ప్లేక్సీలను తొలగించపోవాడానికి కారణం ఎమీటన్నారు. అధికార పార్టీ కి ఎన్నికల కోడ్ వర్తించదా అని ఆయన ప్రశ్నించారు. బీ.ఆర్.ఎస్ పార్టీ అభ్యర్థులను పార్టీ సర్వే సమన్వయ కమిటిలు ఎంపిక చేస్తాయని సోషల్ మీడియా లో ఆశవహులు తమకే టికెట్ వచ్చిందని ప్రచారాలు చెయవద్దన్నారు. కలసి కట్టుగా పని చేసి రామగుండం మేయర్ పీఠంపై గులాబీ జెండా ఎగురవద్దమని పిలుపునిచ్చారు. ఈ విలేఖరుల సమావేశం లో బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు మూల విజయ రెడ్డి నడిపెల్లి అభిషేక్ రావు గోపు అయులయ్య యాదవ్ నారాయణదాసు మారుతి చింటూ శాంతలక్ష్మి ఆవునూరి వెంకటేష్ బచ్చాల రాములు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# మునిసి'పోల్స్'లో వార్ వన్ సైడ్ కాంగ్రెస్, బీజేపీల ఓటమి డిసైడ్

ఆర్మూర్, జనవరి28 ధర్మ ఘంట

మునిసిపల్ ఎన్నికలలో వార్ వన్ సైడ్ అని, బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం, కాంగ్రెస్, బీజేపీల ఓటమి డిసైడ్ అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూరు మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు.

ఆర్మూరు మునిసిపాలిటీ పరిధిలో గత వారం రోజులుగా వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్ లోకి సాగుతున్న చేరికల జోరుతో ఆపార్టీ శ్రేణుల్లో నయా జోష్ కనిపిస్తోంది. కాంగ్రెస్ ,బీజేపీల తీరు నచ్చకే గులాబీ గూటికి సకల జనుల అడుగులు వేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుత మునిసి పాలిటీఎన్నికల నేపథ్యంలో ఆర్మూర్ పట్టణంలోని అన్ని వార్డుల నుంచి రోజు రోజుకూ చేరికల జోరు పెరుగుతోంది.

తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఆశీస్సులతో నియోజకవర్గంలో, ముఖ్యంగా ఆర్మూర్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్య క్రమాలు తప్ప గత రెండేళ్లుగా ఎలాంటి అభివృద్ధి లేదని కాంగ్రెస్, బీజేపీలపై కోపంతో ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ లోకి వస్తున్నారని స్థానిక బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. బుధవారం కూడా బీఆర్ఎస్ లోకి వలసల వరద పోటెత్తింది.

ఆర్మూర్ పట్టణంలో 27 వ వార్డ్ నుంచి ఎస్.ఆర్ రమేష్ ఆధ్వర్యంలో వందలాది మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు.వారందరికీ పార్టీ కండువా వేసి బీఆర్ఎస్ లోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి



వారికి పార్టీలో సముచిత స్థానం కలిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ పాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యమని ధ్వజమెత్తారు. బీజేపీ అధికారంలో ఉన్న కేంద్రం ద్వారా నిధులు సాధించడంలో ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తేవడంలో ఇక్కడి కాంగ్రెస్ నాయకులు ఘోరంగా విఫలమయ్యారని ఆయన విమర్శించారు. బీజేపీ నిజామాబాద్ జిల్లా ఎంపీ, ఆర్మూర్ ఎమ్మెల్యే జోకర్లుగా, కాంగ్రెస్ నేతలు బ్రోకర్లుగా మారారని ఆయన మండి పడ్డారు. నిజామాబాద్ ఎంపీ అరవింద్ ప్రజల మధ్య మతోన్మాద చిచ్చు పెడుతున్నారని ఆయన ఆరోపించారు. ఆర్మూర్ కాంగ్రెస్ ఇంచార్జి వినయ్ రెడ్డి నియోజకవర్గాన్ని దోచుకుతింటున్నారని ఆయన దుయ్యబట్టారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ ను మెప్పించి, ఒప్పించి దాదాపు 5వేల కోట్ల రూపాయలతో ఆర్మూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన చరిత్ర తనదన్నారు. ఒక్క ఆర్మూర్ పట్టణ అభివృద్ధికే అప్పటి మంత్రి కేటీఆర్ సహకారంతో వంద కోట్ల రూపాయలు మంజూరు చేయించానని, రూ.15 కోట్ల 60లక్షలతో గల్లీ గల్లీలో రోడ్లు వేయించానని ఆయన గుర్తు చేశారు. ఎన్నికల సమయం లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను విస్మరించడాన్ని ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారని ఆయన అన్నారు.

ఏ గల్లీలో చూసినా ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేకతే కనిపిస్తోందని ఆయన తెలిపారు.

మనసున్న మహారాజు కేసీఆర్ మళ్లీ వస్తేనే తెలంగాణకు మేలు జరుగుతుందన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా వ్యక్తమవు తోందన్నారు.

రేవంత్ రెడ్డి గోబ్యాక్, కేసీఆర్ కమ్ బ్యాక్ అని ప్రజలు నినదిస్తున్నారని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. ఎలెక్షన్ ఏదైనా ప్రజల సెలెక్షన్ కేసీఆరేనని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 7మునిసిపాలిటీలు, ఒక కార్పొరేషన్ గెల్చుకుంటామన్న ధీమాను జీవన్ రెడ్డి వ్యక్తం చేశారు. ఆర్మూర్ లో మొత్తం 36 వార్డులను క్లీన్ స్వీప్ చేసి సగర్వంగా గులాబీ జెండా ఎగురేస్తామని ఆయన తెలిపారు.

## సమ్మక్క- సారలమ్మ అమ్మవార్లను దర్శించుకున్న సింగరేణి సేవా సమితి సభ్యులు..

అర్జీ-1 ఏరియా సేవ సమితి అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్.

ధర్మఘంట, జనవరి 28,రామగుండం



:గోదావరి నది పరివాహక ప్రాంతంలో జరుగుచున్న సమ్మక్క సారలమ్మ జాతరలో అమ్మవార్లను దర్శించ్చుకున్న ఆర్జి-1 ఏరియా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్ సేవా సమితి సభ్యులత కలసి అమ్మవార్లను దర్శనం చేసుకోన్నారు. ఈ సందర్భంగా సేవా సభ్యులందరితో కలిసి అమ్మవార్లకు చీర, సారే, గాజులు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి అమ్మవార్లకు ముడుపులు చెల్లించడము జరిగింది. ల ఈ సందర్భంగా అనిత లలిత్ కుమార్ మాట్లడుతూ స్థానిక రామగుండం శాసన సభ్యులు రాజ్ ఠాకూర్ ఆదేశానుసారం మున్సిపల్ కార్పోరేషన్, సింగరేణి సంస్థ ఆర్జీ-1 ఏరియా సహాకారము అందించి భక్తుల సౌకర్యార్థం సకల సౌకర్యాలు కల్పించడం జరిగినదని తెలిపారు. ఈ జాతర మహోత్సవ కార్యక్రమములో అమ్మవార్ల దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులందరూ తరలిరావాలని తెలిపారు. ఆలాగే అమ్మవార్ల కృపతో ఆర్జీ. 1 ఏరియా లోని ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులందరికీ గాజులు కొని ఇవ్వడం జరిగినది. అందరికి భోజనాలు కూడా ఏర్పాటు చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో అనిత లలిత్ కుమార్ తో సేవా సెక్రటరి భీనాసింగ్, లేడిస్ క్లబ్ సెక్రటరి శిరీష, స్వరూప, అంజలి, సునీతా మరియు సేవా సభ్యులు సత్యవతి, రమాదేవి, సునీతా, లత, అంజలి, శ్రుతిమ, వనిత, సుజాత అధిక సంఖ్యలో సేవ సమితి సభ్యులు పాలుగోన్నారు.

## బరాబర్ ప్రేమిస్తా సినిమాను ఆదరించండి సినిమా డైరెక్టర్ సంపత్ రుద్ర



నిజామాబాద్ జనవరి28 ధర్మ ఘంట

బరాబర్ ప్రేమిస్తా సినిమాను ఆదరించండి అని సినిమా డైరెక్టర్ సంపత్ రుద్ర అన్నారు. బుధవారం నిజామాబాద్ నగరంలోని ప్రెస్ క్లబ్ లో బరాబర్ ప్రేమిస్తా సినిమా టీం డైరెక్టర్ సంపత్ రుద్ర, హీరో చంద్రహాస్, హీరోయిన్ మేఘన ముఖర్జీ, ఇంద్రకరణ్ లు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇదివరకు వచ్చిన ప్రేమ కథలకు భిన్నంగా అన్ని ఎమోషన్లతో కూడిన అందమైన ప్రేమ కథ చిత్రాన్ని నిర్మించి త్వరలో తమ చిత్రం విడుదలై ప్రేక్షకుల ముందుకు రానుందని కావున తమ చిత్రాన్ని ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు. ఈ చిత్రం పూర్తిగా దాదాపు తెలంగాణలోని ముఖ్యమైన జిల్లాలలో ఆయన వివరించారు. ఇదే బ్యానర్ పైన తమ తదుపరి చిత్రం కూడా ఉంటుందని ఆ చిత్రం దాదాపు 40 శాతం వరకు నిజామాబాద్ జిల్లాలో ని అందమైన లోకేషన్లను ఎంపిక చేసుకుని రాబోయే తమ చిత్రానికి రూపకల్పన చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. బరాబర్ ప్రేమిస్తా చిత్రంలో యువతకు మంచి మెసేజ్ ఇచ్చే విధంగా సినిమాను నిర్మించామన్నారు. సినిమాను తెలంగాణలో తీయడం జరిగిందన్నారు. తాను నెక్స్ట్ నిర్మించే సినిమాను నిజామాబాద్ లో చేసే ప్రయత్నం చేస్తామన్నారు. సి సి క్రియేషన్స్ లో నిర్మించిన ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆదరిస్తారని కోరారు.

## పేట లో సోనా బేకరీ స్వీట్స్ షాప్ ప్రారంభం




ధర్మ ఘంట జనవరి 28,సూర్యాపేట జిల్లా ప్రతినిధి

కీ!!శే!! తాటికొండ ఉప్పలయ్య చే ప్రారంభించబడి గత 40 సంవత్సరాలుగా సూర్యాపేట పట్టణంలో నాణ్యమైన స్వీట్స్ మరియు హోమ్ ఫుడ్స్ అందజేస్తున్న "సోనా బేకరీ అండ్ స్వీట్స్" స్థానిక ఎం.జీ.రోడ్ లో నూతన బ్రాంచ్ ను పట్టణానికి చెందిన మధు గురూజీ, ప్రోప్రైటర్ తాటికొండ ఉమా శంకర్ మరియు కుటుంబ సభ్యులు సంయుక్తంగా కలిసి ప్రారంభించారు.వారు మాట్లాడుతూ నాణ్యమైన స్వీట్స్ మరియు బేకరీ ఉత్పత్తులను సరసమైన ధరల్లో అందించునని సోనా బేకరీ & స్వీట్స్ పట్టణ ప్రజలందరూ ఉపయోగించుకోవాల్సిందిగా యజమాన్యం కోరింది .ఈ కార్యక్రమంలో యాక్సిస్ మరియు ఐసిఐసిఐ బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

